# పునరపి జననం

నవల

- కె.బి.కృష్ణ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 73

కౌముది మాసపత్రికలో

జనవరి 2012 నుంచి డిసెంబర్ 2012 వరకు

సీరియల్‌గా వచ్చిన నవల

**ఆ ఊరి పేరు సిరిపురం. మండల కేంద్రం.** ఆ ఊరిలో ఒక అధునాతన భవనం ఉంది. ఆ భవనాన్ని చూడగానే దానిని దాటి వెళ్ళేవాళ్ళు వెనక్కు తిరిగిచూసుకుంటూ అందమైన అమ్మాయిని చూసుకుంటూ వెళ్ళినట్లుగా వెళ్ళాల్సిందే

ఐదు వందల గజాల స్థలంలో పది అడుగుల ఎత్తులో నిర్మించబడిన బిల్డింగ్. రెండు పెద్ద గేట్లు. బయట భవంతి చుట్టూ ఇనుప గడ్డర్లతో నిర్మించిన ఫెన్సింగ్. ఆ ఫెన్సింగ్‌లో ముఖమల్ గడ్డి. దాని మధ్యలో అక్కడక్కడ ఆకర్షణీయమైన క్రోటన్ మొక్కలు, లిల్లీ గులాబీ పూలు గాలికి ఊగుతూ చూపరులను కవ్విస్తూంటాయి. భవంతి చుట్టూ మామూలు కాంపౌండు వాల్ కాకుండా కొంచెం ఎత్తులో దళసరి గ్లాస్‌తో గోడలా నిర్మించబడి, ఆ గ్లాస్ అంచులలో వెండి రంగులో రైలింగ్ బిగించబడి ఉంది. ఎవరైనా గేటు ముట్టుకుంటే భవంతిలో అలారం మోగే సౌకర్యం ఉంది.

సింహద్వారం తలుపు మీద చెక్కబడిన మహాలక్ష్మీ దేవి విగ్రహం చూపరులను సమస్కరించేట్లుగా ఆకర్షణీయంగా ఉంటుంది.

లోపలకు ప్రవేశిస్తే పెద్ద హాలు, హాలులోంచి భవంతి మొదటి అంతస్తులోకి వెళ్ళడానికి మెట్లు రెండుగా చీలి ఉండేదారి. అక్కడ ఒక ఆయిల్ పెయింటింగ్ అది ఆ ఇంటి మహారాజు గోవిందరాజులు గారిది, ఆయన మరణించి చాలాకాలమైంది.

ఆ భవంతిలో ప్రధానమైంది పూజా మందిరం. ఈశాన్యంలో కంచుగంటలతో ఏర్పాటు చేసిన టేకు తలపులు బిగించిన ఆ మందిరంలో సుమారు మూడు అడుగుల ఎత్తైన సప్తగిరీశుని విగ్రహం సకల ఆభరణాలతో అలంకరించబడి ఉంటుంది.

అలాగే కొంచెం చిన్న విగ్రహాలలో లక్ష్మీదేవి, గణపతి, గాయత్రీదేవి, తదితర దేవతామూర్తిలు కూడా కొలువై ఉన్నారు ఆ మందిరంలో.

ఇంకొంచెం ముందుకు వెళితే –

క్రింద అంతస్తులో మూడు బెడ్ రూములు ఒక కిచెన్, ఒక అతిథి గది, ఒక లివింగ్ రూం మరియు డైనింగ్ హాలు.

పై అంతస్తులో కూడా మూడు బెడ్ రూములు, ఒక కిచెన్, ఒక లింగ్ రూమ్, ఒక అతిథి గది, డైనింగ్ హాలు, భవంతికి పైకి వెళ్ళే మెట్లకూ హాలుకూ మధ్యలో సీలింగ్‌కి వేలాడే అతి ఖరీదైన షాండిలియర్, దాన్ని వెలిగిస్తే దాదాపు భవంతి అంతా కాంతులు విరజిమ్ముతుంది.

ఈ భవంతిని గోవిందరాజులుగారి ఏకైక కుమారుని యొక్క కుమారుడు, కుమార్తె ఈ మధ్యనే పునర్నించారు. అంతకు ముందు మండువా లోగిలిగా ఉండేది.

హాలులో ఉన్న ఉయ్యాల కుషన్స్‌తో బాలీసులతో చాలా రిచ్‌గా ఉంది. ఆ ఉయ్యాలబల్లపై నీలం రంగు అంచు ఉన్న గులాబీ రంగు వెంకటగిరి చేనేత చీర కట్టుకుని సుమారు డెబ్బై సంవత్సరాల వయసు ఉన్న ఒక స్త్రీ కూర్చుని ఉంది. ఆమె గోవిందరాజులు గారి సతీమణి పద్మావతీదేవి.

ఆమె శరీరం బంగారు రంగులో పచ్చగా ఉండి చీర రంగులో పోటీపడి మెరిసిపోతూంది. కళ్ళకు గోల్డ్ కలర్ ఫ్రేమ్‌తో అద్దాలు పెట్టుకుని ఉంది. చాలా హుందాగా ఉందామె. ఆమెలో సిరిసంపదలు ఉట్టిపడుతున్నాయి. ఆమె శరీరం మరీలావు కాదు. అలా అని సన్నమూ కాదు, చీరలో నిండుగా ఒదిగి ఉంది. వయసులో ఉండగా మాత్రం తప్పనిసరిగా అందంగా ఉండే ఉంటుంది మరి.

గోవిందరాజులు గారు మరణించాక ఉన్న ఒక్కగానొక్క కొడుకునీ అపురూపంగా పెంచుకుంటూ ఉండగా విధి వెక్కిరించిందా కుటుంబాన్ని. ఒక కొడుకునీ, కూతుర్నీ వదిలేసి అకస్మాత్తుగా ఒక విమాన ప్రమాదంలో మరణించారు కొడుకూ కోడలూ.

ఆ దుఃఖాన్ని దిగమింగుకుని పద్మావతీదేవిగారు ధైర్యంగా మనవణ్ణీ, మనవరాలినీ విద్యావంతుల్ని చేసి వివాహాలు కూడా చేసేసింది.

మనుమడు అమెరికాలో డాక్టరు, అతని భార్యకూడా డాక్టరే, వారికి ఒక్కడే కొడుకు.

మనుమరాలు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, భర్తకూడా ఇంజనీరే, వాళ్ళకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి.

వీళ్ళందరూ సుఖసంతోషాలతో జీవిస్తున్నారు.

సిరిపురంలో ఉన్న సుమారు వంద ఎకరాల పొలాల్లో వ్యవసాయం చేయించడం, ఆ రాబడిని జాగ్రత్త చేయడం, అప్పుడప్పుడు అమెరికా నుండి వచ్చిన మనుమడూ, మనవరాలికి లెక్కలు చెప్పడం పద్మావతీదేవిగారి కార్యక్రమం. వైద్య రంగం బాగా అభివృద్ధి చెందడంతో ప్రపంచంలో ఏభై సంవత్సరాలు వస్తే మధ్య వయసూ, డెబ్బై సంవత్సరాలు పైబడినా వృద్దులు అనకపోవడం పరిపాటి అయిపోయింది. పద్మావతీదేవిగారికి తోడుగా ఒక వంటమనిషి సీతమ్మ. ఆమె పద్మావతీ దేవిగారికి దూరపు బంధువు. చిన్నతనంలో భర్త చనిపోతే చేరదీసి తన దగ్గరే ఉంచేసుకుంది. సీతమ్మ అచ్చంగా సీతమ్మ తల్లిలాగే చాలా నెమ్మదస్తురాలు, ఎప్పుడూ నేత చీరలే కడుతుంది. చాలా సింపుల్‌గా ఉంటుంది. ముఖానికి పౌడరు రాసి ఎరగది. ఆమెకు మగాళ్ళ ఊసులు అసలే అక్కరలేదు. అందుకే పద్మావతీ దేవి గారికి దగ్గరయిందేమో.

ఒక సహాయకుడు సత్యనారాయణ, ఇతను కూడా పద్మావతీ దేవి గారి భర్తకు ఎక్కడో కలిసినవాడే ఏదో కొద్దిపాటి చదువు చదువుకున్నాడు. తన భార్యాపిల్లలతో ఒకనాడు వచ్చి ఆయన కాళ్ళ మీద పడ్డాడు దిక్కులేదని, మీరే దిక్కనీ. అంతే అప్పటినుండి వీళ్ళ కుటుంబంతోనే ఉంటున్నాడు.

బయట పొలం పనులూ, ఇతర డబ్బు లావాదేవీలు చూడడానికి ఒక చదువుకున్న యువకుడు గుమస్తా రవి. సీతమ్మా, పద్మావతీదేవిగారూ, సత్యనారాయణా పగలంతా ఇంట్లో ఉంటారు. రవి అప్పుడప్పుడు వచ్చిపోతూంటాడు.

హాలులో ఉయ్యాల బల్ల ఎదురుగా విదేశాలనుండి తెప్పించిన నూటఇరవై సెంటీమీటర్ల యల్.ఇ.డి టెలివిజన్ ఉంది. ఉదయాన్నే స్నానం చేశాక, ఒక గంట పూజా కార్యక్రమం తరువాత, భగవద్గీతా పారాయణం, ఆ తరువాత నుండీ టిఫిన్ చేసేటప్పుడూ, భోజనం, రాత్రి భోజనం వగైరాలు చేసేటప్పుడూ ఆమె బెడ్ రూంలోకి వెళ్ళేవరకూ టెలివిజన్ చూస్తూ ఆనందిస్తూ ఉంటారు. టెలివిజన్‌లో వచ్చే వింతలూ, విశేషాలూ, సీరియల్సూ వార్తలూ విశ్లేషణ చేసుకుంటూ ముగ్గురూ కాలక్షేపం చేస్తూ ఉంటారు. వారానికి ఒకరోజు గుమస్తా రవి వచ్చి పొలం వ్యవహారాలు, బ్యాంకుల్లో డిపాజిట్ల వడ్డీల వ్యవహారాలూ వగైరాలు చెబుతూంటాడు పద్మావతీదేవి గారికి.

పద్మావతీదేవి గారు ఉయ్యాల బల్లలో బాలీసులకు ఆనుకుని, తన ప్రక్కనే వెండిపళ్ళెంలో ఉన్ననేతిలో వేయించిన జీడిపప్పు నోట్లో వేసుకుంటూ టెలివిజన్ చూస్తూ ఉంటుంది. టెలివిజన్‌లో వార్తా ప్రసారం జరుగుతూంది. సీరియల్స్ ఇతర కార్యక్రమాలే కాకుండా తప్పని సరిగా వార్తలు చూడడం పద్మావతీ దేవి గారి నిత్యకృత్యం.

వార్తలు వస్తున్నాయి.

ఇంతలో తాటి కాయలంత అక్షరాలతో టెలివిజ స్క్రీన్ అంతా కనుపించేట్లుగా బ్రేకింగ్ న్యూస్ అని ఎఱుపు రంగులో తెల్లని అక్షరాళు వచ్చాయి.

"అమ్మగారూ ఏదో బ్రేకింగ్ న్యూస్ అటండీ బాబూ. బ్రేకింగ్ న్యూస్ అంటే టెలివిజన్ చూసే వాళ్ళ గుండె బ్రద్దలయ్యే వార్తలని అంటారండి " అన్నాడు సత్తెన్న అని పిలువబడే సత్యనారాయణ చిరునవ్వుతో.

"చాల్లేరా బడుద్దాయ్. మామూలు వార్తల కన్నా కొంచెం స్పెషల్‌గా ఉండే వార్తలను అలా అంటారు అదేమిటో చూడనీ " అంది పద్మావతీదేవి.

సీతమ్మ ముసిముసి నవ్వులు నవ్వుతూంది వీళ్ళ సంభాషణ వింటూ.

ఆ బ్రేకింగ్ న్యూస్ ఇలా కొనసాగుతూంది.

"విజయడలో ఒక పదకొండేళ్ళ పిల్లవాడు తన గత జన్మ రహస్యం చెబుతున్నాడు. అతను చెప్పే విషయాలు నిజమేనని కొందరూ, కాదు అంతా శుద్ధ అబద్ధం అని కొందరూ అనుకుంటున్నారు" అంటూ వార్త వస్తూంటే టెలివిజన్ స్క్రీన్ మీద ఆ పిల్లవాడిని

చూపిస్తున్నారు. అతను తెల్లని ప్యాంటూ షర్టు వేసుకున్నాడు. తెల్లగా బొద్దుగా ఉండి ముఖం తేజస్సుతో వెలిగిపోతూంది.నుదుట కుంకుమ బొట్టూ ఉంది.

విజయవాడలోని మా విలేఖరితో మాట్లాడి విషయాలు వివరంగా తెలుసుకుందాం అంటూ వార్తలు చదివే వ్యక్తి.

"హలో విజయవాడ విలేఖరి ఆన్‌లైన్ మిస్టర్ కుమార్.

గత జన్మ విశేషాలు చెప్పే పిల్లవాడిని ఇంటర్వ్యూ చేసి ప్రేక్షకులకు చూపించండి" అన్నాడు.

వెంటనే చేతిలో మౌత్ పీస్ తో విజయవాడ విలేఖరి టెలివిజన్ తెరమీద ప్రత్యక్షమయ్యాడు. అతని ఎదురుగా ఒక పిల్లవాడు నిలబడి ఉన్నాడు.

"బాబూ నీ పేరేమిటీ?"

"గోవింద"

"నువ్వు నీ గత జన్మ విశేషాలు చెబుతున్నావుట, నిజమేనా?"

అందుకు ఆ పిల్లవాడు తన ముఖం అదోలా పెట్టి చిరాకుగా

"గత జన్మ అని ఎవరన్నారు? నేను మాట్లాడేది ఈ జన్మ విషయాలే. నా పేరు గోవిందరాజులు. నా భార్య పద్మావతీ దేవి సిరిపురంలో ఉంది. నాకు ఒకే కొడుకు ఉండేవాడు. కొడుకూ కోడలూ విమాన ప్రమాదంలో చనిపోయారు. వాళ్ళకి ఒక అబ్బాయి అమ్మాయి వాళ్ళిద్దరూ అమెరికాలో ఉన్నారు. వాళ్ళకు పిల్లలు ఉన్నాను. నేను వెంటనే వెళ్ళి నా భార్యను చూడాలి, ఆమెను ఓదార్చాలి" అంటూ అతను చేతిరుమాలుతో కళ్ళు తుడుచుకుంటున్నాడు.

వెంటనే విజయవాడ విలేఖరి ప్రేక్షకుల వేపు తిరిగి "ఇదీ సంగతి. చూశారుగా గోవింద చెప్పే ఆసక్తికరమైన విషయాలు" అంటూ టెలివిజన్‌లో బ్రేకింగ్ న్యూస్ కొనసాగుతూంటే

హాలులో పద్మావతీదేవి గారి గుండెలు నిజంగానే పగిలిపోయాయి.

ఆమె టెలివిజన్ చూస్తూనే నోటికి కొంగు అడ్డం పెట్టుకుని రోదిస్తూంది వలవలా.

"అయ్యో దేవుడోయ్. ఇదెక్కడి చోద్యం రా బాబూ. నా దేవుడు మళ్ళీ పుట్టాడా!?" అంటూ పెద్దగా శోకాలు పెట్టసాగింది.

సంతోషం, దుఃఖం వ్యక్త పరచడానికి సిగ్గూ శరమూ ఉండవు ఎవరైనా చూస్తే, వింటే ఏమనుకుంటారో, బావుండదేమో అని మనిషికి అనిపించదు. అలాగే గొప్పా బీదా అనే తారతమ్యం కూడా ఉండదు. పద్మావతీ దేవి గారి పక్కనే ఉన్న సీతమ్మకు ఏం చేయాలో అర్థంకాక వింతగా ఆమెను చూస్తూ ఆమెకు దగ్గరగా జరిగింది ఓదార్చడానికి. ఇదేం చోద్యం ఉన్న పళంగా ఊడిపడింది. ఈ సంఘటన ప్రశాంతంగా ఉన్న ఈమె మీదకు అనుకుంటూంది.

పద్మావతీదేవి గారైతే ఏడుస్తూంది గాని సత్తెన్న, సీతమ్మ 'ఇదేం గోలరా బాబూ' అని విస్తుపోతున్నారు.

"ఏమిటీ వింత? ఎవరు చెప్పారు వాడికి అన్ని విషయాలు? జరిగినవి జరిగినట్లుగా భలే చెప్పేస్తున్నాడు, మాయదారి పిల్లోడు" అనుకుంటున్నారు ఇద్దరు.

పద్మావతిదేవిగారు ఇంకా ఏడుస్తూనే ఉంది.

"అమ్మగారు. మీరు ఊరుకోండి. ఏమిటి మీరు మరీనూ. దొంగ చచ్చినోళ్ళు టెలివిజన్‌లో పనీపాటా లేకుండా పిచ్చిపిచ్చి వాగుడు వాగుతా ఉంటూంటారు. అన్నీ మనం నమ్మకూడదు" అంటూ సముదాయిస్తున్న సీతమ్మను మాట్లాడవద్దని కుడి అరచేత్తో సైగ చేసి, పద్మావతీ దేవి.

"అదిగాదే వాడేం చెబుతున్నాడో విన్నావా లేదా? తనది సిరిపురం అని చెబుతున్నాడా? లేదా? తన పేరు గోవిందరాజులు అని చెబుతున్నాడా? నా కొడుకూ కోడలూ విమానప్రమాదంలో చనిపోయారని చెబుతున్నాడా? మనవడూ మనవరాలూ అమెరికాలో ఉన్నారని చెబుతున్నాడా లేదా? నా పేరు వివరంగా చెబుతున్నాడా ? ఇంకా ఏం కావాలే చెప్పవే బాబూ? మోసం అంటావేమిటే మోసం నీ మొఖం. టెలివిజన్ లో చూపిస్తున్న ఫోన్ నెంబరు ఒక చోట రాయండి, ఫోను చేసి మాట్లాడుదాం. అమెరికాకు కూడా ఫోను చేసి ఈ విషయంలో ఏం చెయ్యాలో అడుగుదాం." అందామె ఒక ప్రక్కన శోకాలు పెడుతూనే.

"అమ్మగారూ. ఇలాంటి విషయాలు గభాల్న నమ్మేయకూడదండీ బాబూ. మన ఊళ్ళో వాళ్ళే మన విషయాలన్నీ రహస్యంగా తెలుసుకుని, ఆ వివిరాలన్నీ ఒక పిల్లవాడికి చెప్పివాడిని ఉసిగొలిపి గతజన్మ అని నాటకమాడించి మనల్ని దోచుకోడానికి ప్రయత్నించవచ్చును కదా? అందుకని మనం కంగారు పడి ఇప్పుడే ఒక నిర్ణయానికి రాకూడదమ్మా" అన్నాడు నమ్మిన బంటు సత్తెన్న.

అందుకు బదులుగా సీతమ్మ వెంటనే.

"అమ్మగారూ ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చెప్పగలరు? మనం టెలిఫోను చేసి మాట్లాడుదాం. వివరాలు తెలుసుకుందాం. అవసరమైతే మనం వెళ్ళి ఆ పిల్లవాడిని చూసి మాట్లాడివద్దాం. అయినా అమ్మగారూ, మనం మన కుటుంబంలో ఏ పని చేసినా మన మాతను అడగాలి కదా. ముందుగా మాతను సంప్రదించి, ఆమెగారు ఏం చేయమంటుందో అడిగి, మాత ఆదేశాల ప్రకారం చేద్దాం. మాత తన దివ్య దృష్టితో చూసి నిజమేదో అబద్ధమేదో చిటికలో చెప్పేస్తుంది. అప్పుడు మనకు ఏం భయం ఉండదు" అంది.

వెంటనే పద్మావతీ దేవిగారు సీతమ్మతో "భలే చెప్పావే నా పాలిట సీతమ్మ తల్లీ - మనం రేపే మాత దగ్గరకు వెళదాం. విషయమంతా ఆమెకు చెప్పి సలహా తీసుకుందాం. మా బాగా చెప్పావు గదే" అంటూ సీతమ్మను ప్రశంసాపూర్వకంగా చూడసాగింది.

మనిషి మరణం తరువాత ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేకపోయారు. ఇంతవరకూ మనిషి మరణించేక ఏం జరుగుతుందో చూద్దామని కావాలని కొందరైతే చనిపోయి, ఆ తరువాత ఏమీ తెలుసుకోలేక మరణించారు అంతే!

అసలు మనిషికి పూర్వజన్మ జ్ఞానం ఉంటుందా? అది తేల లేదు ఇంతవరకూ అనేకమంది ఈ విషయమై పరిశోధనలు చేస్తూనే ఉన్నారు.

మనిషి దైనందిన జీవితంలో జాగ్రత్తగా మసలుకుంటాడని స్వామీజీలు తత్వవేత్తలూ మనిషి సుఖంగా ఉన్నప్పుడు ఇదంతా నువ్వు గతజన్మలో చేసిన పుణ్యాల ఫలితం అనీ, కష్టాలలో ఉన్నప్పుడు గత జన్మలో చేసిన పాపాల ఫలం అనీ చెబుతుంటారు. అలాగే నువ్వు ఈ జన్మలో జాగ్రత్తగా మసలుకుంటే వచ్చే జన్మలో మంచిపుట్టుక పుడతావనీ బోధిస్తూంటారు.

అయితే ఈ పునర్జన్మ రహస్యాలు చెబుతున్న పిల్లవాడి సంగతి ఏమిటి?

అసలు ఎవడు వీడు?

వాడు చెప్పినవన్నీ తన కుటుంబానికి సరిగ్గా అతికినట్లుగా సరిపోతున్నాయి. ఒకవేళ ఈ విషయాలన్నీ మా కుటుంబంతో సరిపోతున్నాయి కాబట్టి, వాడిని మా ఇంటికి తీసుకు వెళ్ళి కొన్నాళ్ళు ఉంచుకోమని వాళ్ళు అడుగుతారేమో?

అయినా వాళ్ళెవరు మనల్ని అడగడానికి?

ఒకవేళ మా ఇంట్లో ఉంచుకున్నామే అనుకో వాడికి ఈ ఇంట్లో స్థానం ఏమిటి?

అంతా అగమ్య గోచరంగా ఉందే?

అయినా-

తమ కుటుంబ శ్రేయోభిలాషి మాతా నిత్య సత్యానందమయి ఉందికదా.

ఆమెతో ఈ వివరాలన్నీ చెప్పి అసలు ఇందులో ఉన్న రహస్యం తెలుసుకోవాలి.

మాత తమ కుటుంబాన్ని ఎన్నో సంవత్సరాలనుండి తన అమూల్యమైన సలహాలతో తమ కుటుంబాన్ని ఆదుకుంటూంది.

ఏది ఏమైనా కృష్ణా రామా అనుకుంటూ చీకూ చింతా లేకుండా జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్న నాకు ఇదో పరీక్ష పెట్టాడేమిటి దేముడు?

అనుకుంటూ పరిపరి విధాలా ఆలోచనల్లో మునిగిపోయింది పద్మావతీదేవిగారు.

ప్రతీ మనిషి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడూ నేను ఎంతో సంతోషంగా ఉన్నాను.

నాకేం హాయిగా ప్రశాంతంగా జీవితం గడిచిపోతుంది.

అని అనుకున్నాడే అనుకోండి, అంతే అతనిలో అహంకారం ప్రవేశించినట్లే.

ఎప్పుడైతే ఈ అహంకారం అతనిలో పొడసూపుతుందో, అప్పుడే, వెంటనే సర్వేశ్వరుడు అతనిని పరీక్షిస్తాడు, ఆ అహంకారాన్ని అణగదొక్కడానికి.

ఇదే పద్మావతీ దేవిగారి పరిస్థితి.

●●●

**సిరిపురానికి ఏభై కిలోమీటర్ల దూరంలో ఒక పెద్ద ఆశ్రమం ఉంది.**

ఆ ఆశ్రమంలో సుమారు ఏభై పూరి పాకల వంటి రెల్లుగడ్డితో కప్పబడిన హట్స్ వంటివి ఉంటాయి. ఒక స్కూలు భవనం. ఒక ఆశ్రమ భవనం. ఆ ఆశ్రమానికి అధినేత్రి మాత భవంతి ఉంటాయి.

కొన్ని సంవత్సరాల క్రితం మాతా నిత్య సత్యానందమయి అంటే ఎవరికీ తెలియదు. ఎవరో రాజకీయ నాయకుని ప్రాపకంతో అక్కడ సుమారు పది ఎకరాల స్థలం ఆక్రమించుకుందనీ, ఆమెను భర్త వదిలేశాడనీ కాదు ఆమే భర్తను వదిలేసిందనీ, ఆమెకూ ఒక రాజకీయనాయకునికీ లింకు ఉందనీ, ఆమె కొంతమంది ధనవంతులను తన బుట్టలో వేసుకుని వారిని తన చెప్పుచేతులలో లింకు ఉందనీ, ఆమె కొంతమంది ధనవంతులను తన బుట్టలో వేసుకుని వారిని తన చెప్పుచేతులలో పెట్టుకుందనీ, వారి ఆసరాతో ఆశ్రమాన్ని నడిపిస్తూందనీ ఆమె అంటే కిట్టని వాళ్ళు అనుకుంటూ ఉంటారు.

సమాజంలో ఒకరి గురించి జనం చెడుగా మాట్లాడితే వారంటే కిట్టని వారనీ, వారి అభివృద్ధి చూసి ఓర్వలేక అలా అవాకులు చెవాకులు పేలుతున్నారనీ అంటారు. అదే వారిని గురించి కీర్తించినా, ప్రశంసలతో ముంచెత్తినా, గొప్పగా చెప్పినా, వారు శ్రేయోభిలాషులనీ, భక్తులనీ చెబుతూంటారు. ఇది అతి సాధారణ విషయం అయిపోయింది.

మాతా నిత్యసదానందమయి మొదట్లో ఒక గుడిసె వంటిది వేసుకుని జపం చేసుకుంటూ తన దారిలో తాను ఉంటూ ఉండేది. కానీ జనం ఊరుకోరు కదా! కాషాయ వస్త్రాలు చూసి తన దగ్గరకు వస్తే నాలుగు మంచి మాటలు చెప్పేది. కానీ మహిమలేవీ చూపించేది కాదు.

కానీ చిత్రమేమిటంటే, అతి తక్కువ కాలంలోనే ఆమె ఆశ్రమం విపరీతంగా అభివృద్ధి చెందింది. ఒక స్కూలు నిర్మించారు. వృద్ధులకు ఒక ఆశ్రమం ఏర్పాటు అయింది. అనాథలకు ఆశ్రయం కల్పించబడింది. వృద్ధాప్యంలో ఎవరైనా దంపతులు ఆశ్రమంలో ఉండి ప్రశాంతమైన జీవితం కొనసాగించాలనుకుంటే వారు కొంత డబ్బు చెల్లిస్తే వారికి ఒక గుడిసె వంటిది సకల సౌకర్యాలతో జీవితాంతం ఏర్పాటు చేయబడుతుంది.

ఈ మాతకు రాజకీయనాయకులతోనూ, మంత్రులతోనూ ప్రతిపక్షనాయకులతోనూ, గూండాలతోనూ, ల్యాండ్ మాఫియాతోనూ, సంఘవ్యతిరేక శక్తులతోనూ, ఇతర స్వామీజీలతోనూ పరిచయాలున్నాయని ఆమె అంటే కిట్టని వాళ్ళు అనుకుంటూ ఉంటారు.

ఇవన్నీ మాత చెవిన బడినప్పుడు, ఆమె వారందరినీ అజ్ఞానులు, అవివేకులు, భగవంతుని దర్శించలేని దౌర్భాగ్యులు, పాపం వారిని మాత క్షమించి వదిలేస్తోందనీ శెలవిస్తూ ఉంటుంది.

అలాగే అనేక సంపన్న కుటుంబాలలోని వారు ఆమె సలహాలు పాటిస్తూ, ఆమెను ఆరాధిస్తూ వారి జీవితాలను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఒక వేళ వారి  మేధా సంపత్తితో జీవితాలు వెళ్ళబుచ్చినా ఇదంతా మాత మహిమేనని అంటారు వారంతా.

గోవిందరాజులుగారు మరణించే సమయానికి ఆశ్రమం అభివృద్ధి పథంలో ఉంది. ఆయన ఆర్థికంగా హార్దికంగా మాతకు చాలా సహాయం చేశారు. అప్పటి నుండీ కుటుంబంలో మంచీ చెడూ ఏం జరిగినా మాతకు విన్నవించుకోవాల్సిందే

చిన్న ఓడలాంటి ఇన్నోవా కారు మాత ఆశ్రమం గేటు వద్దకు చేరగానే అక్కడ ఉన్న గూర్ఖా కారులోని పద్మావతీదేవి గారిని చూసి సలామ్ కొట్టి గేటు తెరిచాడు.

దర్జాగా దర్పంగా ఉన్న మగాళ్ళు కారులో కూర్చుని తమకు నమస్కరిస్తూ గౌరవిస్తున్న వారిని చూసి గర్వంగా తమ మీసాలు మీద చేతులు వేసుకున్నట్లుగా పద్మావతీ దేవి తన గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళజోడును తీసి కొంగుతో తుడుచుకుని నోటితో ఊది మరల పెట్టేసుకుంది.

మాతకు పద్మావతీదేవి గారు వచ్చినట్లుగా తెలిసిపోయింది, అక్కడ నెట్ వర్క్ అలాంటి మరి!

మాతా నిత్య సత్యానందమయి తన పర్సనల్ రూములో నుండి బయటకు వచ్చి మెట్ల మీద నిలబడింది.

ముదురు కాషాయ రంగు చీర కట్టుకుంది. మోచేతుల వరకూ ఉన్న జాకెట్ ధరించింది. ముఖమంతా పసుపు పూసుకుని, నుదురులో చాలా భాగం కుంకుమ బొట్టు ఉంది. ఆ బొట్టు చుట్టూ గంధం లైనింగ్ ఉంది. ఒక చేతిలో కమండలం, మరో చేతిలో రుద్రాక్షమాల వేళ్ళ మధ్యన జరుగుతూనే ఉంటుంది నిరంతరం - అంటే మాత జపం చేస్తూనే ఉంటుందన్నమాట.

అందమైన అమ్మాయి వయ్యారంగా నడిచి వచ్చినట్లుగా ఇన్నోవా కారు ఎగుడు దిగుడుల్లో ఊగుకుంటూ వచ్చి మాత ముందు ఆగింది.

సత్తెన్న కారు డోర్ తీయగానే పద్మావతీ దేవి కారు దిగింది దర్పంగా. కారు దిగంగానే ఎదురుగా మాతను చూసి ఆమె ఆశ్చర్యపోయింది. కారణం మాత ఎప్పుడూ ఆమెను ఆహ్వానించడానికి ఎదురు రాకపోవడమే.

ముందుగా సత్తెన్నా, ఆ తరువాత పద్మావతీ దేవి మాత కాళ్ళను తాకి భక్తి ప్రపత్తులతో గౌరవ వందనం చేశారు.

నా ముందు మీరంతా సూక్ష్మ క్రిములకన్నా హీనం రా అన్నట్లుగా వాళ్ళను చూసింది మాతా నిత్య సత్యానందమయి.

"అమ్మా మీతో పని పడింది. అందుకని అమ్మగారు అనుకున్నదే తడవుగా పరుగుతో వచ్చేశారు" అన్నాడు సత్తెన్న మాతను అనుసరిస్తూ.

మాత అభయ హస్తం చూపిస్తూ..

"నాకు తెలుసు రా బిడ్డా. మీరు ఈ రోజు ఉదయమే వస్తారని నా వాణి చెప్పింది రా. అమ్మ దగ్గరకు పిల్లలు రాకపోతే ఎవరు వస్తారు రా? అమ్మ ఆదరించాలి, సముదాయించాలి, సలహా చెప్పాలి. అప్పుడే కదురా నా పిల్లలు సుఖ సంతోషాలతో జీవించేది.." అంటూంది మాత.

"చూశారా అమ్మగారూ. మాతకు మనం వస్తున్న సంగతి అప్పుడే తెలిసిపోయింది" అని పద్మావతీదేవి గారి చెవిలో అంటున్న సత్తెన్నతో మాట్లాడ వద్దని సైగ చేసింది.

ఒక పెద్ద హాలులో ప్రవేశించారు అందరు.

ఆ హాలులో ఒక వైపు మధ్యలో పెద్ద వెండి సింహాసనం ఉంది. అటూ ఇటూ వింజామరలు పట్టుకుని ఇద్దరు యువకులు నిలబడి ఉన్నారు. వాళ్ళు లేత కాషాయరంగు డ్రెస్ వేసుకున్నారు. శరీరమంతా కప్పేసిన పొడవాటి నైటీలాంటివి ధరించారు వాళ్ళిద్దరూ.

మాత వెళ్ళి సింహాసనం మీద కూర్చుంది. అటూ ఇటూ ఉన్న యువకులు వింజామరలు ఊపుతున్నారు. ఆహాలులో మాతకు గాలి అవసరం లేదు, హాలు అంతా సెంట్రల్ ఎయిర్ కండిషన్ చేయబడి ఉంది భక్తులచే. అయినా మాత గొప్పతనానికి ఒక ప్రతీక కాబట్టి ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు ఇంకా.

మాతకు ఎదురుగా చాలా పెద్దదైన ఎర్రని తివాసీ పరిచి ఉంది. తివాసీ పై పద్మావతీ దేవి కూర్చుని ఉంటే, ఆమె పక్కనే చేతులు కట్టుకుని నిలబడి ఉన్నాడు సత్తెన్న.

పద్మావతీ దేవి కూర్చోగానే మాత కమండలంలో చేయి పెట్టి పద్మావతీ దేవి మీద, సత్తెన్న మీద దానిలోని పవిత్ర జలం జల్లింది. పద్మావతీదేవి సంతోషంతో పొంగిపోయి..

"మహాభాగ్యం మాతా" అని కళ్ళుమూసుకుని మోకరిల్లింది మాత ముందు.

ఆ తరువాత కొన్ని క్షణాలు కనులు మూసుకుని రుద్రాక్షమాలతో జపం చేస్తూ మౌనంగా కూర్చుండిపోయింది ధ్యానంలో మాత.

పది నిముషాల తరువాత కనులు తెరిచి..

"చెప్పు తల్లీ మీ రాకకు కారణం?" అంది చిరునవ్వుతో.

"అమ్మా ముందుగా మీ పాదాలకు నమస్కారం. నేను నిన్న సాయంకాలం టెలివిజన్‌లో" అన్న పద్మావతీ దేవి మాటలు పూర్తికాకుండానే తన అభయహస్తంతో ఇంకేం చెప్పద్దు అన్నట్లుగా సైగ చేసి

మాత చెప్పడం మొదలు పెట్టింది.

"విజయవాడలో ఒక పిల్లవాడు 'నేనే గోవిందరాజులుని మరలా జన్మించాను' అంటూ పూర్వ జన్మస్మృతులు చెబుతున్నాడు. అవునా? నీ భర్త బ్రతికే ఉన్నాడా అని నువ్వు మీ మాంసలో ఉన్నావు అవునా?

ఒకవేళ అతనే పునర్జన్మ ఎత్తాడేమో అని అనుకుంటున్నావు గదూ?

పిచ్చిదానా?

అతను నీ భర్తే..

అతను చేసిన పుణ్యకార్యాల వలన మరల జన్మించాడు.

నువ్వు అతన్ని ఏం చేద్దామనుకుంటున్నావు?

చెప్పు పద్మావతీదేవీ?"

అంటోంది మాత.

మాత మాటలు వింటున్న సత్తెన్నకీ పద్మావతీదేవికీ మతులు పోయాయి.

మేము మా బంగ్లాలో టెలివిజన్ చూడడమేమిటి? ఈమె మేము చూసినదంతా పూసగుచ్చినట్లుగా చెప్పేస్తోందేమిటి? అని మల్లగుల్లాలుపడుతున్నారు.

అంతే!

మరుక్షణం

సత్తెన్న ఒకవేపు నుండి, పద్మావతీ దేవి ఒకవైపు నుండీ సాష్టాంగపడిపోయారు మాత ముందు.

"భక్తులారా. నా మీద అపరిమితమైన భక్తి కాదు.

ముందు ముందు జరగాల్సినది ఏమిటో నిర్ణయించుకోండి.

మాత సూచనలూ, సలహాలూ, సందేశమూ, వినండి" అంది అభయహస్తం చిత్రంగా ఊపుతూ రాజకీయ నాయకుడు ఓటర్లకు చేయి ఊపినట్లుగా ఉంది ఆ చేయి ఊపడం.

"మాతా శరణు. మా అజ్ఞానాన్ని మన్నించి అసలు విషయాలు సెలవియ్యండి మాతా" అన్నాడు సత్తెన్న.

వెంటనే మాత పద్మావతీదేవి వేపు చూస్తూ.

"బిడ్డా పద్మావతీదేవీ! గోవిందరాజులు రాత్రి నాకు పూజలో కనుపించాడే అకాల మరణం చెందడం వలన పాపిచింతిల్లుతున్నాడే

అతగాడు నిన్ను వదిలి ఉండలేక పోతున్నాడే, తీవ్రమైన మనోవేదన అనుభవిస్తున్నాడే ఏం చేయమంటావు మాతా? అని నన్ను అడిగాడే పిచ్చిదానా?

పదకొండు సంవత్సరాల పిల్లవాడిగా ఇప్పుడు పూర్వజన్మ స్మృతి వచ్చింది నీకు. ఇప్పుడు నీవేం కుటుంబ బాధ్యతలు స్వీకరించగలవు? అని అడిగానే.

అందుకు బదులుగా నాకు నా భార్య పద్మావతీ దేవి ఎదురుగా ఉంటే చాలు ఇంకేమీ అవసరంలేదు నాకు అని విలపించాడే పిచ్చిదానా?

మరి ఏమంటావ్?

నీ నిర్ణయం ఏమిటి? "

అంటూ పూనకం వచ్చినట్లుగా మాత కళ్ళు మూస్తూ తెరుస్తూ ఊగిపోతూ ఉపన్యాసం ఇస్తుంది.

వెంటనే పద్మావతీదేవి మాత కాళ్ళమీద పడిపోయి

"అమ్మా నన్ను రక్షించు. నువ్వేం చేయమంటే అదే చేస్తాను. నాకు గోవిందరాజులు గారిని చూసుకోవాలనే ఉంది. మరి సమాజం సంగతి" అంది.

దానికి వెంటనే మాత కోపంతో ఊగిపోతూ

"పిచ్చిదానా సమాజం ఎక్కడ ఉందే? సమాజంలో మరణం తరువాత జన్మ లేదంటున్నారే పిచ్చివాళ్ళు వాళ్ళంతా..పిచ్చిపిచ్చిగా మాట్లాడే జనం మాట నీకు ఎందుకు? ఎవరినీ లెక్క చేయకు.

అమెరికాలో ఉన్న నీ మనవడికీ, మనవరాలికీ, మాత చెప్పిన విషయాలు చెప్పి పిల్లవాడి రూపంలో ఉన్న నీ భర్తను ఇంటికి తెచ్చుకో. వాడిని జాగ్రత్తగా చూసుకో. జన్మజన్మల నుండి మీకు ఉన్న అనుబంధాన్ని గట్టి చేసుకో. ఈసారి మరణిస్తే మీరు ఇద్దరూ ఒకేసారి మరణిస్తారు. అందువలన మరల జన్మ అనేది లేకుండా మీకు మోక్షప్రాప్తి లభిస్తుంది. వాడు మీ ఇంటికి వచ్చాక ఇంకా సిరులు పొంగి పొర్లుతాయే పిచ్చిదానా మీ ఇంట్లో-సమాజం కూడూ గుడ్డా పెట్టదు.

సమాజం నీకు డబ్బూ సుఖమూ ఇవ్వదు.

నువ్వు సుఖసంతోషాలతో ఉంటే ఏడుస్తుంది, కష్టనష్టాలతో ఉంటే నవ్వుతుంది.

పిచ్చిమేళం, పిచ్చి జనంతో కూడినదేనే సమాజం పిచ్చిదానా? "

అంటూ తన బోధలు వినిపించింది మాత.

"అమ్మా మాతా.. తమరు శెలవిచ్చినట్లుగా ఆ పిల్లవాడిని మా ఇంటికి తెచ్చుకుంటాం, జాగ్రత్తగా చూసుకుంటాం" అన్నాడు సత్తెన్న.

"ఆ మాట పద్మావతీ దేవిని చెప్పమనరా శుంఠా, నువ్వేం చేస్తావ్ మట్టి"

అని గర్జించింది మాత.

వెంటనే మత్తులోంచి బయటపడినట్లుగా పద్మావతీదేవి వళ్ళు విదిలించుకుని

"మేం విజయవాడ వెళ్ళిపిల్లవాడి రూపంలో ఉన్న మా వారిని తెచ్చుకుంటాం మాతా.. మా అజ్ఞానాన్ని మన్నించు" అంటూ మరల మాత కాళ్ళమీద పడింది.

ఇంతలో ఒక సన్యాసిని వచ్చి మాతకు ఒక చీటీ ఇచ్చింది, చీటీ ఇచ్చిన ఆమెను మాత కోపంతో.

సత్తెన్నకి సీన్ అర్ధమైపోయింది. మాత దగ్గరకు పనిమీదఅమ్మగారు వచ్చిన ప్రతీసారీ డబ్బుకోసం ఇండెంటు పెడుతుంది మాత.

"అమ్మా.. శెలవియ్యండి" అన్నాడు మాతను చూస్తూ

"శుంఠా నువ్వేమిస్తావు రా బూడిద? పద్మావతీ దేవిని మాట్లాడమనరా మూర్ఖా" అంది మాత మళ్ళీ కళ్ళు ఎర్రగా చేసి,

వెంటనే పద్మావతీదేవి "మాతా సెలవియ్యండి ఏం కావాలి మీకు?" అంది

"ఏవో అత్యవసర ఖర్చులున్నాయట ఆశ్రమంలో, ఒక లక్షరూపాయలు జమచేసి వెళ్ళండి ఖజానాలో" అంది మాత ఎంతో నిర్మలంగా.

పద్మావతీ దేవికి బాగా తెలుసును.

తాము ఎప్పుడూ దర్శనానికి వచ్చినా మాత డబ్బు అడుగుతుంది. మరి తప్పదు. ఆయన సంవత్సరానికి మూడు నాలుగు సార్లు వచ్చి దర్శనం చేసుకుని ఆమె అడగడమే తరువాయి విరాళాలు ఇచ్చేవారు.

"అలాగే మాతా పంపిస్తాను, మరి మాకు సెలవు ఇప్పించండి" అంటూ భక్తితో పక్కకు జరుగుకుంటూ మాతకు తమ శరీరం వెనుక భాగం చూపించకుండా సత్తెన్నతో బయటకు వచ్చింది పద్మావతీ దేవి.

లక్షరూపాయల ఖరీదు గల మాత సలహాతో సత్తెన్న, పద్మావతీ దేవి బరువుగా వచ్చి కారు ఎక్కారు.

గేటు దగ్గర గూర్ఖా పద్మావతీ దేవి చేతి వందరూపాయల నోటుకు బదులుగా సలాం కొట్టాడు.

అక్కడితో పద్మావతీ దేవికి ఆ నాటి మాత ఋణం తీరి, విజయవాడ పిల్లవాడిరూపంలో ఉన్న గోవిందరాజుల ఋణం జత అయింది. రెండు ఋణాలూ ఆమె జీవితంలో తీరేవి కావేమో.

●●●

**మనిషి జీవితంలో** అను నిత్యం అనేక సంఘటనలు జరగడం చూస్తూంటాం. అలాగే అవి జరిగినట్లుగా వింటూ ఉంటాం. ఈ మధ్యన మీడియా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు జరిగి అభివృద్ధి చెందడంతో మామూలుగా కుక్క నాలుగు పిల్లలను కనేది పది పిల్లలను కన్నదే అనుకోండి, అది ఒక వింతలాగా బ్రేకింగ్ న్యూస్‌గా చూపించేయడం టెలివిజన్‌లో చాలా మాములు విషయమైపోయింది. అయితే ఈ విషయాలు చాలా మంది చూసీ చూడనట్లుగా ఊరుకుంటారు, మరి కొంతమంది ఆ వార్తలనే పట్టుకుని వేలాడుతూంటారు. అది మనిషి యొక్క మనస్తత్వాన్ని, ప్రవృత్తి మీద ఆధారపడి ఉంటుంది.

పదకొండేళ్ళ పిల్లవాడు తన పునర్జన్మ వివరాలు చెబుతుంటే టెలివిజన్‌లో ప్రసారం చేశారే అనుకోండి, ఈ ప్రసారాలను ఎంతమంది చూసి ఉంటారు? ఎంత మంది స్పందించి ఉంటారు?

ఈ సంఘటన సిరిపురానికి చెందినది కాబట్టి, ఒక కోటీశ్వరుల కుటుంబానికి సంబంధించినది కాబట్టి అందునా వివరాలు తన కుటుంబానికి సరిగ్గా అతికినట్లుగా సరిపోయాయి కాబట్టి పద్మావతీ దేవిగారు తీవ్రంగా పరిగణించి స్పందించింది.

అయితే శ్రీమంతులలో రెండు రకాల వారు ఉన్నారు, తమకు సంబంధించిన పుకార్లు విన్నా ఏ సంఘటన అయినా చూసినా మనకెందుకులే అనుకునే వారు కొంతమంది ఉంటే, మరి కొంత మంది ఎందుకైనా మంచిది ఆ విషయం పరిశీలిస్తే బాగుండును అనుకునే వారు ఇంకొంతమంది.

పద్మావతీ దేవిగారు తను నమ్మిన బంటు సత్తెన్నతో తమ కుటుంబం కొలిచే మాత దగ్గరకు వెళ్ళి టెలివిజన్‌లో చూసిన పిల్లవాడి పునర్జన్మ జ్ఞానం గురించి చెప్పిన విషయం, అందునా అది పూర్తిగా తమ కుటుంబానికి చెందినది కావడంతో ఈ విషయమై ఏం చేయలో మాతను సలహా అడిగి రావడం జరిగింది.

అయితే..

మాత చెప్పిన ప్రకారం ఆ పిల్లవాడిని ఇంటికి తీసుకురావడానికి చాలా సంగతులు ఆలోచించవలసి ఉంది.

సిరిపురం అంటే తమ ఊరేనా?

దేశంలో మరెక్కడా ఆ పేరుతో ఊరు లేదా?

అలాగే గోవిందరాజులు అన్న పేరు ఇంకెక్కడా ఉండదా?

అదే విధంగా అతను చెప్పిన కుటుంబ పరిస్థితులూ, జరిగిన సంఘటనలూ, కుటుంబ సభ్యుల వివరాలూ, మరో కుటుంబంలో ఉండవచ్చును కదా?

ఇలాగ..

పద్మావతీదేవి తన మస్తిష్కం నిండా తేనెటీగల్లా ముసురుతున్న ఆలోచనలతో సతమతమై పోతూంది.

ఇంతలో

గూర్ఖా వచ్చి సలామ్ చేసి "మేడమ్ ఎవరో ఇద్దరు భార్యాభర్తా వచ్చారు తమర్ని కలవాలి, చూడాలి అంటున్నారు. వారి అబ్బాయి ఇక్కడ ఉన్నాడనీ, మనం తెచ్చామనీ అంటున్నారు. గేటు దగ్గర నిలిపనా వాళ్ళని, లోపలికి తెమ్మంటారా?" అన్నాడు.

"మళ్ళీ ఇదేం కొత్త గోల, ఎవరి పిల్లవాడినో మనం తేవడమేమిటి? లోపలకు తీసుకురా వాళ్ళని" అంది పద్మావతీదేవి గూర్ఖాతో చాలా చిరాకుగా.

ఈ మాటలు వింటూనే పద్మావతీ దేవికి చెరో పక్కనా కూర్చున్న సీతమ్మా, సత్తెన్న గభాల్న లేచి నిలబడ్డారు ఆశ్చర్యంతో.

ఇంతలో చౌకరకం పాలియస్టర్ చీర కట్టుకున్న ఒక మధ్య వయసు స్త్రీ, కావి రంగు పంచె మీద లేత నీలం రంగు చొక్కా వేసుకున్న పురుషుణ్ణి తీసుకు వచ్చాడు గూర్ఖా.

ఆమె ఎత్తు ఐదు అడుగులకు కొంచెం ఎక్కువగా ఉంటుంది, చాలా బలహీనంగా బీదరికం ఉట్టిపడుతున్నట్లుగా ఉంది. కానీ తెల్లగా ప్రకాశవంతంగానే ఉంది. చేతిలో ఎరువుల సంచితో కుట్టిన ప్లాస్టిక్ చేతి సంచీ, ఏడ్చినట్లుగా ఉంది. కళ్ళు ఉబ్బి ఉన్నాయి ఎఱ్ఱగా. భయం భయంగా నిలబడి ఉంది.

అతను ఎత్తు ఐదున్నర అడుగులు ఉంటాడు. కొంచెం బలిష్టంగా ఉన్నాడు, వ్యవసాయదారునిలాగా పంచె కట్టుపైన తువ్వాలు వేసుకున్నాడు. విచారవదనంతో భయం భయంగా నిలబడి ఉన్నాడు.

వాళ్ళిద్దరూ లోపలకు వస్తూనే కళ్ళు విప్పార్చి చూస్తున్నారు భవనంలోని వైభవాన్ని. వాళ్ళ జీవితంలో హాలులో ఉన్న షాండిలియర్, స్టీల్ రైలింగ్‌తో ఉన్న మేడ మెట్లూ, నూట ఇరవై సెంటీమీటర్ల టెలివిజన్, ధగధగా వెండు రంగుతో మెరిసిపోయే గొలుసులకు వేలాడుతున్న రంగు రంగుల కుషన్లతో అమర్చబడిన ఉయ్యాలబల్ల, అడుగడుక్కీ మెరిసిపోయే నేలా ఇంతవరకూ వాళ్ళు చూసి ఉండరు.

వస్తూనే ఆ స్త్రీ పద్మావతీ దేవిగారి కాళ్ళమీద పడిపోయి ఏడ్వసాగింది.

"అమ్మగారూ మా పిల్లోడిని రక్షించండి. మీ దగ్గర ఉన్నాడనుకుని వచ్చామండి. టెలివిజన్‌లో మా అబ్బాయిని చూపించారండి. తమరే వాడిని తీసుకు వచ్చి ఉంటారని వచ్చామండి. మా పిల్లోడిని ఎవరో ఎత్తుకుపోయారండి. మీరే కాపాడాల మా ఓడిని" అని నాన్‌స్టాప్‌గా రోదిస్తోంది ఆ తల్లి.

పద్మావతీదేవికి అసలు సీను అర్థం కావడం లేదు. ఈ హఠాత్పరిణామానికి ఆమెకు ఏం చేయాలో, ఏం చెప్పాలో పాలుపోవడం లేదు.

ఇంతలో..

పద్మావతీదేవి గారి కాళ్ళ దగ్గర నుండీ ఆ తల్లిని లేపింది సీతమ్మ.

వెంటనే సత్తెన్న ఆమె వద్దకు వెళ్ళి "అమ్మా మీ అబ్బాయి ఏమిటి? మేము తీసుకురావడమేమిటి? అసలు వివరంగా చెప్పలేకపోతే మాకు ఏం తెలుస్తుంది? మేం అసలు ఇంతవరకూ ఏ పిల్లవాడినీ తీసుకురాలేదు" అన్నాడు.

అందుకు ఆ మహిళ "అదేంటి బాబూ మా బుడ్డోడు ఇక్కడ లేడా - ఓరి నాయనో ఏమయిపోయావురా బాబూ.." అంటూ మళ్ళీ ఏడుపు మొదలు పెట్టింది.

"నువ్వు ఆ ఏడవడం ఆపు చేసి అసలు ఏం జరిగిందో చెప్పవమ్మా" అన్నాడు సత్తెన్న కోపంతో.

ఆమె ఏడుస్తూనే చెప్పసాగింది.

"మా పిల్లోడు ఆరో తరగతి చదువుతున్నాడండి. చాలా తెలివైనోడండి. రెండు నెలల క్రితం ఒకరోజు స్కూలుకు వెళ్ళి మళ్ళీ తిరిగిరాలేదండీ బాబూ. ఊళ్ళన్నీ వెదికామండీ. బంధువుల ఇళ్ళన్నీ తిరిగామండి. చివరకు పోలీసులకు రిపోర్టు కూడా ఇచ్చామండీ. ఇంతవరకూ జాడ లేదండి. చివరకు రోజూ ఏడుస్తూ వాడి కోస్మ బాధపడతా ఉన్నామండి బాబూ.

చివరకు టెలివిజన్‌లో మా పిల్లవాడు కనిపించాడండి. ఆ ప్రోగ్రాం అంతా పూర్తిగా చూశామండి. మా వోడికి అస్సలు ఏమీ తెలియదండి. వాడికి చదువుకోడమే తప్పితే పునర్జన్మలాంటి పెద్ద మాటలు తెలీదండి. ఎవురో ఆడిని ఎత్తుకుపోయారండి అమ్మగారూ - తమరే మా పిల్లోడిని కాపాడి, మాకు ఇప్పించండమ్మా

అమ్మా మిమ్మల్ని దేవుడు చల్లంగా చూస్తాడు దయుంచండమ్మా"

అని ఒకటే కళ్ళమ్మట నీళ్ళు ధారాళంగా వర్షిస్తుంటే మాట్లాడసాగిందామె.

కన్నతల్లి శోకం అలాగే ఉంటుంది. ఆమెకు కన్నకొడుకే ప్రపంచం తప్పితే మరేం అవసరం లేదు.

పద్మావతీదేవి అసలే సంధిగ్ధావస్థలో ఉంది, ఆమెకు పిల్లవాడి రూపంలో ఉన్న తన భర్తను తీసుకురావాలా వద్దా అన్నదే ముందు పట్టి పీడిస్తున్న పెద్ద సమస్య.

మధ్యలో ఈ గోల ఏమిటి?

ఇదేమిటి వీళ్ళు వచ్చి ఆ అబ్బాయి వీళ్ళ పిల్లాడు అంటున్నారు?

అసలే ఈ పిల్లవాడు ఏమిటి? పునర్జన్మ రహస్యాలు చెబుతున్నాడేమిటి? అందునా తన కుటుంబం గురించి చెప్పడమేమిటి? ఏం చేయాలా అని తలపట్టుకుని కూర్చుంటే ఆ పిల్లోడు మా అబ్బాయి అని వీళ్ళు వచ్చారు. ఇదేం గోల?

ధనవంతుల కుటుంబాలను ఏదో రకంగా దోచుకోవాలని అందరూ ప్రయత్నిస్తుంటారు. అసలే పిల్లవాడి సంఘటనే నిజమా కాదా లేక ఇది ఎవరైనా పన్నిన కుట్రా అనే మీమాంసలో కొట్టుకు చస్తుంటే, మధ్యలో ఈ దంపతులు వచ్చి ఆ పిల్లాడు తమ కొడుకు అంటున్నారు పైగా రెండు నెల్లక్రితమే ఎత్తుకు పోయారంటున్నారు వాడిని.

ఏది ఏమైనా తమ కుటుంబం నమ్మిన మాట అబద్ధం చెప్పదు, ఆ పిల్లవాడి విషయం నిజమే అయి ఉంటుంది.

ఈ దంపతులే టెలివిజన్‌లో కార్యక్రమం చూసి, నన్ను ట్రాప్ చేసి డబ్బులు లాగుదామని పచ్చి అబద్దాలు చెబుతున్నారు అనే ఒక నిర్ణయానికి వచ్చేసింది పద్మావతీదేవిగారు.

ఆమె వెంటనే "అదేమిటమ్మా ఆ పిల్లవాడు, మీ తప్పిపోయిన పిల్లవాడూ ఒకటే అనడానికి నీ దగ్గర ఆధారాలు ఏమున్నాయి? చూపించు" అంది.

"అమ్మగారూ ఆధారాలు ఏముంటాయి మేం బీదోళ్ళం. మాకాడ ఫోటోలు ఉంటాయా. నేను ఆడి కన్న తల్లినమ్మా. మాఊళ్ళో పెద్దమనుషుల చేత చెప్పించగలనమ్మా" అంటూ మళ్ళీ శోకాలు పెట్టసాగింది.

వెంటనే సత్తెన్న కలగ చేసుకుని "అమ్మా మీరు మీ ఊరు వెళ్ళిపోండి. మాకు టెలివిజన్‌లో చూపించిన పిల్లాడితో ఎటువంటి సంబంధమూ లేదు. మాకు అతనితో అవసరం లేదు. అతను చెప్పేవన్నీ అబద్దాలు. అయినా మేము అతన్ని మా బంగళాకు తీసుకు రావాలని అనుకోవడంలేదు. రోడ్డు మీద ప్రతీ వాడూ పునర్జన్మ రహస్యాలు చెబుతాడు, చెప్పనిస్తే చాలు. అది కూడా డబ్బున్నోళ్ళ కుటుంబాల గురించే చెబుతాడు. అదే తను గత జన్మలో ఓ గుడిసెలో పుట్టానని చెప్పమను, చెబుతాడేమో. చాల్లెండి పిచ్చివేషాలు. మేం ఇలాంటి తాటాకు చప్పుళ్ళకు స్పందించదలచుకోలేదు. తక్షణమే వెళ్ళిపొండి." అని కసిరాడు.

ఈ మాటలు విని ఆమె భర్త కలుగచేసుకుని "అయ్యగారూ, మీరు తీసుకువచ్చారని మేం చెప్పడం లేదండి. టెలివిజన్‌లో కనుపించిన పిల్లోడు చెప్పిన వివరాలను బట్టి మీరు గన్నా ఒకవేళ తీసుకొచ్చారేమోనని మా బాధలో మేము వెతుక్కుంటా వచ్చామండి. ఒకవేళ తమరు తీసుకు వచ్చి ఉంటే ఆడు మావోడని చెప్పి తీసుకు వెళదామని వచ్చామండి బాబుగారూ" అంటున్న అతని మాటలకు సత్తెన్న అడ్డు తగిలి

"ఇక అనవసరంగా మాట్లాడకండి. మీరు మీ పిల్లాడు అనుకుంటున్న వాడి ఏ టెలివిజన్‌లో చూశారో ఆ టెలివిజన్ ఆఫీసుకు వెళ్ళి అడగండి. వాళ్ళు మీ పిల్లాడిని చూపిస్తారు అంతేగానీ మేం ఏం చేయగలం?" అన్నాడు.

చాలా తెలివిగా మాట్లాడుతూ సమస్యను పరిష్కరిస్తున్న సత్తెన్నను, పద్మావతీ దేవి అభినందన పూర్వకంగా చూస్తూ.

"అవును మా సత్తెన్న చెప్పింది నిజమే. మీరు వెంటనే ఆ టెలివిజన్ ఆఫీసుకు వెళ్ళండి. ఈ విషయంలో మేం ఏమీ చేయలేం. ఒకవేళ మీ పిల్లాడిని మేం చూస్తే గనక మీకు కబురు చేస్తాను, మీ ఎడ్రసు వివరాలు ఇవ్వండి" అంది పద్మావతీ దేవి.

పద్మావతీ దేవి మాటలు ఆ భార్యా భర్తా శ్రద్ధగావి ని

"అంతేనమ్మా మా దురదృష్టానికి మీరేం చేయగలరు? ఒకవేళ మా పిల్లోడు కనిపిస్తే మీకు దణ్ణం పెడతాం మాకు తెలియచేయండమ్మా తల్లీ" అంటూ మళ్ళీ భార్యాభర్తా పద్మావతీ దేవి కాళ్ళమీద పడ్డారు.

వెంటనే ఆమె వాళ్ళను లేవదీసి "సీతమ్మా వీళ్ళకు భోజనం పెట్టి, దారి ఖర్చులూ కొంత డబ్బూ ఇచ్చి పంపించండి" అని చెప్పింది.

వాళ్ళు వంగి వంగి దణ్ణాలు పెట్టుకుంటూ సీతమ్మతో దొడ్డి వాకిట వేపు వెళ్ళారు.

సత్తెన్న పద్మావతీ దేవి వైపు చూస్తూ

"అమ్మగారూ డబ్బున్నోళ్ళంటే అందరికీ ఆశే. ఆళ్ళ సంపద ఏదో రకంగా దోచుకుందామని తీవ్రంగా ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. చూడండి మరి టెలివిజన్‌లో వార్తలు చూసి ఆ వివరాలతో మన ఇంట్కి నేరుగా వచ్చేశారు. అందుకే నేను గట్టిగా డోస్ ఇచ్చేశాను" అన్నాడు.

"మా బాగా కోటింగ్ ఇచ్చావు వాళ్ళకి. ఎందుకైనా మంచిది వీళ్ళ వివరాలు జాగ్రత్తగా ఒకచోట రాసి ఉంచండి" అంది పద్మావతీదేవి.

టెలివిజన్ చూసినప్పటి నుండీ, పునర్జన్మ రహస్యాలు చెప్పిన ఆ పిల్లవాడిని చేరదీయాలా వద్దా అని ఒక పక్కన సతమతమవుతూంటే, మరో పక్కన తన భర్త పేరు చెప్పి తనను ఓదార్చాలని వాడు ఏడుస్తూ అంటూంటే అది విని కుమిలిపోయి ఛస్తూంటే, మధ్యలో వీళ్ళొకరు ఆ పిల్లవాడు మా పిల్లాడే ఎవరో ఎత్తుకుపోయారని వచ్చారు.

ఏమిటీ తల నొప్పులు?

పద్మావతీ దేవి ఆలోచనలతో సతమతమైపోతూంది.

## 4

పద్మావతీ దేవి గారి మనసు పరిపరి విధాలా ఆలోచనల్లో పడిపోయి, ఆమెకు ప్రస్తుత పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుపోకుండా ఉంది.

గత జన్మలో తనకు భర్త అని చెప్పుకునే పిల్లవాడిని ఒకవేళ తను ఇంటికి తీసుకువస్తే అనేక సమస్యలు ఎదుర్కోవాలి, అనేక మంది అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పాలి. చాలామంది చెవులు కొరుక్కుంటారు అందువలన పరువుపోతుంది.

పోనీ వాడిని ఒకసారి చూసి వాడిని పరీక్షించి వాడి బ్రతుకు బాగోగులు తను చూస్తే ఎలా ఉంటుంది?

అలా చూస్తే మీకూ వాడికీ అసలు ఏం సంబంధం ఉంది? ఆ అబ్బాయి గోవిందరాజులుగారికి వేరే స్త్రీవలన పుట్టిన సంతానమా? అని అడిగారే అనుకో? ఏం చెప్పాలి?

ఉయ్యాల బల్లమీద కూర్చుని మామూలుగా బాలీసులకు ఆనుకుని కొంచెంగా ఊగుతూ దర్జాగా కూర్చునే ఆమె బాలీసులకు అనుకోకుండా ఉయ్యాల అటూ ఇటూ కదలకుండా నిటారుగా కూర్చుని ఉంది పద్మావతీ దేవి.

పాతకాలపు గోడ గడియారం ఎనిమిది గంటలైనట్లుగా ఎనిమిది గంటలు కొట్టింది. ఆ గడియారం గోవిందరాజులు గారు ఎంతో మోజుగా కొనుక్కున్నారట. ఆ గడియారం డయల్ మీద అంకెలు పెద్దవిగా ఉంటాయి. ముళ్ళు కూడా చాలా వెరైటీగా కళాత్మకంగా ఉంటాయి. ఆ గడియారానికి రెండు కీలతో కీ ఇవ్వాలి. రోజూ ఉదయాన్నే దానికి కీ ఇచ్చేపని సత్యన్నారాయణదే దానికి ఈ మధ్యనే వార్నిష్ తో పాలిష్ పెట్టించి, డయల్‌కి తెలుపు రంగు స్ప్రే చేయించింది, ముళ్ళకు నికిల్ వేయించి కొత్తదానిలా చేయించారు.

పద్మావతీ దేవి గారి ఎదురుగా టెలివిజన్ మూతపడి ఉండడంతో ఆమెకు అటూ ఇటూ సీతమ్మ సత్యనారాయణ కూర్చుని లేరు అదీ సంగతి.

''ఏమే సీతమ్మా ఎక్కడున్నావే. రాత్రి ఎనిమిది గంటలకు అమెరికా ఫోను చెయ్యాలని చెప్పానా?'' అంటూ కేకలేసింది గట్టిగా. ఆమె అరిచిందంటే బయట గేటు దగ్గర గూర్ఖాకి, లోపల వంటగదిలో కూర్చుని ''ఈ పిల్లాడెవడో వస్తే తన గతి ఏమవుతుందో''నని తల పట్టుకుని కూర్చున్న సీతమ్మ ఒకేసారి పద్మావతీదేవి గారి దగ్గరకు పరుగులతో వచ్చేశారు.

''అమ్మగారూ పిలిచారా?'' అంటూ సీతమ్మ

''అమ్మగారూ ఏమన్నారూ?'' అంటూ సత్యన్నారాయణ చెరో పక్కనా చేరారు మామూలుగా.

''అదే సత్తన్నా మనం అమెరికా ఫోన్ చేసి మనవడూ మనవరాలితో మాట్లాడాలి. నా సెల్ ఫోనులో వాళ్ళ నెంబర్లు ఒకటి తరువాత మరొకటి కలుపు. ముందుగా మనవడు తరువాత మనవరాలూ'' అంది.

ఉయ్యాల బల్లముందు ఒక టీపాయ్ మీద సెల్‌ఫోను, ల్యాండ్ ఫోను, ప్రక్కనే ఫోను నెంబర్లు రాసిన పుస్తకాలూ ఉంటాయి.

సత్యన్నారాయణ ఆ ఫోను పుస్తకాలు తిరగేసే పనిలేకుండా ఒక అట్ట మీద ముఖ్యమైన వారి ఫోను నెంబర్లు రాసి ఉంచాడు.

ఆ అట్ట తీసి దానిలో పద్మావతీదేవి గారి మనవడు అమెరికా నెంబరు నొక్కాడు. సెల్ ఫోను రింగవుతూండగా ఆమెకు ఇచ్చి "అమ్మగారూ మనవడు గారికి చేశాను ఫోన్ రింగ్ అవుతూంది. మాట్లాడండమ్మా" అన్నాడు.

పద్మావతీ దేవి గారు సెల్ అందుకుని చెవి దగ్గర పెట్టుకుంది.

"హలో ఎవరు మాట్లాడేది. బాబూ వెంకీనే నా మాట్లాడేది?"

"..........."

"అమ్మాయి, నువ్వూ, పిల్లలూ కులాసానా బాబూ"

"..........."

"ఏం చెప్పమంటావు. ఏమిటో జీవితం ఎప్పుడూ బిజీగానే ఉంటోందిరా. నీతో మాట్లాడలేకపోతున్నాను. అవునూ పిల్లలు బాగా చదువుకుంటున్నారా?

"........"

"నేను అమెరికా రావడమా. అది జరిగే పనికాదురా. మీరే సాధ్యమైనంత త్వరగా రండి. మిమ్మల్ని చూడాలని ఉందిరా"

"......."

" ఏమున్నాయి. ఇక్కడి విశేషాలు. సీతమ్మ నాకు ఏం లోటు లేకుండా అన్నీ వండిపెడుతోంది. దగ్గరుండి తినిపిస్తుంది. సత్యన్నారాయణ ఎప్పుడూ నా పక్కనే ఉండి అన్నీ చూసుకుంటున్నాడు. నాకు ఏం లోటులేదురా"

"..."

"నా ఆరోగ్యానికేం. బాగానే ఉన్నానురా. డాక్టరు వచ్చి వారానికోసారి పరీక్షలు చేసి మందులు ఇచ్చి వెళుతూనే ఉన్నాడు. రాయిలాంటి ఆయన్ని దేముడు తీసుకువెళ్ళిపోయాడు గానీ, బండరాయిలా నేను మాత్రం బ్రతికే ఉన్నానురా ఇంకా"

"......."

"ఏం చెప్పమంటావు. ఒక్కదాన్నీ బ్రతకలేక చావలేక, మీరు ఏర్పాటు చేసిన అన్ని సౌకర్యాలతో బలవంతంగా జీవిస్తున్నాననుకో"

".........."

"డబ్బు ఏదైనా అవసరమా? ఫోను చెయ్యండి. బ్యాంక్ ఎకౌంటులో జమ చేయిస్తాను. దేనికీ ఇబ్బంది పడకండి"

"......."

"ఇక పోతే ఒక ముఖ్య విషయం, ఇక్కడ టెలివిజన్‌లో ఈ మధ్యన ఒక ఇంటర్వ్యూ చూపించారు. అందులో ఒక పదకొండేళ్ళ పిల్లవాడు గత జన్మ రహస్యాలు చెబుతున్నాడు. అతను చెప్పేవన్నీ సరిగ్గా మన కుటుంబంతో సరిపోతున్నాయి. అతను తన పేరు గోవిందరాజులు అనీ, తన భార్య బ్రతికే ఉందనీ, ఇలాగ మన కుటుంబంలో అందరి పేర్లూ చెబుతూ, జరిగిన సంఘటనలన్నీ పూసగుచ్చినట్టుగా చెబుతున్నాడు.

టెలివిజన్‌లో దీన్ని చూపించిన రెండు రోజులకు ఒక భార్యాభర్తా మన ఇంటికి వచ్చి, ఆ పదకొండేళ్ళ పిల్లవాడు తమ పిల్లవాడేననీ, ఒక వేళ మనం తీసుకువచ్చామేమోనని మన ఇంటికి వచ్చారు. వాళ్ళ అబ్బాయిని ఎవరో ఎత్తుకుపోయారుట. వాళ్ళను కేకలేసి పంపిచేశాను.

ఇకపోతే, నాకు ఒక ఆలోచన వచ్చింది, మీ తాతగారు చేసిన పుణ్యకార్యాలవలన ఒకవేళ ఆయన మరలా జన్మించారేమో పిల్లవాడి రూపంలో, అందుకని అతన్ని చేరదీయాలని ఉంది రా నాకు. ఆ విషయం నీకు చెప్పి"

"........"

"అప్పుడే మోసం అని ఎలా అనుకుంటాం చెప్పు? అయినా మనం నమ్మిన మాత దగ్గరకు వెళ్ళి ఈ విషయం వివరంగా చెప్పి సలహా అడిగాను. ఆమేమో నీతో సంప్రదించి నువ్వు ఎలా చెబితే అలా చెయ్యమని చెప్పింది."

"..........."

"అలాగే.. మేము వెళ్ళి వచ్చాక నీకు జరిగిన విషయాలన్నీ చెబుతాను. నువ్వు ఎలా చెబితే అలా చేస్తాం. మరి ఉంటాను బాబూ. మనవరాలికీ, మీ పిల్లలకీ ఆశీస్సులు చెప్పు" అని సెల్ నొక్కేసింది పద్మావతీ దేవిగారు.

●●●

**తల పట్టుకుని కూర్చుందామె ఫోనులో మాట్లాడాక,** సీతమ్మ టీపాయ్ మీద ఉన్న వెండి జగ్గులో నీళ్ళు వెండి గ్లాసులో పోసి ఇచ్చింది. ఆమె వెంటనే తాగేసి

"వెంకట్ చెప్పేదేమిటంటే, ఇదంతా మోసం, దగా, కుట్ర అనీ, నువ్వు నమ్మకు, ఆస్తంతా కాజెయ్యడానికి ఇలా మోసం చేస్తారు. చూసీ చూడనట్లుగా ఉండాలి. టెలివిజన్‌లో చూపించినవన్నీ పట్టించుకుంటే బ్రతకడం కష్టం జాగ్రత్తగా ఉండాలి అంటున్నాడు.

అంతా విన్నాక చివర్లో మనల్ని వెళ్ళి ఒకసారి ఆ పిల్లవాడిని చూసి రమ్మన్నాడు తరువాత జరిగిన విషయాలు చెప్పమంటున్నాడు. ఏం చేయాలో సలహా చెబుతానంటున్నాడు.

ఏది ఏమైనా చాలా జాగ్రత్తగా ఉండండి ఎవర్నీ నమ్మవద్దు -అంటూ చాలా కంగారు పడుతున్నాడు నా గురించి" అంది పద్మావతీదేవి గాబరాగా ముఖం పెట్టి.

"అమ్మగారూ వెంకట్ బాబు చెప్పింది అక్షరాలా నిజం. ప్రపంచకం అంతా మోసమే. ఎవర్ని నమ్మాలో ఎవర్ని నమ్మకూడదో తెలియడం లేదు. రోజూ మనం టెలివిజన్‌లో చూపించే మోసాలు నేరాలూ ఘోరాలూ చూస్తానే ఉన్నాం కదా. పైగా మీరు కోటీశ్వరులాయె. అందరి కళ్ళూ మీమీదే ఉంటాయి" అంటూన్న సీతమ్మను చేత్తో ఆపి సత్యనారాయణ --

"నువ్వాగవమ్మా. అందుకున్నావంటే అన్నీ మోసాలే అంటావు. నువ్వు ఎవర్నీ నమ్మవాయె. అయినా అలా చెప్పి అమ్మగారిని భయపెట్టమాక. మనం ఏ పని చేసినా చాలా దూరం ఆలోచించి చేస్తాం కదా" అన్నాడు.

పద్మావతీ దేవిగారు అయోమయంలో పడిపోయింది మనవడి మాటలు విన్నాక.

మనిషి ఏ పనైనా చెయ్యాలని నిర్ణయించుకుని, ఎదుటివాడిని ఏం చేయమంటావు అని సలహా అడగకూడదు. ఒకవేళ అడిగాడే అనుకో వాడు ఆ పని చెయ్యద్దని అంటే, ఆ పని చెయ్యడం వలన తనకు వచ్చే ప్రతిఫలానికి, సుఖానికీ వాడు అడ్డుపడుతున్నాడని అనుకుంటాడు. అలా కాకుండా నువ్వు ఆపని చేసెయ్ అంటే వీడు సరిగ్గా నేను అనుకున్నట్లే చేసెయ్ అంటున్నాడు, నా మనసు వీడికెలా తెలిసింది, ఇందులో ఏదో మోసం ఉంది లేదా వీడికి అందులో భాగం ఉంది అనుకుంటాడు. మనిషి ఆలోచనలు ఎప్పుడు ఎలా ఉంటాయో చెప్పలేం.

ఏది ఏమైనా ఆమె మనసు నిండా టెలివిజన్‌లో చూసిన పదకొండేళ్ళ కుర్రాడి రూపం నిండిపోయి, వాడిని చూడాలి, ఒకవేళ వాడు, తన భర్త తానూ గడిపిన మధుర క్షణాలు ఏవైనా చెబుతాడేమో, ఒకసారి వెనక్కు వెళ్ళి ఆ అనుభూతులలో మునిగితేలుదామని ఆమెకు ఉంది. ప్రస్తుతం ఈమె మానసిక స్థితి ఎలా ఉందంటే, పునర్జన్మ ఉందా లేదా, ఒకవేళ ఉంటే తన భర్త మళ్ళీ ఆ పిల్లవాడి రూపంలో జన్మించాడేమో, అయినా పునర్జన్మ లేకుండా ఎలా ఉంటుంది. ఆయన చేసిన సుకృతాల వలన దేవుడు ఆయనకు పునర్జన్మ ప్రసాదించాడేమో. అని గాఢంగా విశ్వసిస్తుందామె.

మనవడు మగపిల్లాడు కాబట్టి ఈ మాత్రం మాట్లాడాడు. అదే మనవరాలికి ఫోన్ చేసి ఉంటే ఇంకా ఎన్ని అనుమానాలు చెప్పేదో. అసలే ఆడ మనసు అనుమానాల పుట్టకదా -

పద్మావతీదేవిగారి ఆలోచనలకు అంతరాయం కలుగచేస్తూ సత్యనారాయణ -

"అమ్మగారూ పద్మమ్మగారికి లైను కలపమంటారా?" అన్నాడు

అందుకు ఆమె వెంటనే-

"వద్దు. వెంకట్‌బాబు చెప్పినట్లుగా మనం పిల్లవాడిని చూసి, అతన్ని పరిశీలించాక అప్పుడు పద్మమ్మతో మాట్లాడుదాం, అనవసరంగా ఆ అమ్మాయికి కూడా చెప్పి ఆమెనూ కంగారు పెట్టడం మంచిది కాదు"

"అవునమ్మా మంచి మాట చెప్పారు. ఆమెకు మీరంటే చాలా ప్రేమ కూడాను. ఈ విషయం తెలిస్తే మీరు కంగారు పడిపోయి ఏం చేసేస్తారోనని బయలుదేరి వచ్చేసినా వచ్చేస్తారాయె" అన్నాడు సత్యనారాయణ.

"అయినా అమ్మగారూ. మీరు ఆ రోజు టెలివిజన్‌లో ఆ పిల్లవాడిని చూసినప్పటినుంచీ, మనసు పాడుచేసుకుంటున్నారు అనవసరంగా. ఒకవేళ గోవిందరాజులు అయ్యగారు పునర్జన్మ ఎత్తేరే అనుకోండి, కనీసం మీకు కలలోనైనా కనిపించి ఉండాలి కదా. లేదా కొన్ని నెలల ముందుగానే మన మాతకు తెలిసి ఉండాలి కదా. ఇవేమీ జరగలేదు కాబట్టి మనం కొంచెం ఆలోచించాల్సి ఉంది" అన్నాడు సత్తెన్న.

వీళ్ళిద్దరూ చెప్పిన మాటలూ, ఫోనులో మనవడు చెప్పిన విషయాలూ పద్మావతీదేవిగారి చెవిలోనైతే పడుతున్నాయిగాని, మనసులోకి మాత్రం వెళ్ళడంలేదు.

తన భర్త పునర్జన్మ ఎత్తాడు నిస్సందేహంగా-

లేకపోతే

ఒంటరితనంతో బాధపడుతున్న తనను ఓదార్చాలని ఎలా అనుకుంటాడు?

నా కుటుంబంలో జరిగిన సంఘటనలన్నీ చెబుతున్నాడు, అందరి పేర్లూ చెబుతున్నాడాయె ఇన్ని అబద్ధాలు ఎవరైనా చెప్పగలరా?

ఏది ఏమైనా ఒకసారి వెళ్ళి వాడిని ప్రశ్నలతో సంధించాలి. ఏం చెబుతాడో చూడాలి. అప్పుడే వాడి విషయం తేలిపోతుంది, సంగతి తేలిపోతుంది.

పోలీసులు ఇంటరాగేషన్ చేసినట్లుగా ఆయన ఆంతరంగిక విషయాలు అడిగితే, చెప్పలేక పోయాడే అనుకో దొరికిపోతాడు దొంగ, ఇలాగ పద్మావతీ దేవి తన మనస్సును శోధించుకుంటుంది. ఏమవుతుందో? ఏం జరుగబోతోందో? ఏమో?

టెలివిజన్ మనుషుల జీవితాల్లో బాగా ప్రాచుర్యంలోకి రాకముందు భారత ప్రభుత్వ అధీనంలో దూరదర్శన్ అనే ఒకే ఒక్క ప్రసారాలు ఉండేవి. వారు ఏ భాషలో ఏ రకమైన ప్రసారాలు చేసినా ఆ రోజుల్లో బయట సినిమా హాలులో కాకుండా సినిమా హాలుకు వెళ్ళకుండా బొమ్మలు కనిపించే పెట్టె ప్రత్యక్షం కావడంతో జనం విపరీతంగా ఆనందిస్తూ విపరీతంగా చూసేవారు.

కానీ ఇప్పుడో--

మనిషికో ఛానల్, పార్టీకో ఛానల్, పత్రికకు ఒక ఛానల్ ప్రసారాలు చేసేటంతగా టెలివిజన్ రంగం అభివృద్ధి చెందింది.

దానితో మీడియాలో పోటీ పెరిగింది.

ఏ ఛానల్ వాళ్ళు ప్రజలలో ఉత్కంఠ రేకెత్తించే వార్తలూ విశేషాలూ ప్రసారం చేస్తున్నారో తెలుసుకుని మరి ప్రజలు ముఖ్యంగా మహిళలు ఆయా ఛానల్స్‌ని ఎక్కువగా చూసెయ్యడం, వాళ్ళకి ప్రజలు టెలివిజన్ ఎక్కువగా వీక్షించే రేటింగ్ పెరిగిపోవడం జరుగుతూంది..

ఆ ఉత్కంఠ రేకెత్తించే కార్యక్రమ ప్రసారానంతరం జరిగే తరువాతి పరిణామాలతో వాళ్ళకి సంబంధం లేదు.

టెలివిజన్ ప్రసారాలలో ముఖ్య పాత్ర వహిస్తున్న ఒక ఛానల్ కార్యాలయం అది.

కార్యక్రమాలు పర్యవేక్షించే ప్రోగ్రామింగ్ చీఫ్ ఏ.సి.రూములో కూర్చుని ఉనాడు. అతను బ్లూ సూట్‌లో తెల్లగా మెరిసిపోతున్నాడు.

ఇంతలో

బజర్ మోగింది.

"యస్ కమిన్" అన్నాడు.

లోపలకు అటెండెంట్ వచ్చాడు.

"సర్. ఒకరు మిమ్మల్ని కలవాలని వచ్చారు. ఆయన్ను చూస్తుంటే పోలీస్ మనిషిలా కనుపిస్తున్నాడు. కానీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన వాడిని కానని చెప్పారు"

"నా రూములో సి.సి, కెమెరా ఆన్ చేయమని చెప్పి లోపలకు పంపించండి ఆయన్ను -

ఇంకో మాట, మన సెక్యూరిటీ చేత అతన్ని పూర్తిగా చెక్ చేయించి మరీ నా దగ్గరకు పంపించు -" అన్నాడు ప్రోగ్రామింగ్ చీఫ్.(పి.సి).

అటెండెంట్ వెళ్ళిపోయాడు ఆయన చెప్పిన సూచనలు అమలు చేయడానికి.

రోజూ తాము ప్రసారం చేసే అనేక విషయాలపై అనేక మంది దృష్టి పెడుతూ ఉంటారు. వారి పై టెలివిజన్‌లో ఏదైనా విషయం ప్రసారం అయినా పట్టించుకోరు అసలు. కొంతమంది మాకు చెప్పాపెట్టకుండా ఎందుకు మాకు సంబంధించిన వార్త ప్రసారం చేశారని తగువు పెట్టుకుంటారు. పైగా కోర్టులో పరువు నష్టం దావా వేస్తామని కూడా బెదిరిస్తూంటారు. ఇవాళ వచ్చిన వ్యక్తి ఎవరో ఏ ప్రసారం గురించి వచ్చారో అనుకుంటున్న ప్రోగ్రామింగ్ చీఫ్ ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ --

"మే ఐ కమిన్ సర్" అంటూ పోలీస్ అధికారి గొంతులా గంభీరంగా కర్ణకఠోరంగా ఒక గొంతు వినిపించింది.

"యస్ కమిన్" అన్నారు పి.సి.

సుమారు ఐదడుగుల పది అంగుళాల పైనే ఎత్తులో లేత నీలం రంగు సఫారీలో చామన చాయ రంగులో ఉన్న ముప్పై సంవత్సరాలు పైబడిన వ్యక్తి లోపలకు వచ్చాడు. అతని ముఖంలో గుబురు మీసాలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. సన్నని ఫ్రేమ్ లెస్ అద్దాలు పెట్టుకున్నాడు. గుబురు మీసాల వెనుక చిరునవ్వుతో -

"గుడ్ మాణింగ్"

"వెల్ కమ్. వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ" అన్నారు పి.సి.

"నా పేరు శ్రీనివాస్. నేను ఇక్కడ ఒక ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీలో క్రైమ్ కేసులు డీల్ చేస్తుంటాను. నాకు బాగా ఆప్తమిత్రుడు, నాకు కాలేజీలో జూనియర్, ప్రస్తుతం అమెరికాలో ఒక ప్రముఖ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా ఉంటున్నాడు. అతని ప్రమేయంతోనే నేను అమెరికాలోని ప్రముఖ ఇంటెలిజెన్సీ బ్యూరోలలో ట్రైనింగ్ అయి, కేసులు డీల్ చెయ్యడంలో క్రిటికల్ పాయింట్స్ మరియు టెక్నిక్స్ నేర్చుకున్నాను. మా స్నేహితుని గ్రామం పేరు సిరిపురం" ఆయన మాటలకు అడ్డుతగిలి పి.సి--

"అరె సిరిపురం అనే గ్రామం పేరు ఎక్కడో విన్నట్లుగా ఉందే" అంటూంటే శ్రీనివాస్ కలగచేసుకుని --

"యస్. విన్నారు. నేను ఆ పాయింట్‌కే వస్తున్నాను. మీరు కొన్ని రోజుల క్రితం మీ ప్రసారాల్లో ఒక రోజున సంచలన వార్త అంటూ, ముందు ఒక పిల్లవాడితో ఇంటర్వ్యూ ప్రసారం చేశారు, ఆ సంచలన వార్త మరియు ఇంటర్వ్యూ మొత్తం సిరిపురం గ్రామానికి

సంబంధించిన ఒక కోటీశ్వరుల కుటుంబానికి చెందినది. ఇఫ్ యూ డోన్ట్‌మైండ్ ఆ ప్రసారాన్ని మీ స్టూడియో నుండి తెప్పించి ఒకసారి నాకు ఇప్పుడు చూపించగలరా?" అన్నాడు శ్రీనివాస్ విజ్ఞప్తి పూర్వకంగా.

"వైనాట్. అయితే మీకు ఇక్కడ ఒక విషయం చెప్పాలి. మేము రోజూ ప్రసారం చేసే వార్తలలో ఒకోసారి అతి సాధారణమైన వార్త సంచలన వార్తయి కూర్చుంటుంది. అంటే ఆ వార్త ఒక వేళ సంపన్నకుటుంబాలకి చెంది ఉంటేనే సుమా.

ఉదాహరణకి పోలీస్ స్టేషన్ లో ప్రేమ వివాహం జరిపించిన సబ్ ఇన్‌స్పెక్టర్ అని చూపించామే అనుకోండి. ఆ ప్రేమికులు ఒక వేళ నిరుపేద కుటుంబానికి చెందినవారే అనుకోండి, పోనీలే పిల్ల పెళ్ళి సమస్య వదిలింది అని గమ్మున ఊరుకుంటారు. అలాకాకుండా ఆ యువతీ యువకులు ఒక ఫ్యాక్షన్ కుటుంబానికో, లేక ఇద్దరిలో ఒకరు సంపన్న కుటుంబానికి చెందినా వారు అయ్యారే అనుకోండి. మా పని సరి. మేమూ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. అంతే కాకుండా ఆ వార్తా ప్రసారానికి మూలకారకుడైన మా విలేఖరికి ఒక్కోసారి దేహశుద్ధి కూడా జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఇకపోతే మేం కొన్ని రోజుల క్రితం ప్రసారం చేసిన, మీరు ప్రస్తుతం పరిశీలించడానికి వచ్చిన వార్త మాత్రం, మా విలేఖరులు సృష్టించింది కాని, ఇన్వెస్టిగేట్ చేసింది కాదు. ఒక ఆడామగా ఒక పిల్లవాడిని తీసుకువచ్చి విషయం చెబితే, అది వింతగా అనిపించి మేం ప్రసారం చేశాం అంతే" అంటూ పి.సి. చెబుతూంటా ఇంటర్ కామ్ మోగింది.

"హలో చెప్పండి"

".............."

"అలాగా వెరీగుడ్ వెంటనే నా రూములోని సెట్‌కి కనెక్ట్ చెయ్యండి" అని "మిస్టర్ శ్రీనివాస్ ఇప్పుడు మనం చూస్తాం అటు చూడండి" అన్నారు పి.సి.

ప్రోగ్రామింగ్ చీఫ్ కుడిపక్కగా గోడకు అమర్చిన 72 సెంటీమీటర్ల ప్లాస్మా టెలివిజన్‌లో-

"విజయవాడలో ఒక పదకొండేళ్ళ పిల్లవాడు గత జన్మ రహస్యాలు చెబుతూ అందర్నీ విస్మయానికి గురిచేస్తున్నాడు" అంటూ ఆ నాటి ప్రసారం యొక్క రికార్డింగ్ ఆన్ అయింది.

"మిస్టర్ శ్రీనివాస్ మీరు ప్రసారం మొత్తం చూశాక ఏదైనా కావాలంటే అడగండి" అంటూ ప్రోగ్రామింగ్ చీఫ్ తన ఆఫీస్ పని చూసుకోసాగేడు.

ప్లాస్మా టి.వీలో రికార్డింగ్ వస్తూంది.

శ్రీనివాస్ ఆ టీ.వీలో ప్రసారం చూస్తూనే తన స్లిప్ బుక్‌లో ఏవో నోట్ చేసుకుంటున్నాడు.

ఒక పావుగంట గడిచింది. టి.విలో కొన్నిరోజుల క్రితం జరిగిన ప్రసారం, ఆ ప్రసారం ప్రేక్షకుల నుండి వచ్చిన స్పందన వగైరాలు చూసేశాడు శ్రీనివాస్.

"థాంక్యూ వెరీమచ్. మీరు ప్రసారం చేసిన వార్తలో పేర్కొన్న సిరిపురం, ఆ కుటుంబ వివరాలు యధాతథంగా నిజ జీవితంలో ఉన్నాయని చెబితే మీరు ఎంతో ఆశ్చర్యపోతారు కదూ"

"అవునా? హౌ ఈజిట్?"

"యస్. ఇటీజ్ హేపెన్డ్ లైక్ దట్ యాక్సిడెంటల్లీ. సిరిపురంలో ఒక కోటీశ్వరుల కుటుంబంలోని వాడే నా క్లాస్ మేట్ అమెరికాలో ఉంటున్నాడని చెప్పానుకదా. ఆ గోవిందరాజులుగారి భార్యే మా ఫ్రెండ్ నాయనమ్మ. ఈ వార్త చూసినప్పటినుండీ ఆమె నిద్రాహారాలు మాని ఇదే ఆలోచనలతో సతమతమైపోతూంది. పైగా ఆశ్చరకరమైన విషయమేమిటంటే ఆ పిల్లవాడిని తన దగ్గరకు తెచ్చేసుకుని ఉంచేసుకుంటే పోలా అనే సంచలన నిర్ణయానికి కూడా వచ్చేసిందావిడ. అదీ సంగతి. మావాడు ఈ విషయం ఏమిటో

కూలకషంగా పరిశీలించమని నాకు చెప్పాడు. అందుకని నేను ఇప్పుడు రంగంలోకి దిగాను. మరి ఆ పిల్లవాడిని తీసుకు వచ్చిన వారి వివరాలు-''

''వెరీ ఇంట్రస్టింగ్. మేం ప్రసారం చేసిన వార్త ఒక సంపన్న కుటుంబాన్ని కదిలించడం ఆశ్చర్యకరంగా ఉంది. నేను ఆ పిల్లవాడిని తీసుకువచ్చిన వాళ్ళ దగ్గర వివరాలు తీసుకున్నాను. ఒక వేళ ఆ పిల్లవాడి కోసం ఎవరైనా వస్తే ఎలా అని నేనే తీసుకున్నాను. తీసుకోవడం మంచిదైంది చుశారా -'' అంటూ తన పక్కనే ఉన్న కప్ బోర్డ్ తెరిచి ఒక నోట్ బుక్ తీసి అందులో వివరాలు స్లిప్ మీద రాసి శ్రీనివాస్‌కి ఇచ్చాడు ప్రోగ్రామింగ్ చీఫ్.

వెంటనే శ్రీనివాస్ ప్రసన్నవదనంతో ప్రోగ్రామింగ్ చీఫ్‌తో ''సామాన్యంగా మీడియా మీద దుష్ప్రచారం ఉంది. ఏ విషయమైనా ప్రసారం చేస్తే దాని మీద ప్రతిఫలం ఆశిస్తారనీ, ఎల్లో జర్నలిజంలాగే ఇది కూడా తయారైందనీ, కాని మీరు నేను ఒక ప్రసారం గురించి అడిగినప్పుడు వెంటనే మీరు ఆ ప్రసారం రికార్డింగ్ నాకు చూపించిన విధానం, వారి యొక్క వివరాలు ఇచ్చిన వైనం నాకు చాలా సంతోషం, తృప్తి కలిగించాయి. అందుకే మీ ఛానల్‌కి మంచి పేరు ఉంది సమాజంలో'' అంటున్న శ్రీనివాస్‌కి షేక్ హాండ్ ఇచ్చారు ప్రోగ్రామింగ్ చీఫ్.

''చాలా సంతోషం. మీరు వారి వివరాలు పూర్తిగా తెలుసుకోండి. ఏదైనా తేడా వస్తే వాళ్ళను బుక్ చేయడానికి మేమూ మా వంతు సహకారం అందిస్తాం'' అన్నారు పి.సి.

''థాంక్యూ - బై'' అంటూ శ్రీనివాస్ బయటకు వచ్చాడు.

●●●

మన్మనా భవ మద్భక్తో
మద్యాజీ మాం నమస్కురు
మా మేవైష్యసి సత్యం తే
ప్రతి జనే ప్రియోసి మే

**''నా భక్తుడవు కమ్ము. నాకు నమస్కరింపుము.** నీ మనస్సును నాతో నింపుము. తప్పక నన్నే పొందెదవు. ఇది ముమ్మాటికీ సత్యము. శపథం చేయుచున్నను. నీవు నాకు అత్యంత ప్రియుడవు. ''

ఉదయం పూజా కార్యక్రమం అయ్యాక పద్మావతీ దేవి గారు ఉయ్యాల బల్లపై కూర్చుని ఉంటే సీతమ్మ భగవద్గీత చదివి వినిపిస్తుంది ఆమెకు. నిత్యం జరిగే కార్యక్రమం ఇది.

భగవద్గీతలోని ప్రతి శ్లోకం చదివాక క్షణాలు ఆగి మరల మరో శ్లోకం చదవడం సీతమ్మకు అలవాటు. ఆ తరువాత ''ఆ - కానియ్'' అని పద్మావతీదేవిగారు అనాలి.

కృష్ణభగవాన్ ఏమిటీ లీల? నీ భక్తురాలినయ్యాను. స్వామీ నీకు అనునిత్యం నమస్కరిస్తూనే ఉన్నాను. నీ సుందర రూపంతోనే నా మనసంతా నింపుకోమన్నావు. నింపుకోడానికి ప్రయత్నం చేస్తున్నాను భగవాన్. కానీ నా మనసు వశం కావడం లేదే. ఈ వృద్ధాప్యంలో కృష్ణా రామా అని కాలం వెళ్ళబుచ్చుకోవాలనుకుంటే మధ్యలో నా మనసును ఎందుకు శోధిస్తున్నావు కృష్ణా.

మనుషులకు పునర్జన్మ అనేది ఉందని అంటావు గోపాలా. నాకు ఈ రోజు రాత్రి కలలో ఈ విషయం ఋజువు చెయ్యాలి గోపీలోలా.

ఎప్పుడూ నా నిత్యకృత్యాలలో ఎక్కువ కాలం నీ ధ్యానంతోనే గడుపుతున్నానే మరి ఎందుకు నాకు ఇలాంటి కఠిన పరీక్షలు పెడుతున్నావు.

చాలా కాలం క్రితం నన్ను అన్యాయం చేసి ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోయినాయన్ను తలచుకుంటూ, ఆయన దగ్గరకు వెళ్ళే రోజు త్వరగా రావాలని నిన్ను సదా ప్రార్ధిస్తూ ఉంటే మధ్యలో పునర్జన్మ అంటూ ఈ పిల్లవాడి గోల ఏమిటి స్వామీ?

నాకు ఎందుకు ఇలా పరీక్ష పెట్టావు?

నేను నిన్నే శరణు కోరి నమ్మి ధ్యానిస్తున్నానే?

అంటూ ఆ హాలులో ఒక మూలగా ఉన్న పాలరాతి గోపాలకృష్ణుని విగ్రహం వేపు భక్తితో చూస్తూ మాట్లాడుతూంది పద్మావతీదేవి.

అలా మాట్లాడుతున్న ఆమెగారిని నిశితంగా చూస్తూంది సీతమ్మ.

"నేనేదో పిచ్చి మాటలు మాట్లాడుతూంటాను. నువ్వు చదవవే సీతమ్మ తల్లీ" అంది పద్మావతీ దేవిగారు.

"సీతమ్మ భగవద్గీత చదువుకునేటప్పుడు లోపలకు రావద్దని చెప్పానా లేదా? బడుద్దాయ్" అంటూ అరిచింది అప్పుడే లోనికొచ్చిన గూర్ఖా వాడిని చూసి..

"అదికాదమ్మా. ఎవరో ఒకాయన ఖాకీ రంగు బట్టలు వేసుకున్నాడు. ఆరడుగుల ఎత్తు ఉన్నాడు. అర్జెంటుగా అమ్మగారిని కలవాలంటున్నాడు. ఆయన్ను చూస్తే పోలిస్ డిపార్ట్‌మెంటాయనలా ఉండాడమ్మా. అందుకని పరుగులతో వచ్చా" అన్నాడు భయం భయంగా.

"పోలీసా? ఇదెక్కడి ఖర్మరా బాబూ. మన ఇంటికి ఏదో గ్రహం పట్టింది. నాలుగురోజుల క్రితమే వాళ్ళ పిల్లాడిని ఎత్తుకొచ్చామేమోనని మొగుడూ పెళ్ళాం వచ్చారు. ఇవ్వాళేమో పోలీసు రావడమూ. ఏమిటి స్వామీ నీ లీలలు?" అంటూ వాపోతున్న పద్మావతీదేవిగారితో.

"ఊరుకోండి అమ్మగారు. పోలీసు కాదులెండి. వీడి బొంద. వీడికేం తెలియదు. రమ్మనమను లోపలికి ఆయన్ని" అంది సీతమ్మ గూర్ఖాతో.

సుమారు ఆరడుగుల ఎత్తులో లేత ఖాకీ రంగు సఫారీ సూటులో పుష్టిగా ఉన్న ఒక వ్యక్తి లోపలకు ప్రవేశించాడు. అతని ముఖం కొంచెం సీరియస్‌గా ఉంది కళ్ళజోడు ఉంది. ముఖంలో గుబురు మీసాలు బాగా కనిపిస్తున్నాయి. అతను పద్మావతీదేవి గారి ముందు నిలబడి--

"అమ్మా నమస్కారం. నన్ను గుర్తుపట్టారా తమరు?" అన్నాడు వస్తూనే.

"ఎవరు మీరు?" అంది తన కళ్ళజోడు సవరించుకుంటూ పద్మావతీ దేవి.

"నేనూ మీ మనవడు వెంకట్ గారూ ఒకే స్కూలులో చదువుకున్నాం. మాది పక్క ఊరే. నా పేరు శ్రీనివాసరావు" అన్నాడు.

"అది సరే బాబూ. ఏం పనిమీద వచ్చావ్? మా వెంకట్‌ని కలిశావా? కూర్చోబాబూ, సీతమ్మా అబ్బాయికి కూల్ డ్రింక్ పట్టుకురా?" అంది.

పద్మావతీదేవి గారి ఎదురుగా ఉన్న నాలుగు కుర్చీలో ఒకదానిపై కూర్చున్నాడు శ్రీనివాసరావు. లోపలనుండి ట్రేలో కూల్ డ్రింక్ గ్లాసు పట్టుకు వచ్చింది సీతమ్మ. ఆ డ్రింక్ తాగాక--

"నేను విజయవాడలో ఒక ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెనీ నడుపుతున్నానమ్మా. నాకు మీ మనవడుగారు అమెరికాలో కూడా ట్రైనింగ్ ఇప్పించారు. రెండు రోజుల క్రితం నాకు అమెరికా నుండి ఫోన్ చేసి, మీకు ఒక ఇబ్బంది వచ్చిందనీ, ఆ విషయంలో తగు సహాయం చెయ్యమని నాకు చెప్పారు.. " అంటున్న అతని మాటలకు అడ్డువచ్చి పద్మావతీ దేవి--

"అవును బాబూ. కృష్ణా రామ అనుకుంటూ నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చుతున్న నా జీవితంలో ఒక్కసారి, పునర్జన్మ అది ఒకటి ప్రవేశించి నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేస్తూంది బాబూ" అంటూ ఉన్నపళంగా ముఖం విచారంగా పెట్టేసుకుంది పద్మావతీదేవి.

ఈ సంఘటన మూలంగా పెద్దామె ఎంత గాయపడిందో అర్థమైపోయింది శ్రీనివాస్‌కి. తన ఫ్రెండ్ వెంకట్ ఫోనులో వెలిబుచ్చిన ఆందోళన కళ్ళకు కట్టినట్లుగా ఆమె ముఖంలో గోచరిస్తూంది. ఈమె నిజంగానే తన భర్త ఒక బాలుని రూపంలో జన్మ ఎత్తేడని గాఢంగా విశ్వసిస్తూంది. చాలాకాలం నుండీ ఆయన స్మృతులతో కాలం వెళ్ళబుచ్చుతూందో ఏమో మొత్తానికి ఆమె జీవిత్మ ఈ సంఘటనతో మరో మలుపు తిరగబోతోంది.

"అమ్మగారూ. మీరు అనవసరంగా ఆందోళన పడవద్దు. అలాగే విచారం కూడా వద్దు. సమాజంలో ఇలాంటివి ఎన్నో జరుగుతూంటాయి. ప్రతీ విషయాన్ని మనం ప్రధానంగా ఆలోచించకూడదు. లైట్‌గా తీసుకోవాలి. అలాగని పూర్తిగా వదిలేయమనీ నేను చెప్పడం లేదు.

అయితే కంగారు పడి మీరు ఆ పిల్లవాడిని తమ ఇంటికి తీసుకు రావాలనే నిర్ణయం మాత్రం అప్పుడే తీసుకోవద్దు.

నేను విషయాలన్నీ కూపీ లాగి మీకు అసలు సంగతి చెబుతాను. అప్పటిదాకా దయచేసి తమరు మనసును కంట్రోల్‌లో ఉంచుకుని ఎదురు చూడండి.

మనం ఆ పిల్లవాడి ని మానసిక వైద్యుని దగ్గరకు తీసుకు వెళదాం. పరీక్ష చేయిస్తే డాక్టర్లు అసలు రహస్యం చెప్పేస్తారు.

మీరు ఇక్కడ ఒక్కరే ఉన్నారు, అమెరికాలో మీ మనవడూ మనవరాలూ దూరప్రాంతంలో ఉండిపోయారు ఈ సమస్య వచ్చిపడిందనీ బాధపడకండి.

నన్ను మీ మనవడు వెంకట్‌గారు మిమ్మల్ని కనిపెట్టుకుని ఉండమని పంపించారు.

అందువలన మీరు నాకు చెప్పకుండా, నన్ను సంప్రదించకుండా ఈ విషయంలో ముందుకు వెళ్ళవద్దు. దయచేసి నా మాట వినండి" అంటున్న శ్రీనివాస్‌ని అదో రకంగా చూడసాగింది పద్మావతీదేవిగారు. ఆమె చూపులో ఏమిటి నేను వీడి కంట్రోల్‌లో ఉండాలా ఇంత బ్రతుకూ బ్రతికి అన్న అర్థం కూడా గోచరిస్తూంది.

"అవును బాబూ. నువ్వు చెప్పేదంతా బాగానే ఉంది. వాడు మా కుటుంబం గురించీ, నా గురించీ అంత వివరంగా మాట్లాడుతూంటే అది నిజం కాదని ఎలా అనుకుంటాం చెప్పు. ఏ మనిషి అయినా నమ్మకుండా ఉంటారా? అయితే నాకు మాత్రం వెంటనే ఆ పిల్లవాడిని చూడాలని ఉంది బాబూ. నువ్వు ఇప్పుడు చెబుతున్నావు కాబట్టి ఆలోచిస్తాను. మా మనవడికి చెప్పు అనవసరంగా నా గురించి ఎక్కువగా ఆలోచించి కంగారు పడవద్దని" అంది.

పద్మావతీ దేవి మాటల సరళిని పరిశీలిస్తూంటే శ్రీనివాస్‌కి ఆమె మనసు అర్థమైంది. తన భర్త ఆ పిల్లవాడి రూపంలో మరల జన్మించాడనే స్థిత నిర్ణయానికి ఆమె వచ్చేసింది. ఆమె ఆ విషయంలో పూర్తిగా లీనమైపోయింది. ఏది ఏమైనా తన ఫ్రెండ్ వెంకట్ ఆమె మంచీ చెడ్డా తనకు అప్పచెప్పాడు కాబట్టి ఈ విషయంలో ఆమెకు ఎటువంటి హానీ జరగకుండా చూడాలి- అనుకుంటున్నాడు

"బాబూ శ్రీనివాస్ గారూ. మా అమ్మగారిని ఈ ఆపద నుండి తమరే గట్టెక్కించాల. ముందుగా ఆ పిల్లోడి ఆచూకీ తెలుసుకోండి బాబూ" అంది సీతమ్మ.

"అలాగేలే. మీరు మీ అమ్మగారిని జాగ్రత్తగా చూసుకోండి. ఈ విషయాలేవీ ఆలోచించకుండా అమ్మగారిని దైవధ్యానంలో గడిపేట్లుగా చూడండి. నేను వెంకట్ గారికి ఫోను చేసి అమ్మగారిని చూసినట్లుగా చెపుతాను" అన్నాడు సీతమ్మతో.

శ్రీనివాస్ లేచి నిలబడి పద్మావతీ దేవి గారి వేపు తిరిగి

"అమ్మగారూ మనిషి జీవితంలో ప్రతీ విషయంలోనూ దాదాపు మోసపోతూనే ఉన్నాడు. కానీ తెలుసుకోవడం లేదు. మనిషిని మనిషే మోసం చేయడం, మోసగింపబడడం బాగా అలవాటైపోయింది. నమ్మకమే మనిషిని మోసానికి గురి చేస్తూంది చాలా సులభంగా.

నమ్మించి మోసం చేయడం ఒక కళ అయిపోయి కూర్చుంది. దీనిమీదే కొంత మంది బ్రతికేస్తున్నారు ప్రపంచంలో. అందులోనూ మీరు సంపన్నులు. అందరికీ మీ మీదే కళ్ళు పడతాయి. అందుకని చాలా జాగ్రత్తగా మెలగాలి మీరు. మీ మనవడు గారు మీ గురించి చాలా ఆందోళన చెందుతున్నారు. అందుకని మెలుకువగా ధైర్యంగా ఉండండి. మరి ఉంటానమ్మా మళ్ళీ ఒక వారం రోజుల్లో కలుస్తాను" అంటూ వెళ్ళిపోయాడు శ్రీనివాస్.

తన భర్త పునర్జన్మ విషయంలో ప్రతీవారూ ఇది నిజం కాదని అంటున్నారు. అంతేకానీ ఒకసారి ఆ పిల్లవాడిని చూసి విషయం తెలుసుకుందాం, ఇలా జరగడానికి అవకాశం ఉందని మాత్రం ఎవరూ అనడం లేదు.

ఏమిటీ విచిత్రం?

ఏది ఏమైనా ఆ పిల్లవాడిని తాను సాధ్యమైనంత త్వరగా చూడాలి.

ఎలాగూ మనవడు పంపిన మనిషి తనకు ఏం జరగకుమా చూస్తూనే ఉంటాడు కాబట్టి తనకు తట్టిన ఆలోచన అమలులో పెట్టడం మంచిదేమో అనుకుంటూంది పద్మావతీ దేవిగారు.

●●●

**అప్పుడే పూజ కార్యక్రమం** పూర్తిచేసుకుని వచ్చి పద్మావతీదేవి ఉయ్యాల బల్లపై కూర్చుని ఉంది. సీత భగవద్గీత లేదా ఏదైనా పురాణ పఠనం చేయాల్సిన సమయం.

సీతమ్మ లోపలనుండి వస్తూనే --

"అమ్మగారూ. ఇవ్వాళ మనం భగవద్గీతకు బదులుగా జగద్గురు శంకరాచార్యుల వారి భజగోవిందంలో కొన్ని శ్లోకాలు చదువుకుందాం. అసలే మీ మనసు బాగాలేదు కదా" అంది.

"ఏదో ఒకటి కానియ్. ఏది ఏమైనా నా మనసంతా వికలంగా తయారైందే సీతమ్మ తల్లీ అంది పద్మావతీదేవి.

"కాతే కాన్తా కస్తే పుత్రః
సంసారోయ మతీవ విచిత్రః
కస్యత్వం కః కుత ఆయాతః
తత్త్వం చిన్తయ తదిదం భ్రాతః
తత్త్వం చిన్తయ తదిదం భ్రాతః

కాంత నీకు ఎటువంటిది? పుత్రుడు ఎట్టివాడు? సంసారమనేది చాల చిత్రమైనటువంటిది. అసలు నీవెవరవి? ఎక్కడనుండి వచ్చావు? తెలుసుకుందువా? అనగా తెలుసుకోగలవా? అందువలన నే నీ మనమున గలుగు భావనలచే భావింప చేసుకొంటివి. నీవు తలంచి చూస్తే ఇదంతా భ్రాంతి సుమా"

"అవునే తల్లీ. మనం భ్రాంతిలోనే బ్రతికేస్తున్నాం. ఈ జీవితం శాశ్వతం అనుకేను ఈ ఇంద్రభవనం, ఉయ్యాల బల్ల శాశ్వతం అనుకుంటున్నాను. మరుక్షణంలో నా ఊపిరి ఆగిపోతే ఏముంది? నా స్థానం పంచభూతాల్లో కలిసిపోతుంది కదా. అప్పుడప్పుడు వేదాంతం కూడా మనం ఆలోచన చెయ్యాలి సుమా. చదువు ఇంకో మంచి శ్లోకం" అంది పద్మావతీదేవి.

పునరపి జననం పునరపి మరణం
పునరపి జననే జఠరేశయనం
ఇహ సంసారే బహు దుస్తారే
కృపయా పారే పాహి మురారే.

పుట్టుక, చావు - తల్లి గర్భము నుండి గర్భస్తంబగు నరకము అనుభవించుట అనునటువంటి ఈ సంసార కూపము నుండి దాటుట చాలా కష్టతరమైనది. కావున ఇట్టి ఈ దుఃఖముల నుండి విముక్తి పొందవలెనన్న, అట్టి దీన బాంధవుడగు మురారి కృపను పొందుటకై సదా గోవిందుని భజింపుము, స్మరింపుము."

"అదీలెక్క. అదిగో మనం ఇప్పుడు దేని గురించి సతమతమైపోతున్నమో సరిగ్గా ఆ విషయం దగ్గరకే తీసుకువచ్చావు గదే సీతమ్మ తల్లీ.

పునరపి జననం - పునరపి మరణం, మనిషి పుట్టడం, మరణించడం మనిషి ఈ చక్రం చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. కానీ మరణం అనేది ఒకటి ఉందని మాత్రం ఎప్పుడూ తలచుకోడు. పైగా ఎప్పటికైనా నేను మరణించవలసిందే కదానని జీవితంలో కనీసం ఒక్క నిముషమైనా వైరాగ్యంతో ఉండలేడు. అందరూ అంటూ ఉంటారు ప్రసూతి వైరాగ్యం అనీ శ్మశాన వైరాగ్యం అనీ. కాని ప్రసూతి నుండి శ్మశానం నుండి తిరిగి వచ్చాక మనిషి మళ్లీ మాయలో పడిపోతాడు. ఎంత చిత్రమైనదీ మానవజీవితం" అంది పద్మావతీదేవి.

సీతమ్మ చదువుతున్న భజగోవింద శ్లోకాలు విన్న తరువాత పద్మావతీదేవి గారు ఏదేదో మాట్లాడేస్తూంది. ఆమె మనసు మనసులో లేదని ఆమె మాటలే చెబుతున్నయి.

సత్యన్నారాయణని ఒక పనిమీద పంపించింది. అతని కోసం ఆమె ఎదురుచూస్తూంది. ప్రస్తుతం ఆమె మనసు ఏ విషయంపైన లగ్నం కావడంలేదు.

పద్మావతీదేవిగారి మౌనంగా ఉండడం గమనించి సీతమ్మ -

"అమ్మగారూ ఇవ్వాళ సత్యనారాయణ రావాలి. ఇంకా రాలేదేమిటి? అక్కడ ఏదైనా సమస్యలో ఇరుక్కున్నాడా ఏమిటి కొంపదీసి?" అంది సీతమ్మ.

"నువ్వొకదానివి. నీకు అన్నీ అనుమానలూ, అపశకునాలూ. వెళ్లినవాడు పని సాధించుకుని రావాలి కదా. మన సత్తెన్న ఏ పని మీదైనా వెళ్లాడంటే ఇంతవరకూ పనికాకుండా తిరిగి రాలేదు సుమా. వాడు చాలా తెలివైనవాడే" అంది పద్మావతీదేవి.

ఆమె ఇలా మాట్లాడుతూ ఉండగానే సత్యన్నారాయణ హాలులో ప్రవేశించాడు చేతిలో బేగ్‌తో -

"అడుగో మాటల్లోనే వచ్చేశాడు" అంది సీతమ్మ అతన్ని చూస్తూ -

"అమ్మగారూ నమస్కారాలు. మన బంగ్లా వదిలిపెట్టి ఎక్కడైనా నిద్రచేయాలంటే నా పని అయిపోతుండి బాబో" అన్నాడు వస్తూనే.

"అది సరే - వెళ్లిన పని కాయా? పండా?" అంది

"పండేనండి. ఒక వేళ కాయ స్థితిలో ఉన్నా ఆ కాయను పండించి తీసుకువస్తాను కదా. అమ్మగారు చెబితే ఆ మాటకు తిరుగు ఉందా?"

"అయితే మరి విశేషాలు ఏమిటి?"

"ఆ పిల్లవాడిని ఒక భార్యాభర్తా టెలివిజన్ కేంద్రానికి తీసుకు వచ్చారుటండి. మా అబ్బాయి చెప్పిన పునర్జన్మ వివరాల గురించి ఎవరైనా ఇంకా తెలుసుకోవాలనుకుంటు మా దగ్గరకు పంపించండి అని వాళ్ల అడ్రసు కూడా ఇచ్చారటండి. అడ్రసు ఇవ్వమంటే కొంచె ఇబ్బంది పెట్టారనుకోండి అయినా సాధించుకుని మరీ వచ్చాను.

వెంటనే తిరిగి వచ్చేసేవాడినే. కానీ ఆ అడ్రసు సరి అయిందో కాదని అనుమానం వచ్చి వెంటనే బయలుదేరి ఆ అడ్రసుకు వెళ్లి రహస్యంగా వాకబు చేసి వచ్చానండి. మనం వెళ్లడానికి కూడా సులువుగా ఉంటుంది కదండీ" అన్నాడు సత్యన్నారాయణ.

"మరి మన ఎలా వెళ్లాలి? ఏమిటి సంగతి?" అందామె. ఆమెకు అప్పటికప్పుడే రెక్కలు కట్టుకుని ఎగిరిపోవాలని ఉంది.

"తెల్లవారుఝామునే కారులో వెళ్లిపోదాం అమ్మా. ఆ ఊరుకు తొమ్మిదిన్నరకు వెళ్తాం. అక్కడ హోటల్లో టిఫిన్లు చేసి, ఆళ్ల దగ్గరకు వెళ్దాం. అక్కడ పనులన్నీ చూసుకుని, అన్నీ మనకు అనుకూలంగా అనిపిస్తే, పిల్లవాడితో సహా రాత్రికి మన బంగ్లాలో ఉంటాం. అంతే!" అన్నాడు సత్యన్నారాయణ.

పద్మావతీదేవి అతన్ని అభినందన పూర్వకంగా చూస్తోంది.

●●●

రెండు గదులూ, ఒక వంటిల్లు, ఒక ముందు వరండా ఉన్న వాటా ఇల్లు అది.

ఆ ఇంట్లో ఒక భార్య, భర్తా, పదకొండేళ్ల పిల్లవాడు ఉంటున్నారు కొద్ది రోజుల నుండి.

ఇంటి యజమానికి ఏం ఉద్యోగమో తెలియదు. ఎప్పుడూ ఇంట్లోనే ఉంటాడు. ముగ్గురూ బయటకు వెళ్లినట్లు కూడా అనిపించదు.

అప్పుడప్పుడు కుటుంబ అవసరాల కోసం అతను మాత్రం బయటకు వెళ్లి సరుకులు వగైరాలు తెస్తూంటాడు ఇంట్లో అత్యవసరమైన సామాన్లు మాత్రమే ఉన్నట్లుగా ఇల్లంతా ఖాళీగాఉంటుంది. ఆ ఇంట్లో –

అతను ఒక ఫైబర్ కుర్చీలో కూర్చుని ఉన్నాడు. పొడుగ్గా పుష్టిగా ఉన్నాడు. తెల్లని షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంటు వేసుకున్నాడు. ఏదో ఆలోచనలో ఉన్నాడు. అతని వయసు నలభై సంవత్సరాలకు పైనే ఉంటుంది.

ఆమె పోలియస్టర్ చీర కట్టింది. పొడుగ్గా, పొడుగుకు తగ్గ పుష్టిగా ఉంది. చామన ఛాయ రంగులో ఉంది. వయసు నలభై సంవత్సరాల లోపు ఉండచ్చు. ఆమె అతని పక్కనే మరో కుర్చీలో కూర్చుని ఉంది. ఆమె కూడా ఏదో ఆలోచనలలో ఉంది.

వాళ్ల ఎదురుగా ఆ పిల్లవాడు కింద కూర్చుని చందమామ పుస్తకం చదువుకుంటున్నాడు.

ఇంతలో–

తలుపు కొట్టిన చప్పుడు అయింది.

తలుపు తీయడానికి లేచి వెళుతున్న ఆమెను ఆపుచేసి అతను వెళ్లి తలుపు తీశాడు.

ఎదురుగా ఒక అపరిచిత వ్యక్తి

"నమస్కారం సర్"

"నమస్తే చెప్పండి ఏం కావాలి మీకు?"

"మీ అబ్బాయిని ఈ మధ్యన టెలివిజన్‌లో చూశాం. ఆ అబ్బాయి చాలా ఆసక్తిరకమైన విషయలు చెప్పాడు ఆ రోజున, అందుకని ఒకసారి చూసి వెళ్దామని" అతని మాటలకు అడ్డు తగిలి –

"మీరు ఒక్కరే వచ్చారా లేక"

"కాదండి మా అమ్మగారు కూడా వచ్చారు. వారు మీ పిల్లవాడిని చూడాలని కోరుతున్నారు" అన్నాడు.

"మీ పేరు"

"సత్యన్నారాయణ. నన్ను సత్తెన్న అంటారు. నేను మా అమ్మగారి నమ్మిన బంటునండి. అందుకని నన్ను వెంట పెట్టుకుని వచ్చారు అమ్మగారు."

"అలాగా మీ అమ్మగారిని రమ్మనమనండి"

"కారులో ఉన్నారండి. పిలుచుకు వస్తాను - అంటూ సత్తెన్న కారు దగ్గరరకు వెళ్లాడు.

కొంచెంసేపటికి -

లేత కనకాంబరం రంగు వెంకటగిరి చీరలో అదే రంగు జాకెట్‌లో పద్మావతీదేవిగారు పచ్చగా ఉంటారేమో, ఆ చీరలో మరీ మెరిసిపోతున్నారు. మెడలో దళసరి చంద్రహారాలు, రెండు చేతులకూ చెరో అరడజను బంగారు గాజులూ, గోల్డ్ ఫ్రేమ్‌లో కళ్లజోడూ, ఆమె చాలా ఖరీదుగా సంపన్నులకు ప్రతినిధిల నడిచి వచ్చే సిరిసంపదలా ఉంది. ఆమె చేతిలో లేత గులాబీ రంగు చేతి రుమాలు ఉంది.

ముందు సత్తెన్న - ఆ వెనుక పద్మావతీదేవి - ఆమె వెనుక సీతమ్మ వస్తున్నారు.

అతను రెండో తలుపు కూడాతీసి వచ్చేవాళ్లకు దారి ఇచ్చాడు.

పద్మావతీదేవి తదితరులు లోపలకు ప్రవేశించగానే

"అమ్మా నమస్కారం రండి - " అంటూ అతనితో పాటు అతని భార్య కూడా లేచి లోపలకు ఆహ్వానించింది.

లోపలినుండి మూడు గ్లాసులతో నీళ్లు పట్టుకువచ్చారు.

ఒక ఫైబర్ కుర్చీ శుభ్రంగా తుడిచి పద్మావతీదేవి గారిని కూర్చోమన్నారు. సీతమ్మ ఆమె ప్రక్కనే కింద కూర్చుంది. సత్తెన్న నిలబడే ఉన్నాడు.

ఎవరూ నీళ్లు తాగలేదు.

ఇంతలో అతను ముఖం విచారంగా పెట్టి చెప్పడం మొదలుపెట్టాడు.

"మూడు నెలల్రకితం వరకూ, మమూలుగా స్కూలుకు వెళ్తున్నాడమ్మా ఏ సమస్యాలేదు. ఒకరోజు ఉన్న పళంగా లేచి ఈ పిచ్చి మాటలు మొదలుపెట్టాడు. మాట్లాడితే సిరిపురం వెళ్లిపోతానంటాడు. ఏవేవో మాట్లాడతాడు. వాడి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. అసలు మాకు సిరిపురం ఎక్కడో తెలియదు. వాడు చెప్పే మనుషులూ, ప్రాంతం అస్సలు తెలియదు. కొన్నిరోజులు వాడిగోల భరించాం. స్కూలుకు వెళ్లడం మానేశాడు. తిండీ తిప్పలూ సరిగా తినడు. ఒకరోజు తెలుసున్న వాళ్లు వచ్చి వీడి వ్యవహారం చూసి చాలా ఆశ్చర్యపోయి చాలా వింతగా ఉండి వీడి ప్రవర్తన వెంటనే వీడిని చాలా ప్రశ్నలు వేశారు. వాళ్లు కూడా ఆశ్చర్యపోయి ఎందుకైనా మంచిది మా టెలివిజన్‌లో ప్రసారం చేస్తాం ఒక వేళ మీ అబ్బాయి చెపుతున్న వివరాల ప్రకారం ఎవరైనా వస్తే మంచిదే వాడిని వదిలి ఒక్క క్షణం ఉండలేను తల్లీ" అంటూ ఏడుస్తూంది.

"ఉండెహ. ముందే నీ ఏడుపు ఒకటి. వెళ్లి వాడిని తీసుకురా. అమ్మగారు చూస్తారు" అన్నాడు.

కొంచెం సేపటికి ఆమె లోపలకు వెళ్లింది.

పద్మావతీదేవి ఇంట్లో పరిసరాలు గమనిస్తూంది. నాలుగు ఫైబర్ కుర్చీలు. ఒక పాతకాలం నాటి చెక్కబల్ల తప్పితే తాము కూర్చున్న గదిలో ఏ సామానూ లేదు. ఏమిటో వీళ్ల పరిస్థితీ, బ్రతుకూ.

"మీరేం చేస్తారు బాబూ?"

"నాకు ఉద్యోగం లేదమ్మా. ఎక్కడైనా పని ఉంది అంటే వెళ్లి నాకు చేతనైన పనిచేసి నాలుగు రూపాయలు సంపాదిస్తాను. అలగని మాకు లోటేం లేదు" అన్నాడు.

"ఎన్నాళ్లనుండి ఉంటున్నారు ఇక్కడ?"

"చాలా రోజుల నుండి ఉంటున్నామండి"

"అబ్బాయి ఇక్కడే పుట్టాడా?"

"కాదండీ. మా స్వగ్రామంలోనే పుట్టాడండి."

"అలాగా?!"

"ఈ మధ్య కాలం లో మీ అబ్బాయికి జ్వరంలేదా ఏదైనా జబ్బు పడడం జరిగి చాలా బలహీనంగా అయిపోయాడా?"

"అబ్బే ఏం లేదండమ్మా వాడు చాలా ఆరోగ్యంగా ఉంటాడండమ్మా"

"అలాగా! అయితే ఉన్నపళంగా ఎందుకు అలా పునర్జన్మ గురించి మాట్లాడుతున్నాడు. ఈ మధ్యన మీరు ఏవైనా సినిమాలు చూశారా?"

"లేదమ్మా. వాడి చదువుపాడైపోతుందని మేం అసలు టీ.వి కూడా కొనుక్కోలేదండి"

ఇంతలో నాలుగడుగుల ఎత్తులో తెల్లని ప్యాంటూ, షర్టూ వేసుకున్న పిల్లవాడిని లోపలనుండి తీసుకువచ్చింది లోపలకు వెళ్లినామె. అతని ముఖం తెల్లగా ప్రకాశవంతంగా ఉంది. కన్నూ ముక్కూ తీర్చిదిద్దినట్లుగా కొంచెం బుగ్గలతో అందంగా ఆకర్షణీయంగా ఉన్నాడు వాడు. కొంచెం పుష్టిగా ఉన్నాడు. వాడి కళ్ళు మామూలు కళ్ళలా కాకుండా వెలుగులు జిమ్ముతున్నాయి. ధనవంతుల బిడ్డలా మెరిసిపోతున్నాడు వాడు.

"బాబూ నిన్ను చూడాలని వచ్చేరురా అమ్మగారు. ఆమెగారిని చూసి వెంటనే ఆమెతో వెళ్లిపోతానని అనేవు గనుక, నా గుండె చెరువైపోతుంది" అంటూ తల్లి మళ్లీ శోకాలు మొదలు పెట్టింది.

"ఉండెహె. నీతో గొప్ప చిక్కొచ్చిపడింది. నోర్మూసుకో. ఆ ఏడుపు ఆపమన్నానా లేదా? " అంటూ కేకలేస్తున్నాడామెను.

ఆమెను కేకలేయొద్దని అతన్ని అరచేతితో ఆపింది పద్మావతీదేవి.

పిల్లవాడిని పరిశీలిస్తూంది. వీడేమిటి ఇలా మెరిసిపోతున్నాడు? సిరిసంపదలు వీడిలో నిండి ఉన్నట్లుగా వెలిగిపోతున్నాడేమిటి? మట్టిలో మాణిక్యంలా ఇక్కడ జన్మించాడేమిటి? అని పరిపరివిధాలా ఆలోచిస్తూంది పద్మావతీదేవి.

ఆ పిల్లవాడు కూడా పద్మావతీదేవిని కన్నార్పకుండా అదేపనిగా పరిశీలిస్తున్నాడు. ఆమెను నఖశిఖ పర్యంతమూ గమనిస్తున్నాడు. అప్పటి వరకూ సీరియస్‌గా ఉన్నవాడి ముఖం ఒక్కసారిగా ప్రసన్నవదనం అయింది. ఆమెను ఎన్నోసార్లు పైకీ కిందకూ చూసి, ఉన్నపళంగా ఆమెకు దగ్గరగా చకచకా పరుగులాంటి నడకతో వచ్చేసి -

"సిరిపురం నుండి నా కోసం వచ్చావా పద్మూ -- ఎన్ని సంవత్సరాలైంది నిన్ను చూసి?" అంటూ పద్మావతీదేవి గారి దగ్గరకు వెళ్లి ఆమె నుదురు ముద్దాడి, వెంటనే  ఆమె ఒడిలో వాలిపోయాడు.

ఈ హఠాత్పరిణామానికి ఆ గదిలో ఉన్న అందరూ బిత్తరపోయారు.

ముఖ్యంగా ఆ పిల్లవాడి తల్లి తండ్రి ముఖాల్లో సంబరం బాగా కనుపించింది.

తన ఒడిలో ఉన్న పిల్లవాడి ఒళ్లంతా నిమురుతూంది పద్మావతీదేవి.

ఒక్కసారిగా ఆమె ఏడ్వసాగింది.

"అయ్యోదేవుడోయ్. ఎన్ని సంవత్సరాలయింది. నువ్వు నా నుదుట ముద్దాడి, స్వామీ మరలా నాకోసం పుట్టేవా? ఒంటరి తనాన్ని భరించలేక ఏడుస్తున్న నన్ను ఓదార్చడానికి వచ్చావా?" అంటున్న ఆమె ముఖాన్ని తన రెండు చేతులతో తడుముతూ ఆమెను గట్టిగా హత్తుకుంటున్నాడా పిల్లవాడు.

వయసులో ఉన్న అమ్మాయి అబ్బాయి ఇలా హత్తుకుంటూంటే వాళ్ల ప్రణయాన్ని ఆసక్తిగా చూడాలనిపిస్తుంది.

మధ్యవయస్కులు ఇలా ప్రవర్తిస్తే సిగ్గూ శరీరమూ లేకుండా ఈ చేష్టలేమిటి? అని అంటారు అందరూ.

కాని

సుమారు డెబ్బై సంవత్సరాల వయసు ఉన్న ఒక స్త్రీని పదకొండేళ్ల పిల్లవాడు దగ్గరకు లాక్కుని ముద్దుపెట్టి ఆమెను సముదాయిస్తూంటే చూడడానికి చాలా చిత్రంగా ఆసక్తికరంగా ఉంది తప్పితే జుగుప్సాకరంగా లేదు.

"అయితే వీడు ఆమె కూడా వెళ్లిపోతాడంటావా మావా? నా బ్రతుకేంగాను? అయ్యోదేవుడోయ్ నా పిల్లోడిని రక్షించేవారే లేరా?" అంటూ అతని తల్లి శోకాలు పెటసాగింది.

ఆమెను సముదాయించమని సత్తెన్న ఆమె భర్తకు సైగ చేశాడు. అతను ఏడుస్తున్న భార్య వేపు చుస్తూ ముక్కున వేలేసుకుని ఏదో సైగలు చేశాడు. ఆమె వెంటనే ఊరుకుంది.

కొంచెం సమయం గడిచేక -

ప్రక్కనే ఉన్న మరో ఫైబర్ కుర్చీ పద్మావతీదేవి గారి దగ్గరగా జరిపి -

"బాబూ నువ్వు ఈ కుర్చీలో కూర్చో" అని ఆ పిల్లవాడిని, పద్మావతీదేవి గారి ఒడిలోంచి తీసి ఆమె ప్రక్కనే కుర్చీలో కూర్చోపెట్టాడు సత్తెన్న. వాడు ఆప్యాయతానురాగాలతో పద్మావతీదేవిగారినే చూస్తున్నాడు.

"పద్దూ ఎలా ఉన్నావురా.. ఇన్నాళ్లూ ఎలా బ్రతికేవురా నన్ను వదిలిపెట్టి?" అంటున్న పిల్లవాడి చేతులు పట్టుకుని -

"నా తండ్రీ ఎప్పుడూ ఇలాగే అరేయ్ అని పిలుస్తూ నన్ను మురిపించేవాడివి స్వామీ." అంటూ పద్మావతీదేవి తన చేతి రుమాలుతో కళ్లు తుడుచుకోసాగింది.

"పోనీలే. ఒంటరితనంతో బాధపడుతున్న అమ్మగారికి ఒకతోడు దొరికింది. ఈ వయసులో తోడు ముఖ్యం కానీ, మరో అవసరం లేదు కదా. పిల్లాడు మనింట్లోనే ఉండిపోతాడు" అనుకుంటూంది సీతమ్మ.

"ఎన్నో చిత్రాలు చూశాం. సినిమాల్లో చూశాం. టి.వి సీరియల్స్‌లో చూపించారు. కానీ ఈ చిత్రం ఏమిటి? వీడు అచ్చంగా చనిపోయిన అయ్యగారు వచ్చి తన భార్యను చూసినట్లుగా, ఆప్యాయంగా పలకరించినట్లుగా, అప్పుడప్పుడు అమ్మగారు చెప్పేవారు. ఎంతో ముద్దుగా తనను అయ్యగారు పిలిచేవారని అచ్చంగా అలాగే పిలుస్తున్నాడే ఆమెను. వీడికి ఎవరు చెప్పారు? ఏమిటి చిత్రాతి చిత్రం?" అనుకుంటున్నాడు సత్తెన్న.

●●●

**ఇంతలో**

పిల్లవాడి చేతులు పట్టుకునే ఉన్న పద్మావతీదేవి గారు,

"బాబూ..

మీ అబ్బాయికి ఎందుకు ఇలా మనసు మారిందో తెలియదు.

ఒకవేళ నిజంగా మా వారే మీ పిల్లవాడి రూపంలో మరలా పుట్టారేమో చెప్పలేం.

ఒకే ఒక్కసారి నన్ను మా వారు పలకరించినట్లుగానే పలకరించి, నన్ను సముదాయించి, నన్ను ముగ్ధురాల్ని చేసేశాడు. నా ఒళ్ళంతా పులకరించిపోయింది. ఈ అబ్బాయి ప్రవర్తన నిజంగా మా వారి ప్రవర్తనలాగానే ఉంది'' అంటున్న ఆమె మాటలు వింటూ భార్యా భర్తా ఒకర్ని చూసి ఒకరు నవ్వుకోవడం గమనించింది సీతమ్మ. ఇదేమిటి ఇప్పటిదాకా ఏడిచింది ఆ తల్లి. ఇప్పుడేమో నవ్వుతా ఉంది. ఏమిటో చిత్రమైన మనుషులు. ఓహో డబ్బున్నోళ్ళ ఇంటికి తమ పిల్లాడు వెళుతున్నాడని ఒకవేళ ఆనందం కాబోసు అనుకుంది సీతమ్మ.

''అందుకని మీరు కొన్ని రోజులు మీ పిల్లవాడిని మా ఇంటికి పంపించండి. నేను అతని బాగోగులన్నీ చూసుకుంటాను. అంతే కాకుండా మీకు కూడా జీవనోపాధి ఏర్పాటు చేస్తాను. ఇంటికి వెళ్ళాక, మా భవనం చూసేక, మీ పిల్లవాడు ఎలా ప్రవర్తిస్తాడో చూసి నేను మీ వాడిని మా భవంతిలో ఉంచుకోవాలా లేదా అన్నది నిర్ణయించుకుంటాను. బాగా ఆలోచించుకుని మరీ చెప్పండి. మీరు అవునంటే వెంటపెట్టుకుని వెళ్ళిపోతాను'' అంటున్న పద్మావతీదేవిగారి కాళ్ళమీద ఇద్దరూ పడిపోయారు.

''అమ్మగారూ ఒక్కగానొక్క కొడుకు. అల్లారు ముద్దుగా పెంచుకుంటూ ఉన్నాం. ఈలోగా వీడికికి ఈ మాయరోగం వచ్చిపడింది. మా గతేం కాను'' అంటూ ఏడ్వడం మొదలుపెట్టారు.

''మీరు అనవసరంగా ఆందోళన పడకండి. మీ అవసరాలు నేను చూస్తాను. వీడి చదువు ఆగిపోకుండా కూడా ఏర్పాట్లు చేస్తాను. మీ దగ్గర బదులు నా దగ్గర పెరుగుతాడు అంతే. నా దగ్గర ఉంటే ఎంత బాగా ఉంటాడో మీకు తెలుసును కదా?'' అంది పద్మావతీదేవి కళ్ళు చిత్రంగా కదుపుతూ.

''అవునమ్మా. మా వోడు మీలాంటి ధనవంతుల ఇళ్ళల్లో పెరిగితే మాకు సంతోషం కదమ్మా అయితే వాడిని వదిలి ఉండమంటేనే మాకు కష్టంగా ఉంది'' అన్నారు ఇద్దరూ.

''నేను వీడిని ఒక పదిరోజుల తరువాత తీసుకువస్తాను. కొన్నాళ్ళు ఇక్కడ ఉన్నాక మరలా తీసుకువెళ్తాను. అందువలన మీకు బెంగగా ఉండదు సరేనా?'' అంది పద్మావతీ దేవి.

''అలాగేనమ్మా'' అంటూ నిలబడ్డారు ఆమెకు ఎదురుగా చేతులు కట్టుకుని.

సత్తెన్న వెంటనే వాళ్ళిద్దరి చేతుల్లో కొంత డబ్బు ఉంచాడు.

''అమ్మగారి ఫోను నెంబరు ఇదిగో. మీకు ఏదైనా అవసరం ఉంటేనే మాట్లాడండి. క్షణంలో మీకు ఏం కావాలంటే అది చూస్తాం'' సత్తెన్న వాళ్ళకు ఒక కాగితం మీద రాసి ఇచ్చాడు.

వెంటనే ఆ పిల్లవాడిని కట్టుబట్టలతో పద్మావతీదేవి అతని చేతులు పట్టుకుని తన వెంట పెట్టుకుని కారు ఎక్కింది.

కారులో కూర్చుని, అసలే కళ్ళు పెద్దవేమో, ఆ కళ్ళు మరింత పెద్దవి చేసుకుని కారంతా వింతగా చూస్తున్నాడు ఆ పిల్లవాడు. ఏది ఏమైతేనేం వాడి దశ తిరిగింది ఉన్నపళంగా.

భర్త చనిపోయి దుర్భరమైన ఒంటరితనం అనుభవిస్తున్న తనకు, దేవుడు ఒకతోడు ఈ పిల్లవాడి రూపంలో ఏర్పరచాడు. ఈ పెద్దవయసులో వీడి సమక్షంలో తన భర్తతో గడిపిన మధురక్షణాలు, నెమరు వేసుకుంటూ తన శేషజీవితం వెళ్ళబుచ్చుకోవచ్చును. తనను ''పద్దూ'' అనీ ''ఏరా'' అని అచ్చంగా తన భర్త పిలిచినట్లుగానే పిలుస్తున్నాడు వీడు. ఎవరు చెప్పారు వీడికి మరి? పునర్జన్మ కాకపోతే అనుకుంటూ గతించిన తన భర్త జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ మురిసిపోతూంది పద్మావతీదేవి గారు.

కొంచెం సేపటికి సీతమ్మ, సత్తెన్న వచ్చి కారు ఎక్కారు.

కారు నెమ్మదిగా కదిలింది. పద్మావతీదేవిగారి ఆలోచనలు కారు వేగంతో పాటు వేగం పుంజుకున్నాయి.

వీడు తన భర్త ప్రవర్తనను గుర్తుచేయగలిగితే వీడిని పెంచి పెద్దవాడిని చేసి ప్రయోజకుడిని చేయాలి. తన వాటా ఆస్థి వీడికి రాసేయాలి. వీడికి ఏ లోటూ రాకుండా పెంచాలి. బాగా డబ్బు సంపాదించే చదువు చెప్పించాలి, వీడి సంపాదన తను చూడాలి, అనుభవించాలి. ఇకా కొనసాగుతున్నాయి ఆమె ఆలోచనలు.

మనిషి జీవితం బుద్బుదప్రాయం. మనిషి జీవితంలో మరుక్షణంలో ఏం జరుగుతుందో తెలియదు. జీవితం శాశ్వతం కాదు. మనిషి పంచభూతాలలో కలిసిపోతాడు. జీవితం పూర్తిగా అశాశ్వతం, రేపనేది లేదు. ఈ రోజే నువ్వు చేయాల్సిన పని చేసేయ్. రేపు నీది కాదు. అలా అనుకుంటే మరుక్షణం కూడా నీది కాదు. అంటూ జ్ఞానులూ, ముముక్షువులూ చెబుతూంటారు.

కానీ, డెబ్బై సంవత్సరాల వయసులో పద్మావతీదేవిగారి ఆలోచనలు, ప్రణాళికలు మరో ఏభై సంవత్సరాలకు సరిపడా ఉన్నాయి. ఈ ఆలోచనలు ఆచరణ యోగ్యమైనవే, కానీ ఆచరణలో పెట్టడానికి ఆమెకు అంత సుదీర్ఘ ఆయుర్దాయం ఉందా? ఏమో?

కానీ మనిషి జీవితం అశాశ్వతం అని ప్రణాళికలు లేకుండా, రేపు అనేది లేకుండా జీవించలేడు కదా?

●●●

తమ పిల్లవాడిని పద్మావతీదేవి వచ్చి తీసుకు వెళ్ళాక తమకైతే చేతినిండా డబ్బు వచ్చింది కానీ బాగా కలిసిపోయిన పిల్లాడిని వదిలి ఉండడమే వాళ్ళకు కష్టంగా ఉందని దంపతులు ఇద్దరూ బాధపడుతున్నారు. ఒకవేళ వాడు ఆమెకు అనుకూలంగా ప్రవర్తించి వాళ్ళ ఇంట్లో పూర్తిగా కలిసిపోతే తమ గతేం కాను? అయిన ఆమె కూడా పిల్లవాడిని తీసుకు వెళ్ళినందుకు బదులుగా తమ జీవితానికి ఏదో ఏర్పాటు చేస్తానంది కదా. ఏదో చిన్న వ్యాపారం పెట్టుకుంటే జీవితం వెళ్ళిపోతుంది. ఎప్పుడు డబ్బు కావాలంటే అప్పుడు ఆమెను డబ్బు అడగవచ్చును కదా. ఒకవేళ డబ్బు ఇవ్వడానికి వెనకాడినా, ఇబ్బంది పెట్టినా పిల్లాడిని మా ఇంటికి తీసుకువెళ్ళిపోతామని బెదిరిస్తే సరి, తమ చేతిలో ఆయుధం వాడే కదా.

భార్యా, భర్తా విచారంగా కూర్చుని ఉన్నారు.

ఇంతలో

తలుపు చప్పుడయింది.

ఇద్దరూ ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నాక, భర్త వెళ్ళి తలుపు తీశాడు.

ఎదురుగా సుమారు ఆరు అడుగులు ఎత్తు ఉన్న ఒక బలిష్టమైన వ్యక్తి లేత నీలం రంగు సఫారీ సూటింగ్‌లో ఉన్నాడు. ముఖం చాలా సీరియస్‌గా ఉంది. గుబురు మీసాలు, కళ్ళకు ఖరీదైన అద్దాలు ఉన్నాయి.

"ఎవరు కావాలండీ?"

"మీరే కావాలి"

"మీరు ఎవరు?"

"ఈ ఊరే మాది. మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి. అందుకని వచ్చాను"

"ఏ విషయాలు? మాతో మీ కేం పని?" భర్త సీరియస్‌గా ముఖం పెట్టాడు.

"నేను ఏదైనా చెబితే కదా అసలు విషయమేమిటో మీకు తెలిసేది" అన్నాడు.

"నాకు మీరెవరో తెలియదు. నేను మీతో ఏ విషయలూ మాట్లాడాల్సిన అవసరం లేదు. దయచేసి వెళ్ళిపోండి."

"నేను చిన్న విషయం చెబుతాను లోపలకు రానులే. నా ప్రశ్నకు అవును కాదు అని జవాబు చెబితే చాలు"

"చెప్పండి"

"మీ ఇంట్లో ఆరోతరగతి చదువుతున్న పిల్లవాడు ఉన్నాడా?"

"లేడు. మాకు అసలు పిల్లలు లేరు. ఏదో కూలి పని కోసం ఇక్కడకు వచ్చాం. కూలిపని ఉన్నప్పుడు తింటాం లేకపోతే లేదు"

"నిన్న ఉదయం సిరిపురం నుండి ఒక పెద్దామె కారులో వచ్చి మీ అబ్బాయిని వాళ్ళింటికి తీసుకు వెళ్ళిందిట కదా. ఎందుకు?"

అతను తడబడ్డాడు కొంచెం..

"అసలు మా ఇంట్లో అబ్బాయి లేడంటే మీరు ఏదేదో చెబుతున్నారు. నాకు అర్థం కావడంలేదు."

"అలాగా. అయితే అసలు విషయం పోలీసులకు చెబుదురు గానిలే. మీరు ఇద్దరూ ఆ అబ్బాయిని కిడ్నాప్ చేసి డ్రామాలు ఆడుతున్నారు. నేను సి.ఐ.డి ఆఫీసు నుండి వచ్చాను. నాకు ఉన్నది ఉన్నట్లుగా చెబితే భవిష్యత్తులో మీకు ఏ సమస్యా రాదు. అలా కాకుండా విషయాలు దాచి పెడితే మీరు ఇద్దరూ ముందు ముందు చాలా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అంటున్న అతని మాటలకు అడ్డువచ్చి...

"నేను అంతా నిజమే చెబుతున్నాను. మా తప్పులేనప్పుడు, పోలీసులు మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తారు? దయచేసి మీరు ఒక ఇంటికి వెళ్ళబోయి తప్పు దారి పట్టి మా ఇంటికి వచ్చి ఉంటారు" అన్నాడు.

శ్రీనివాసరావు తనతో అడ్డంగా బుకాయిస్తున్న అతని ముఖాన్ని పరిశీలనగా చూడసాగేడు. అతను మాట్లాడేటప్పుడు తన ముఖం వేపు చూసి మాట్లాడటంలేదు. తను ఒక గంట క్రితం ఈ ప్రాంతానికి వచ్చి ఇరుగు పొరుగులతో వాకబు చేశాడు. నిన్న ఒక కారులో ఒక పెద్దామె, మరో స్త్రీ ఇంకో పురుషుడూ వచ్చారనీ, వీళ్ళింట్లోంచి ఒక అబ్బాయిని తీసుకు వెళ్ళారనీ చెబుతున్నారు. వీడేమో ఏం లేదు, అసలు మాకు అబ్బాయే లేడని బుకయిస్తున్నాడు. అసలు వీడికి పిల్లలు ఉన్నరా లేరా? ఉన్నది ఒక్కడే అబ్బాయా? లేక ఈ దంపతులు ఇద్దరూ ఎక్కడి నుండైనా ఈ పిల్లవాడిని ఎత్తుకొచ్చారా? చాల విషయాలు విచారించవలసి ఉంది. అని శ్రీనివాసరావు ఆలోచించుకుంటూ ఉండగా.

ఇంతలో

లోపల నుండి అతని భార్యలా ఉంది బయటకు వచ్చింది.

"అయ్యా మాకు పిల్లాడు లేడు. వాడేమీ చదవడం లేదు. మీరు ఏం విన్నారో, ఎవరు ఏం చెప్పారో తెలియదు. మేము ఈ ఊరు బ్రతకడానికి వచ్చాం. ఒకరోజు తినీ, ఒకరోజు తినకా నానా తిప్పలూ పడుతూ బ్రతుకుతా ఉన్నాం. మమ్మల్ని బాధపెట్టకండి బాబూ మీకో దండం వెళ్ళిపోండి అంది కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ.

కళ్ళల్లో నీళ్ళు ఉన్నా లేకపోయినా తుడుచుకోడానికి ఆడాళ్ళకు చీర చెంగు సౌకర్యం బలేగా ఉంటుంది, నాటకమాడడానికి. నిజంగా ఏడుస్తున్నారో లేదో తెలుసుకోవడం అసాధ్యం.

"అమ్మా నేను మిమ్మల్ని బాధపెట్టడానికి రాలేదు. మీకు ఉపకారం చేద్దామని వచ్చాను. మీ ఇంట్లో ఇంతవరకూ ఉన్నపిల్లవాడిని, మీరు ఎక్కడి నుండో ఎత్తుకు వచ్చారనీ, మీరు అతనితో ఏదో వ్యాపారం చేస్తున్నారనీ చుట్టుప్రక్కల జనం అంటున్నారు. నేను అందరినీ కనుక్కున్నాను, మాట్లాడాను. వాళ్ళు అలా చెప్పారు. నిజం చెప్పండి" అన్నాడు శ్రీనివాసరావు.

ఆమె వెంటనే శ్రీనివాసరావు కేసి చూసి

"అయ్యా లోపలకు రండి" అని లోపలకు దారి ఇచ్చాడు.

ముందు గదిలో ఒక ఫైబర్ కుర్చీలో శ్రీనివాసరావు కూర్చున్నాడు. అతని ఎదురుగా భార్యా, భర్తా నిలబడి ఉన్నారు భయం భయంగా.

"అసలు విషయం చెప్పండి"

"మాకు ఒక్కగానొక్క కొడుకు ఆరవ తరగతి చదువుతున్నాడండి. ఉన్నపళంగా ఒక రోజున పిచ్చి పిచ్చిగా మాట్లాడసాగేడండి" అంటూ పద్మావతీదేవి తీసుకువెళ్ళే వరకూ జరిగిన విషయాలు చెప్పేడు.

"అది సరే. మీరు ఆ పెద్దామె ఏదో చెప్పగానే ఆమెను గుడ్డిగా నమ్మేసి మీ పిల్లాడిని ఆమె కూడా పంపించేశారే? ఆమె ఊరు సిరిపురం అనీ, ఆమె బాగా ధనవంతురాలనీ, ఏం నమ్మకం? ఒక కారు అద్దెకు తీసుకుని ఇద్దరు మనుషులను వెంటపెట్టుకుని ఎవరైనా రావచ్చును కదా?చాలా తప్పుపని చేశారు మీరిద్దరూ. అయినా మించి పోయింది లేదు. మీరు మీ అబ్బాయిని పంపిన ఊరు వెళ్ళి, వాళ్ళు అసలు నిజంగా ధనవంతులా కాదా అన్న విషయం పరిశీలన చేయాలి.

మీరు చూస్తే చాల బీదవారిలా ఉన్నారు. సిరిసంపదలు ఉన్నవారు మగపిల్లలు లేకపోతే ఇలా ముద్దుగా ఉన్న మీ అబ్బాయిలాంటి పిల్లవాడిని ఏదో వాళ్ళ విషయాలు మాట్లాడుతున్నాడనే వంకతో వాళ్ళతో తీసుకువెళ్ళిపోయి, వాడిని బాగా మచ్చిక చేసుకుని, వాళ్ళ దగ్గరే శాశ్వతంగా ఉంచేసుకుంటే మీరేం చేయగలరు?

ఆ తరువాత మీరే వాళ్ళ అబ్బాయిని కిడ్నాప్ చేశారని చెప్పినా ఎవరైనా చాల ఈజీగా వాళ్ళనే నమ్మేస్తారు. చాలా తప్పు చేశారు" అని మాట్లాడుతూ వాళ్ళ ముఖాలు పరిశీలనగా చూడసాగేడు.

భార్యాభర్తా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు, వాళ్ళ చూపుల్లో అనేక ప్రశ్నలూ జవాబులూ.

మొత్తానికి బలే వాళ్ళే వీళ్ళు ఇద్దరూ. అసలు పిల్లలే లేరు అన్నారు. ఆ తరువాత అసలు విషయం చెప్పారు. ఇప్పుడూ తమ పిల్లవాడిని తీసుకు వెళ్ళినామెను కూడా నమ్మలేం కదా అంటే భయపడి ఛస్తున్నారు. వాళ్ళ నిజ స్వరూపాలు ఇంకా బయటపడాల్సి ఉంది. వీళ్ళని బాగా ఫాలో అవడం మంచిది అనుకుంటున్నాడు శ్రీనివాసరావు.

"మీరు కొన్ని రోజులు పోయాక, మీ అబ్బాయిని తీసుకు వెళ్ళిన వాళ్ళు ఊరు వెళ్ళండి. అక్కడ విషయాలు బాగా పరిశీలన చెయ్యండి. మీ అబ్బాయి జాగ్రత్త"

"అయ్యా తమరు?" అన్నాడతను.

"నేను టెలివిజన్ కేంద్రం నుండి వచ్చాను. మీ అబ్బాయితో ఇంటర్వ్యూ తరువాత ఏం జరిగిందో తెలుసుకుని రమ్మని నన్ను పంపించారు మా వాళ్ళు. బయట జనాన్ని అడిగితే సిరిపురం నుండి ఒక పెద్దామె వచ్చి మీ అబ్బాయిని తీసుకు వెళ్ళిందని చెప్పారు. కానీ మీరేమో ముందు అసలు పిల్లలే లేరు అని డబాయించారు. ఆ తరువాత అసలు విషయం చెప్పరనుకోండి. మరి వెళ్తాను. మీ అబ్బాయి జాగ్రత్త. ఏదైనా సమస్య వస్తే మళ్ళీ టెలివిజన్ కేంద్రానికి వచ్చి చెప్పండి. మళ్ళీ ప్రసారం చేస్తాం" అన్నాడు శ్రీనివాసరావు. తను ఎవరో చెప్పడం వలన ఉపయోగం లేదు అందువలన అబద్దం చెప్పాడు. పైగా వీళ్ళు అసలు విషయాలు చెప్పరు. ఇక చూడాలి అసలు సంగతి, వెంకట్ నాయనమ్మ తనను సంప్రదించకుండా పిల్లవాడిని తన భవంతికి తీసుకువెళ్ళడం లాంటి కంగారు పనులు చెయ్యద్దని చెప్పినా వినలేదు.

ఆమెకు తన చనిపోయిన భర్త ఆ పిల్లవాడి రూపంలో జన్మించాడనే ఒక పిచ్చినమ్మకం కుదిరిపోయింది. తను ఆమెను చూసినప్పుడే అనుకున్నాడు. ఆమె తప్పకుండా ఈ పిల్లవాడిని తన ప్రమేయం లేకుండా తన భవంతికి తీసుకు వెళ్ళిపోతుందని అనుకున్నాడు. అచ్చంగా అలాగే జరిగింది. అనుకుంటూ శ్రీనివాసరావు బయట పడ్డాడు వాళ్ళ ఇంట్లోంచి.

కుటుంబ యజమాని బ్రతికున్నన్నాళ్ళూ అతను చెప్పే మాటలూ, సూచనలూ, సలహాలూ కుటుంబంలో అందరికీ చాలా చికాకుగా ఉంటాయి ఒక్కోసారి. మరీ ముఖ్యంగా అతి సన్నిహితంగా మెలిగే భార్యకు మరీనూ. కానీ అకస్మాత్తుగా ఆ కుటుంబ యజమాని చాలా కాలం పాటు దూరప్రాంతం వెళ్ళడం గాని, లేదా స్వర్గస్థుడవడం గాని జరిగిందనుకోండి అంతవరకూ అతను చెప్పిన మాటలూ, సూచనలూ, సలహాలూ వేదవాక్కులా అనిపిస్తాయి పైగా వాటిని పదే పదే నెమరువేసుకుంటూ ఉంటారు అందరూ. అయ్యో

ఎంత మంచి మాటలు, సమయోచితంగా సూచనలు ఎంత బాగా చెప్పేవాడు, ఎంతటి అమూల్యమైన సలహాలు ఇచ్చేవాడు ఏమిటో పిచ్చిదాన్ని నేను కూడా ఆయన మాటలు పెడచెవిన పెట్టాను. ఆయనకు ఇష్టమైన పదార్థాలు చేసిపెట్టమన్నా పట్టించుకునేదాన్ని కాదు. పాపిష్టిదాన్ని. అని బాధపడుతుంది. అలాగే నాన్నగారు ఎన్నో మంచిమాటలు చెప్పేవారు వినేవాళ్ళం కాదు. ఇప్పుడు చూడు మనకు ఏదైనా సమస్య ఎదురైతే పరిష్కారం చెప్పే నాథుడే లేడు అని కుటుంబ సభ్యులూ అనుకుంటారు. మనిషి బ్రతికుండగానూ, మనిషి కనుమరుగయ్యేక అతని బ్రతుకు చిత్రంలో ఎంత తేడానో?

ఈ బలహీనత మీద బాంబు పడింది పద్మావతీదేవిగారి జీవితంలో.

ఆమె ఈ సుడిగుండంలో చిక్కుకుంటుందా? లేక బయట పడుతుందా? ఏమో.

అనేకరకాల ఆలోచనలు చుట్టుముడుతుంటే, శ్రీనివాసరావు తాను తరువాత ఏం చేయాలో అని ఆలోచించుకుంటూ అమెరికాలోని వెంకట్‌కి ఫోన్ చేయడానికి జేబులోని సెల్ ఫోను తీసి రింగ్ చేశాడు.

''హలో''

''....''

''నమస్తే వెంకట్ గారూ, బిజీగా ఉన్నారా, ఒక్క నిమిషం మాట్లాడాలి''

''.............''

''మీరు చెప్పిన విషయంలో మీ నానమ్మగారి దగ్గరకు వెళ్ళి విషయాలు తెలుసుకున్నాను. మీ తాతగారిలా మాట్లాడే పిల్లవాడి విషయంలో ఆమె పూర్తిగా నిమగ్నమై పోయింది దాదాపు లీనమై పోయిందనుకోండి. ఆమె ఆ పిల్లవాడిని ఎప్పుడు చూద్దామా అనే ఆతృతలో ఉంది. మీ నానమ్మ గారికి కంగారుపడొద్దని చెప్పాను. అయిన ఆమె నా మాట వినదని అనుకుంటూండగా -

''............''

''కంగరు పడకండి. ఏం ప్రమాదం జరగలేదు. అయితే నేను పునర్జన్మ విషయాలు మాట్లాడే ఆ పిల్లవాడి దగ్గరకు వెళ్ళి వివరాలు సేకరించడానికి ఒక రోజు ఆలస్యంగా వెళ్ళాను. ఇంతలోనే మీ ఇంట్లో సీతమ్మనూ, సత్తెన్ననూ తీసుకుని ఆవిడ అక్కడికి వెళ్ళిపోయి ఆ పిల్లాడిని మీ కారులో మీ బంగళాకి తీసుకు వెళ్ళిపోయింది. ''

''............''

''ఏం ప్రమాదం లేదు. నేను మీ బంగళాకు వెళ్ళకుండా రహస్యంగా అక్కడ జరుగుతున్న విషయాలన్నీ తెలుసుకుంటాను. అవసరమైతే ఒక మనిషిని ఏదో రూపంలో మీ బంగళాకు పంపిస్తాను. ఏ మాత్రం హాని జరుగుతుందని అనుమానం వచ్చినా నేను వెంటనే సీన్‌లో ఎంటరైపోతాను. ఇప్పటికీ ఆ పిల్లవాడి తల్లీ తండ్రీ నివసించే ప్రాంతం, టెలివిజన్ కేంద్రం, మీ బంగళా ప్రాంతం అంతా నిఘాలో పెట్టాను. నాకైతే ఈ పునర్జన్మ విషయం పెద్దగా నమ్మకం లేదు అనుకోండి అయినా చూద్దాం''

''............''

''మీరు అనవసరంగా ఆందోళన పడవద్దు. అంతా నేను చూసుకుంటాను. మీ సిస్టర్‌కి చెప్పకండి. ఆమెను కూడా అనవసరంగా ఆందోళనకు గురి చెయ్యడం మంచిదికాదు. ఒక పది రోజుల్లో పిల్లవాడి విషయం నేను తేల్చేస్తాను. ఒకవేళ అబద్ధమైతే నేరస్తుడు ఏదో ఒక బలహీన క్షణంలో తప్పు చేసి దొరికిపోతాడు''

''.......:

''నాకు మీరు ఎంత ఫీజు ఇస్తారు? కోటి రూపాయలా? మీరూ మీ కుటుంబం మరీ ముఖ్యంగా మీ నానమ్మగారు నాకు అమూల్యమైన మనుషులు. సిల్లీగా మాట్లాడకండి. నేను ఇక్కడ మీ స్థానంలో మీ నానమ్మ గారికి సెక్యూరిటీగా ఉన్నాను సరేనా?''

"............"

"దెన్ ఓకే. మరలా మాట్లాడతాను"

అంటూ సెల్ ఆఫ్ చేసేశాడు.

అమెరికాలో పాపం అతను వాళ్ళ నానమ్మ ఏమైపోతుందో అనవసరంగా పరాయి మనిషిని తీసుకువెళ్ళి బంగళాలో పెట్టేసుకుందని ఆందోళన చెందుతున్నాడు. ఈమె కేమో తన భర్త పిల్లవాడి రూపంలో తిరిగి వచ్చేశాడు బలే బావుంది అనుకుంటూంది. తప్పితే అందులో నిజానిజాలు ప్రసక్తి ఆమెకు పట్టడం లేదు. కొన్ని రోజుల వరకూ తను బంగళాలోకి వెళ్ళడం గానీ, పద్మావతీదేవి గారికి కనపడడం గానీ చేయకూడదు. దూరంగా ఉండి పరిశోధన చేయడమే తన పని, అనుకుంటున్నాడు శ్రీనివాసరావు.

●●●

**మనుషులు చాలా చిత్రంగా ప్రవర్తిస్తుంటారు.** మనిషి బ్రతికున్నన్నాళ్ళూ పెద్దగా పట్టించుకోక పోయినా, మనిషి చనిపోయాక ఆ మనిషిపై విపరీతమైన అనురాగం, ప్రేమ, అనుబంధం, జ్ఞాపకాలు నెమరు వేసుకోవడం, ఆ మనిషి మంచి తనాన్ని పదే పదే తలుచుకోవడం చేస్తుంటారు. చిత్రమేమిటంటే ఆ మనిషి బ్రతికున్నన్నాళ్ళూ విపరీతంగా విమర్శించి, ద్వేషించిన వాళ్ళు కూడా మహా మెచ్చేసుకుంటూ ఉంటారు. బ్రతికుండగానూ, చనిపోయినా కూడా ఎప్పుడూ ప్రేమించే వాళ్ళ సంగతి సరేసరి అనుబంధం, ఆత్మీయత, ఆప్యాయతా, ఒక జబ్బు. ఈ జబ్బు ఒక దీర్ఘవ్యాధి లాంటిది. ఈ వ్యాధి బారిన పడిన వారు అంత త్వరగా కోలుకోలేరు. మరి అనుబంధం, ఆప్యాయత, ఆత్మీయత ప్రేమ, మమత, వదిలి ఉండలేకపోవడం, అనే అంశాలు మానవ జీవితంలో ప్రవేశించక పోతే అసలు మనిషికి మనుగడే లేదు. మనుషులందరూ వీటన్నింటికీ కట్టుబడి ఉంటారా?

పద్మావతీ దేవిగారు తన కారులో వెంట పెట్టుకుని తీసుకు వచ్చిన ఆ పిల్లవాడిని భవంతిలోకి ప్రవేశించగానే తను రోజూ కూర్చునే ఉయ్యాల బల్లలో కూర్చోపెట్టుకోవాలా? లేక తన ఎదురుగా సోఫాలో కూర్చోపెట్టుకోవాలా లేకపోతే తన భర్త స్థానం కాబట్టి అతనినే ఉయ్యాలలో కూర్చోమని తను అతని ఎదురుగా సోఫాలో కూర్చోవాలా అన్నది తేల్చుకోలేకపోతోంది .

కారు భవంతిని చేరింది.

గూర్ఖా సెల్యూట్ కొట్టి గేటు తెరిచాడు. కారు లోపలకు చేరగానే, పద్మావతీదేవి గారు సీతమ్మ వేపు చూసి కళ్ళతో సైగ చేసింది.

సీతమ్మ చకచకా కారు దిగి లోపలకు పరుగులాంటి నడకతో వెళ్ళింది. అందరూ కారులోనే ఉండిపోయారు. కారులో ఉన్న పిల్లవాడు వింతగా దిక్కులు చూస్తున్నాడు.

కొంతసేపటికి సీతమ్మ పళ్ళెంలో ఎఱ్ఱని నీళ్ళు, కర్పూరంతో తిరిగి వచ్చింది.

ఆమెను చూస్తూనే పద్మావతీదేవిగారు, ఆ పిల్లవాడు, సత్తెన్న కారు దిగారు.

సత్తెన్న పద్మావతీదేవి గారు పక్కకు జరిగి ఆ పిల్లవాడిని ఒక్కడినీ నిలబెట్టి..

"సీతమ్మా దిష్టి తియ్యి పిల్లాడికి" అంది.

సీతమ్మ పళ్ళెంలో కర్పూరం వెలిగించి, ఏదో అనుకుంటూ ఆ పిల్లవాడికి నఖశిఖ పర్యంతమూ మూడుసార్లు తిప్పి దిష్టి తీసింది. ఆ తరువాత ఎఱ్ఱని నీళ్ళలో మధ్య వేలు ముంచి వాడి నుదుట బొట్టు పెట్టి "పదండి లోపలకు" అంటూ దారి ఇచ్చి, పళ్ళెం పట్టుకుని గేటు పక్కన ఉన్న మొక్కల దగ్గరకు వెళ్ళింది.

ఆ పిల్లవాడు భవంతిలో ప్రవేశిస్తూనే చిరు నవ్వుతో..

"పద్దూ మొత్తానికి నీ పంతం నెగ్గించుకున్నావే. హాల్లో ఉయ్యాల బల్ల ఏర్పాటు చేసుకుని అందులో కూర్చుని, మెల్లిగా ఊగుతూ ఏదైనా చిరుతిండి తింటూ, టెలివిజన్ చూడాలి, ఎవరైనా పురాణాలు చదివి వినిపిస్తూంటే వినాలి అని అస్తమానూ అనేదానివి. కాని నేను ఉండగా పాత భవనంలో నీకు ఏమీ చేయలేకపోయాను. ఆ భవనం కూలగొట్టి, మంచి అధునాతన భవంతి మన అబ్బాయి కట్టిస్తాడని నేను ఎప్పుడూ అనుకునే వాడిని. అనుకున్నట్లే జరిగింది" అని అంటూంటే ఒక అపురూపమైన వస్తువును ఊహల్లో ఊహించుకుంటే, ఆ వస్తువు తన ఎదురుగా సాక్షాత్కారమైతే మనిషి ఎలా ఆబగా ఆసక్తిగా కళ్ళు ఇంతింత చేసుకుని చూస్తాడో అలా చూస్తూంది పద్మావతీ దేవి ఆ పిల్లవాడిని.

"అవును అస్తమనూ మిమ్మల్ని పోరేదాన్ని, మంచి భవనం కట్టుకుందామని. పరిస్థితులు కలిసి రాలేదు మనకి. మీరు చనిపోయాక మన అబ్బాయి మనం ఈ పాత బిల్డింగ్‌లో ఉండొద్దమ్మా కొత్తది కట్టుకుందాం అని రెండు అంతస్థులలో గొప్పగా కట్టించాడు ఈ భవంతిని. ఉండేది నేను ఒక్కదాన్నే కదురా అంటే అదేంటమ్మా మన కుటుంబం పెరుగుతుంది కదా, అప్పుడు మనందరికీ వసతి చాలదు తెలుసా? అనేవాడు.

అలాగే జరిగింది. ఆ తరువాత మనవడూ మనవరాలూ పుట్టేరు. వాళ్ళకు పిల్లలు కలిగారు. మన అబ్బాయికీ, కోడలికీ అనుభవించే యోగం లేకపోయింది. కానీ నేను మిగిలిపోయాను ఇవన్నీ చూడడానికి" అంటూ చీర కొంగుతో కళ్ళు తుడుచుకోసాగింది పద్మావతీదేవి.

ఇంతలో ఆ పిల్లవాడు వెళ్ళి ఉయ్యాల బల్లమీద కూర్చున్నాడు. పద్మావతీదేవి హతాశురాలైంది. ఇప్పుడేం చేయాలి? తాను ఎక్కడ కూర్చోవాలి?

"పద్దూ. ఎంత పెద్ద ఆయిల్ పెయింటింగ్ వేయించారు? నేనంటే ఎంత గౌరవం మీకు అందరికీ" అన్నాడు మెట్ల దగ్గర ఉన్న నిలువెత్తు ఆయిల్ పెయింటింగ్ చూస్తూ..

ఇంతలో లోపలనుండి సీతమ్మ ఒక ట్రేలో రెండు వెండి గ్లాసులలో పాలు పట్టుకు వచ్చింది.

ఉయ్యాల బల్లపై కూర్చుని ఉన్న ఆ పిల్లవాడిని చూసి..

"బాబూ ఈ సోఫాలో కూర్చో" అంది నెమ్మదిగా, పద్మావతీ దేవి వేపు చూస్తూ.. అతను వెంటనే లేచి ఉయ్యాల బల్ల ఎదురుగా ఉన్న సోఫాలలో కూర్చున్నాడు.

"బాబూ నీ పేరేమిటి?" అంది పాల గ్లాసు అతని చేతికి అందిస్తూ..

"నా పేరా మలయప్ప స్వామి " అంటూ సీతమ్మ చేతిలో పాలగ్లాసు అందుకుని ఆ పాల గ్లాసును పరిశీలనగా చూస్తూ.

"ఇది నేను ఎప్పుడూ పాలు తాగే గ్లాసు కదా నీకెలా గుర్తు ఉంది?" అన్నాడు

సీతమ్మా, పద్మావతీ దేవి అతన్ని ఆశ్చర్యంతో అతన్ని చూడసాగారు.

"అవును నా దేవుడు తాగే గ్లాసు ఇదే, మంచినీళ్ళు ఇచ్చినా, పాలు ఇచ్చినా ఎప్పుడూ ఈ గ్లాసులోనే ఇవ్వాలి. మర్చిపోయి వేరే గ్లాసులో ఇస్తే తాగేవారు కాదు" అనుకుంటూ వెళ్ళి ఉయ్యాల బల్లపై కూర్చుంది. ఆమె కళ్ళు తడి అవుతూనే ఉన్నాయి. ఈ పిల్లవాడు ప్రవేశించిన దగ్గర నుండీ.

"పద్దూ. మనం అనుకున్నట్లుగా ఆ శ్రీనివాసపురం అమ్మాయినే వివాహం చేశారా అబ్బాయికి? నేను ఎందుకో ఆ అమ్మాయిని చూడగానే మనవాడికి ఆ అమ్మాయి వలన శుభం జరగదేమో అనుకున్నాను అప్పుడు"

"అవును మీరు అనుకున్నట్లుగానే శుభం జరగలేదు. పైగా మనవాడు ఆ అమ్మాయే కావాలి చాలా అందంగా ఉంది ఆ అమ్మాయి కాకపోతే అసలు పెళ్ళే చేసుకోనని మారాం చేశాడు పైగా బాగా మోజు పడ్డాడు చాలా అందుకని.."

"అయినా విధి భగవానుని రాత ఎవరూ తప్పించుకోలేరు లే"

"అదికాదు. విదేశాలకు సరదాగా విహార యాత్ర అన్నాడు, అంతే కాకుండా ఏదో కొత్త రకం వ్యాపారం పెట్టాలి, విదేశాలలో బాగా విషయాలు పరిశీలించి వస్తానని కూడా అన్నాడు. నేను మంచి చూసుకుని ప్రయాణం నిర్ణయించుకోరా బాబూ అన్నాను. విమాన ప్రయాణం టిక్కట్లు మనం పెట్టుకున్న ముహూర్తాలకు దొరకవు అమ్మా అంటూ ఆదివారం అమావాస్య నాడు బయలుదేరాడు. అంతే విమానం బయలుదేరిన కొన్ని గంటలలోనే క్రాష్ అయ్యి ఇద్దరూ ఒకేసారి మాయమైపోయారు ఇల్లంతా చీకటి మయం చేసేశారు"

"బాధపడకు పద్మా. గుడ్డిలో మెల్ల అంటారు చూడు, వాళ్ళు వెళ్ళిపోతూ కనీసం మనవడినీ మనవరాలినీ నీ దగ్గర వదిలి వెళ్ళడం భగవత్సంకల్పం కాదూ. లేకపోతే అసలు మన వంశం గుర్తులు లేకుండా పోయేవి కదా" అన్నాడు.

"ఏదో మీ ఆశీర్వాదంతో మనవడినీ, మనవరాలినీ పెద్ద చదువులు చదివించాను, కానీ మళ్ళీ ఇద్దరూ నా దగ్గర ఉండకుండా అమెరికా ఎగిరిపోయారు. మనవడు వెంకట్‌కి ఒక్కడే కొడుకు, మనవరాలు పద్మకు ఒక అబ్బాయి, అమ్మాయి. అందరూ సుఖంగా ఉన్నారు. ఇలా కాలం వెళ్ళబుచ్చుకుంటూంటే, ఇంతలో మీరు మరలా వచ్చారు" అంటూ మళ్ళీ చీర చెంగుతో కళ్ళు తుడుచుకోసాగింది పద్మావతీ దేవి.

ఈ తతంగం అంతా చూస్తున్న సీతమ్మ.

"అమ్మగారూ. జరిగిన సంగతులేవో జరిగిపోయాయి. అస్తమానూ మీరు కళ్ళనీళ్ళు పెట్టుకోకండి. ఏదో అయ్యగారు ఈ పిల్లవాడి రూపంలో మళ్ళీ మనింటికి వచ్చారు కదా. ఇప్పుడైనా సంతోషంగా ఉండండి" అంది.

ఇంతలో సత్తెన్న వచ్చాడు..

"అమ్మగారూ. రాత్రి అయిపోయింది. ఇంక మీరు తిండీ తిప్పలూ తినే పనిలేదా ఏమిటి? ఎప్పుడో మనం మధ్యాహ్నం హోటల్‌లో తిన్న భోజనం, పిల్లాడు తన ఇంట్లో తిన్న తిండీ, లేవండి భోజనాలు చేసి విశ్రాంతి తీసుకోండి. మాట్లాడుకోవాల్సిన విషయాలు చాలా ఉంటాయి కదా. అబ్బాయి మనలో కలిసిపోతే మనం చేసుకోవాల్సిన పనులు చాలా ఉన్నాయి. అతన్ని స్కూలులో చేర్పించాలి, అన్నింటికన్నా ముందు అతనికి మంచి బట్టలు కుట్టించాలి. అన్నీ ఏర్పాట్లు చేయాలి మన హోదాకు తగ్గట్లుగా అతన్ని తీర్చిదిద్దాలి --" అంటున్న సత్తెన్నను ప్రశంసాపూర్వకంగా చూస్తూ పద్మావతీ దేవి--

"అలాంటి వన్నీ చూడడానికి నువ్వు ఉన్నావు కదా సత్తెన్నా. నీకు తెలియంది ఏముందీ. అవన్నీ వేగంగా చేయించేసెయ్. రేపటి నుండి అబ్బాయి స్కూలుకు కూడా వెళ్ళాలి" అంది.

"అమ్మగారూ, అయ్యగారు ఫోటో పెట్టి ఒక బెడ్ రూమ్ ఖాళీగా ఉంచాం కదా. ఆ గదిలోలోనే అబ్బాయి పడుకుంటాడు. ఏమంటారు అమ్మగారూ?" అంది సీతమ్మ.

"భేషుగ్గా ఉంది నీ ఐడియా. అలాగే అబ్బాయిని ఆ గదికి తీసుకువెళ్ళి అన్ని సౌకర్యాలూ చూడు భోజనం తరువాత" అంది పద్మావతీదెవి ప్రసన్నవదనంతో.

ఆ తరువాత తన భర్తకు భోజనంలో ఏ పదార్థాలు ఇష్టమో అవన్నీ చేయించింది పద్మావతీదేవి. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశారు.

తాను ఒక్కదాన్నే ఉండడం వలన ఏమీ తోచక ఇరవైనాలుగు గంటలలో పద్దెనిమిది గంటలు కళ్ళూ నోరూ తెరుచుకుని ఉండే టెలివిజన్ మూత పడింది. ఆ రోజు అసలు టెలివిజన్ పెట్టనే లేదు ఎవరూ ఆ భవంతిలో.

మనిషికి కష్టమైనపని చేస్తూంటే చాలా చిరాకుగా ఉంటుంది. కాలం గడవదు. అదే ఇష్టమైన పని చేస్తున్నా, ఇష్టమైన వారితో కాలక్షేపం చేస్తున్నా కాలం చాలా వేగంగా గడిచిపోతూంటుంది.

ఒక రోజు ఇద్దరూ తమ దాంపత్యం తొలిరోజుల్లో జరిగిన ఆసక్తికరమైన విషయాలు ముచ్చటించుకున్నారు. అలాగే తన భర్త కొన్ని సందర్భాలలో విచిత్రంగా ప్రవర్తించిన తీరు పద్మావతీ దేవి చెబుతూంటే ఆ పిల్లవాడు పడీపడీ నవ్వసాగేడు. ఆమె కూడా వళ్ళు తెలియకుండా శృతి కలిపింది అతని నవ్వులతో. కడుపు నిండా నవ్వుకుని ఎన్నాళ్ళయిందో అనుకుంది కూడా.

ఒక రోజున అబ్బాయికి జరిగిన పెళ్ళిచూపులు వగైరాలు, ఎంత మంది అమ్మాయిలను చూశారో, ఆయా పెళ్ళివారు ఎలా మర్యాదలు చేశారో, తాము ఆ పెళ్ళి చూపులకు ఎలా వెళ్ళారో అన్నది ముచ్చటించుకుంటూ నవ్వుకున్నారు సరదాగా..

ఇంకో రోజున ఒక్కగానొక్క కొడుక్కి అంతకు ముందే అనుకున్న సంబంధం నిశ్చయించి పెళ్ళిచెయ్యడం, ఆ పెళ్ళి తన భర్త లేకుండా ఎలా దిగ్విజయంగా చేసిందీ వివరంగా చెప్పడం...

ఒక రోజున పద్మావతీదేవికి ఎటువంటి చీరలంటే ఇష్టం, ఏ ఏ పదార్ధాలంటే ఇష్టం, కొన్ని సమయాలలో ఆమె ప్రవర్తన ఎలా ఉండేదో, పద్మావతీ దేవి లేకపోతే తాను ఎలా బ్రతకాలో అని బాధపడేవాణ్ణి అలాంటిది తనే భార్యను వదిలేసి అకస్మాత్తుగా దూరం అయిపోవడం చాలా చిత్రంగా ఉందనీ పిల్లవాడు విచారంగా వివరించడం, ఇద్దరూ చాలాసేపు అలా ఆవేదనతో మౌనంగా రోదించడం --

ఇంకో రోజున కొడుక్కీ, కోడలికీ ఇద్దరు పిల్లలు పుట్టిన వైనం, వాళ్ళు పుట్టినప్పుడు శుభకార్యాలు ఘనంగా చేసిన విధానం. అలా జరిగిన ప్రతి శుభకార్యం లోనూ తన భర్త ఫోటోకు ప్రధమంగా పూజ చేయించి తరువాత మాత్రమే శుభకార్యం జరిపించిన విధానం వివరంగా చెబుతూ...

ఒక రోజున తనకు ఏ పనీ చేయకుండా, తిని తిరిగడం కష్టంగా ఉందనీ, ఏదైనా మంచి వ్యాపారం చేస్తాననీ అబ్బాయి చెప్పడం, ఏం వ్యాపారం అని అడిగితే సాఫ్ట్వేర్ వ్యాపారం అయితే బాగుంటుందనీ, దాని కోసం విదేశాలకు వెళ్ళి మంచి ప్రాజెక్టులు అవీ పరిశీలించి ఆలస్యమైనా మంచి పరిశ్రమ స్థాపిస్తాననీ చెప్పడం..

ఆ తరువాత తన మాట వినకుండా ఎయిర్ టిక్కట్స్ ఆ రోజే దొరికాయనీ కంగారు కంగారుగా ఆదివారం అమావాస్య నాడు బయలుదేరడమూ, ఆ తరువాత బయలు దేరిన కొన్నిగంటలలోనే ఎయిర్ క్రాష్ అయి విమానంలో అందరూ చనిపోవడం జరిగిన సంఘటన చెబుతూ..

విదేశాలకు మనవడూ మనవరాలు బయలు దేరుతుంటే, "బాబూ నేను ఒక్కదాన్నే ఉండలేను పిల్లల్ని ఇద్దరి నీ నా దగ్గర వదిలి వెళ్ళండి, మీరు వచ్చేవరకూ వాళ్ళతో ఆడుకుంటూ కాలక్షేపం చేస్తాన"ని అనడంతో అతి కష్టం మీద వాళ్ళిద్దర్నీ వదిలి వెళ్ళడం వలన, వంశంలో ఇద్దరు పిల్లలు మిగిలారనీ, కీడులో మేలులాగా భగవంతుడు ఈ రకంగా తనకు సహాయం చేశాడని కన్నీటితో చెప్పడం.

ఇలా రోజులు చాలా వేగంగా గడిచిపోతున్నాయి, పిల్లవాడేమో స్కూలుకు వెళ్తున్నాడు.

ఒక రోజున--

ఉదయాన్నే సీతమ్మ వచ్చి--

"అమ్మగారూ, అబ్బాయి వచ్చాక మీరు పూజ చేసుకోవడం మానేశారు. రాత్రి పొద్దుపోయేవరకూ కబుర్లు చెప్పుకోవడం, ఎప్పుడో పడుకుని లేటుగా నిద్రలేస్తున్నారు. తమరు ఎప్పటిలాగానే పూజ చేసుకోవాలి అమ్మగారూ. మీ పూజల ఫలితంగానే అబ్బాయి రూపంలో మీకు అయ్యగారు తిరిగి వచ్చారు కదా" అంది.

పద్మావతీదేవి ఒక్క క్షణం ఆలోచించింది.

"నిజమేనే సీతమ్మ తల్లీ. అప్పుడే పదిరోజులు గడిచిపోయాయి. పది క్షణాలు లాగా ఉంది నా బ్రతుకులో. రేపటి నుండి పూజ మామూలుగా చేసేసుకుంటా. నన్ను ఉదయాన్నే నిద్రలేపి, నువ్వు మామూలుగా నాకు పూజగదిలో ఎప్పటిలాగే ఏర్పాట్లు చెయ్యాలి తెలిసిందా?" అంది.

అందుకు సీతమ్మ--

"ఇవాళ భగవద్గీత చదువుతానమ్మా. గీతా పఠనంతో మరల మీరు రోజువారీ కార్యక్రమాలు మళ్ళీ మొదలు పెడదాం. ఎప్పుడూ ఆ అబ్బాయి గురించి కబుర్లూ అతన్ని స్కూలుకు పంపడం ఏర్పాట్లు, పగలంతా అయ్యగారి గురించి ఆలోచనలూ, కబుర్లూ ఇదే సరిపోతా ఉంది. ఈ ప్రపంచంలోకి రావాలి. మమ్మల్ని కాస్త పట్టించుకోండి. కుటుంబ వ్యవహారాలు కాస్తంత పట్టించుకోవాలి" అంటున్న సీతమ్మతో.

"చూడవే సీతమ్మ తల్లీ, నువ్వు చెబుతున్న వన్నీ నిజమే. నేను మళ్ళీ మామూలు దినసరి కార్యక్రమాలు, నా కుటుంబ వ్యవహారాలు చూసుకోవాలి. ఇవాళ భగవద్గీత వద్దులే, వాడు లేస్తాడు వాడిని చూడాలి. రేపటి నుండి నేను అన్ని కార్యక్రమాలు మామూలుగా జరిగేట్లుగా ప్లాన్ చేసుకుంటాను.." అంది పద్మావతీదేవి.

దేవుడికి కూడా ఒక్కోసారి మనుషులంటే చాలా కోపం వస్తుంది. ఎందుకంటే మనిషి జీవితంలో అన్నీ సవ్యంగా సుఖంగా, సంతోషంగా జరిగిపోతూంటే అసలు దైవాన్ని తలుచుకోరు. ఆధ్యాత్మిక చింతన కూడా చేయరు. కానీ ఏదైనా అనుకోని ఆపద వస్తే మాత్రం ముక్కోటి దేవతలనీ ప్రార్థిస్తారు. ఆ సమయంలో కొత్త దేవుడెవరైనా త్వరితంగా కోరికలు తీర్చేవాడు ఉంటే ఆ దైవాన్నికూడా చాలా తీవ్రంగా ప్రార్థిస్తారు. సర్వస్వం అర్పించుకుంటాం స్వామీ అంటూంటారు. ఇలా అంటే మనిషి ఇంకో ప్రశ్న వేస్తూంటాడు చాలా తెలివిగా.

మరి అస్సలు దేవుడే లేడు అని అసలు ఏ దేవుణ్ణీ స్మరించకుండా చాలా మంది హాయిగా బ్రతికేస్తున్నారు కదా మరి వాళ్ళ సంగతి ఏమిటి? వాళ్ళని ఏ దేముడు అనుక్షణం కాపాడుతున్నాడు? అవును నిజమే

అయితే ఇక్కడో లాజిక్ ఉంది.

ఏ దేవుణ్ణీ స్మరించకుండా, హాయిగా బ్రతికేస్తున్న వాళ్ళని, దైవం ఎప్పుడూ కాపాడుతాడనీ, కొందరు అంటుంటారు. ఎందుకంటే వాళ్ళు అజ్ఞానులు. వాళ్ళను నేనే అనుక్షణం కాపాడాలని, దైవం అనుకుంటాడని కొద్మరు ముముక్షువులు అంటూ ఉంటారు. ఇదీ బాగానే ఉంది.

అందుకని ఎప్పుడూ దైవ నామస్మరణ చేసేవాళ్ళు మానేయకూడదు. ఏ దేవుడూ మనల్ని కాపాడడు, మనం ఎవరికీ అపకారం చేయకుండా బ్రతికితే చాలు అనే నమ్మకం ఉండాలి. అలా అని దైవాన్ని స్మరించకుండా ఉండనూ కూడదు.

ప్రస్తుతం పద్మావతీదేవి మనసు అటూ ఇటూ ఊగుతూ ఉంది.

●●●

**ఇహైవ తైర్జిత స్మర్గో యేషాం సామ్యే స్థితిం మనః**
**నిర్దోషం హి సమ బ్రహ్మ, తస్మా బ్రహ్మణితే స్థితాః**

ఎవరి మనస్సు నిశ్చలముగా నిర్మలంగా ఉండునో అట్టివారు, ఈ లోకమందే జనన మరణములను జయించిన వారు లేక జీవన్ముక్తులు. పరబ్రహ్మస్థితి దోషరహితమైనది. కావున దోషరహితముగా మనస్సు గల వారు ప్రబ్రహ్మస్థితి యందున్నవారే.

కామవాసనలే దోషము. ఇచ్చట కామము అనగా కోరిక యని అర్థం. ఇదది పోవుటయే నిర్దోషము. దోషము ఉన్నంత వరకూ మనశ్చాంచల్యము తప్పదు. నిర్దోషమగు మనస్సు స్థిరముగా ఉండును. స్థిరముగా యున్న మనస్సు గలవారే స్థిత ప్రజ్ఞులు, పరబ్రహ్మస్థితి యందున్న వారే జీవన్ముక్తులు.

మరుసటి రోజు యధావిధిగా పద్మావతీదేవి గారి పూజ తరువాత సీతమ్మ భగవద్గీత చదువుతూంది.

"అమ్మగారూ, కోరికలు లేనివారు అసలు ఈ భూప్రపంచకంలో ఉంటారంటారా?" అంది సీతమ్మ.

"పిచ్చిదానా మనిషి అంటేనే కోరికల పుట్ట. మనిషి పుట్టేక కొంచెం మాటలు వచ్చేవరకూ దేవునితో సమానం, కొంచెం మాటలు, మరికొంత జ్ఞానం రావడం మొదలయ్యాక "నాది" అనే మాట బయలుదేరుతుంది. అప్పటి నుండీ అతని పాపాలు, శాపాలు, మొదలవుతాయి. తనకు కావాల్సింది ఇవ్వకపోతే ఏడ్వడం మొదలు పెడతాడు. అయితే అస్సలు కోరికలు లేకుండా మనిషి మనుగడ చాలా కష్టం అనుకో" అంటున్న పద్మావతీదేవితో..

"అమ్మగారూ మనిషి స్థితప్రజ్ఞుడు కావాలంటే చాలా కష్టం అన్నారు"

"ఆనందం - దుఃఖం, ప్రేమ - ద్వేషం, ఆదరణ - నిరాదరణ, గౌరవం - అగౌరవం లాంటి వాటిలో దేనికీ ప్రాధాన్యత నివ్వకుండా తయారవ్వాలి, దీన్నే ఆధ్యాత్మిక భాషలో స్థితప్రజ్ఞత అంటారు అప్పుడే భగవత్స్వరూపం మీద పూర్తి విశ్వాసం కలుగుతుంది. అదే విమోచన జ్ఞానం. ఈ స్థితిలో ప్రార్థన కాంక్షారహితంగా ఉంటుంది" అని ఒక జ్ఞాని అన్నారు ఎక్కడో చదివాను.

అందువలన మనం చేసే పుజలూ, చదివే ఆధ్యాత్మిక గ్రంధలూ, కోరికలతో పూర్తిగా నిండిపోయిన మనస్సును ఆ వేపుకు చేరనివ్వవు. అలాగని మనం ఏమీ చెయకుండా ఉండలేము, ఉండకూడదు కూడా.." అంటున్న సీతమ్మతో.

"మంచి మాట చెప్పావే సీతమ్మ తల్లీ. నేను నువ్వు చెప్పే స్థితికి చేరుకోవాలంటే ఎన్ని సంవత్సరాలు పడుతుందో, లేక ఈ జన్మ సరిపోతుందో లేదో.." అంటూ నిట్టూర్చింది పద్మావతీదేవిగారు.

ఇంతలో..

గూర్ఖా వచ్చి సెల్యూట్ చేసి..

"అమ్మగారు. మనింటికి కొత్తగా వచ్చిన కుర్రోడి అమ్మా నాన్నలంట వచ్చారు గేటుకాడ నిలబెట్టా. తోలుకు రమ్మంటారా?" అన్నాడు.

పద్మావతీదేవి గూర్ఖా మాటలతో ఈ ప్రపంచంలోకి వచ్చింది.

పద్మావతీదేవి వెంటనే సీతమ్మ వేపు చూసింది. "రానివ్వండి" అన్నట్లుగా సైగ చేసింది సీతమ్మ.

"వాళ్ళని లోపలకు నా దగ్గరకే తీసుకునిరా ఇంకెక్కడికీ వెళ్ళనివ్వకు" అంది పద్మావతీదేవిగారు.

గూర్ఖా వెళ్ళిపోయాడు.

"అదేంటమ్మగారూ. పదిరోజులకే వాళ్ళ అబ్బాయిని చూడడానికి వచ్చేశారు అప్పుడే అబ్బాయిని చూడటానికి వచ్చారో, లేక డబ్బు కోసం వచ్చారో, ఏది ఏమైనా ఈ అలగా జనంతో మనం సంబంధాలు పెట్టుకోకూడదమ్మగారూ.." అంది సీతమ్మ.

"అవును నిజమేనే. కానీ మరి వాళ్ళ పిల్లాడి వలన మనకు మనశ్శాంతి, ఊరట కలుగుతున్నాయి కదా. అందువలన ఒక సుఖం వెనకాలే ఒక దుఃఖం పొంచి ఉన్నట్లుగా అబ్బాయి మనింట్లో ఉండడం వలన కలిగే ఆనందం వెనుక వీళ్ళ పోరు ఉండి తీరుతుంది. తప్పదు కదా. మా ఇంటికి మీరు తరచూ రావద్దు అని మనం అన్నామే అనుకో మా అబ్బాయిని తీసుకువెళ్ళిపోతాం అని అంటారు అందుకని ఆ మాట అనలేం కదా" అని పద్మావతీదేవి అంటూ ఉండగానే హాలులోకి ఒక స్త్రీ, పురుషుడూ ప్రవేశించారు. పిల్లవాడిని వాళ్ళ ఇంటినుండి తీసుకురావడానికి వెళ్ళినప్పటికన్నా వాళ్ళ రూపాలలో చాలా తేడా ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

అతను మంచి ఉలెన్ ప్యాంటు, చెక్స్ షర్టు వేసుకున్నాడు. చక్కగా క్రాపు చేయించుకున్నాడు. చేతిలో సెల్ ఫోను ఉంది, కళ్ళకు రేబాన్ సన్ గ్లాసెస్ ఉన్నాయి.

ఆమె కూడా పోలియెస్టర్ చీర కట్టింది. చక్కగా తల దువ్వుకుని జడవేసుకుంది ముఖానికి మేకప్ చేసుకున్నట్లుగా మెరిసిపోతూంది. చేతిలో చిన్న హేండ్‌బాగ్ ఉంది. కొంచెం అలంకరన చేసుకున్నట్లుగా ఆకర్షణీయంగా ఉంది.

పోనీలే వాళ్ళు బాగుండాలి, లేకపోతే ఏ లోటు జరిగినా తన దగ్గర ఉన్న పిల్లవాడిని తీసుకుని వెళ్ళిపోతామంటారు అనుకుంది పద్మావతీదేవి.

వాళ్ళు ఇద్దరూ హాలులోకి వస్తూనే, హాలులో ఉన్న అతి ఖరీదైన వస్తువులనూ, పైన సీలింగ్‌కి వేలాడుతున్న అతి ఖరీదైన షాండ్లియర్‌నీ, మెట్ల వద్ద నున్న గోవిందరాజులుగారి నిలువెత్తు ఆయిల్ పెయింటింగునూ, ఇంతింత కళ్ళేసుకుని, ప్రపంచంలో ఏడో వింతని చుస్తున్నారు.

పద్మావతీదేవి కూర్చున్న ఉయ్యాల బల్లను కూడా నిశితంగా పరిశీలించసాగారు. వాళ్ళ కళ్ళల్లో హాలులోఉన్న మొత్తం సామానంతా ఎంత ఖరీదు ఉంటుందో అనే ప్రశ్న కనిపిస్తూంది.

వాళ్ళిద్దరూ పద్మావతీదేవి గారి దగ్గరకు వస్తూనే ఆమె కాళ్ళకు నమస్కరించారు.

"అమ్మగారూ మా పిల్లోడు ఎలా ఉన్నాడు? తమర్ని ఇబ్బంది పెట్టడం లేదు కదా?" అన్నది తల్లి.

"అదేంటమ్మా! ఇబ్బంది పెదితే మర్నాడే మీ దగ్గరకు పంపించేసే వాళ్ళం కదూ" అంది సీతమ్మ.

"స్కూలుకు వెళ్ళాడు. మధ్యాహ్నం భోజనానికి తీసుకురావడానికి కారు వెళ్ళింది. వస్తాడు కూర్చోండి" అంటూ తన ఎదురుగా ఉన్న సోఫాలు చూపించింది పద్మావతీదేవి.

సీతమ్మ వేపు చూసి ఏదో సైగ చేసిందామె.

ఆమె వెంటనే లోపలకు వెళ్ళింది.

వాళ్ళిద్దరూ పద్మావతీదేవి కూర్చున్న ఉయ్యాల బల్ల, భవంతి క్రింద ఉన్న ఖరీదైన తలుపులతో ఉన్న గదులూ, రెండుగా చీలి ఉన్న మేడమెట్లూ, మెట్లకు ఉన్న వెండి రంగులో ధగధగా మెరిసిపోతున్న రెయిలింగూ, మెట్లు రెండూ కలిసే దారిలో నిలువెత్తు పెయింటింగూ, పద్మావతీదేవి ఎదురుగా గోడకు అమర్చి ఉన్న తాము ఇంతవరకూ చూడని అతిపెద్ద టెలివిజనూ, మేడపైన ఉన్న గదులూ అన్నీ వింతగా పరిశీలనగా చూడసాగేరు.

సీతమ్మ ట్రేలో రెండు వెండి గ్లాసులలో పాలు తీసుకువచ్చి

"ఇదిగో పాలు తాగండి. మీ పిల్లాడు వచ్చేక చూసి వెళ్దురు గాని" అంది. అంటే వీళ్ళు ఇక్కడ తిష్ట వెయ్యకుండా పిల్లాడిని చూసి వెళ్ళిపొమ్మని సూచన ఇచ్చింది సీతమ్మ పద్మావతీ దేవిగారి తరపున.

"అలాగేనమ్మా మేం ఉండిపోదామని రాలేదు. ఒక్కసారి వాడిని చూసి వెళ్ళిపోతాం" అంది తల్లి.

"మీరు ఇక్కడ ఉండిపోడానికి మాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు, కానీ మీరు ఇక్కడే ఉంటే, మీ అబ్బాయి నాతో ఏం మాట్లాడుతాడు? అందుకని?" అంది పద్మావతీదేవి.

ఇంతలో..

"పద్దూ ఎవరు వచ్చారు?" అంటూ వచ్చాడు మలయప్పస్వామి.

ఖరీదైన డ్రెస్ వేసుకున్నాడు. బూట్లు, మెడలో టై, మంచి కూలింగ్ గ్లాసెస్, వంట నుండి మంచి పెర్‌ఫ్యూమ్ వాసన వస్తూంది. వాడిని చుడగానే తల్లీ తండ్రీ ఆశ్చర్యపోయారు.

"ఏరా నాన్నా. మమ్మల్ని అప్పుడే మర్చిపోయావురా?" అంటూ తల్లి చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ అతని దగ్గరకు వెళ్ళింది.

"ఎలా మర్చిపోతాను? ఇక్కడ నా పద్మావతీ దేవి నన్ను కంటికి రెప్పలా కాపాడుతూంటే, నాకు పదిరోజులు పది క్షణాలుగా గడిచిపోయాయి అనుకో" అంటున్నాడు వాడు.

"గోవిందా. మీ అమ్మా నాన్నకు మన భవంతి అంతా చూపించు. నీ గదికి తీసుకువెళ్ళు అంది పద్మావతీదేవి. అతన్ని గోవిందా అని పిలవడం మొదలుపెట్టింది అతను తన భవంతికి వచ్చినప్పటినుండీ.

ముందు గోవింద, ఆ వెనుక తల్లీ తండ్రీ వాళ్ళుకూడా సీతమ్మా బయలుదేరారు బంగళా చూడడానికి.

మేడక్రింది భాగంలో రెండు బెడ్ రూములూ, అతిథుల గదీ, పెద్ద వంటిల్లూ, పక్కనే పెద్ద డైనింగ్ హాలూ అక్కడ ఉన్న పెద్ద డైనింగ్ టేబులూ ఖరీదైన కుర్చీలూ, పూజగదీ చూశారు. తరువాత మెట్ల మీదుగా పైకి వెళ్ళారు. పైన ఒక బెడ్ రూమూ, ఒక అతిథుల గదీ, పెద్ద డైనింగ్ హాలూ, అప్పుడప్పుడు ఉపయోగించే వంటగదీ, చూపించి, తరువాత గోవిందరాజులు గారి కోసం ప్రత్యేకించి ఉంచిన బెడ్ రూములోకి ప్రవేశిస్తూ..

"నన్ను ఈ గదిలోనే ఉండమన్నారు. ఈ గది గోవిందరాజులు గారి కోసం ఉంచేశారు. అదిగో గంధపు మాలతో అలంకరించబడిన ఆయన ఫోటో" అని చూపిస్తూ.

"సీతమ్మా మా అమ్మా నాన్నలతో కొంచెం మాట్లాడుకుంటాను. నువ్వేమీ అనుకోకు. మా వాళ్ళకు ఏదైనా చేసిపెట్టమని కిచెన్‌లో చెపు" అని సీతమ్మ బయటకు వెళ్ళాక తలుపులు మూసేశాడు గోవింద.

తలుపులు మూసుకుని మాట్లాడే విషయాలు ఏమిటి ఉంటాయి అసలు రహస్యాలు ఏమున్నాయి వీళ్ళు మాట్లాడుకోడానికి అని అనుకుంది సీతమ్మ. సీతమ్మకు అనుమానం ఎక్కువ అందుకని చాలా వేగంగా కిచెన్‌కి వెళ్ళి వాళ్ళిద్దరికీ ఏదైనా టిఫిన్ చెయ్యమని పరుగులాంటి నడకతో మళ్ళీ వచ్చేసి తలుపు దగ్గరే నిలబడింది.

"ఇంకో రెండు రోజులు ఓపిక పట్టండి. అమ్మగారు పూర్తిగా నా మత్తులో పడిపోయింది. ఇక నేడో రేపో నాకు ఆస్తి రాసేస్తానంటుంది కూడా. మాటకు విషయాలు చెప్పండి. మీరు ఏ మాత్రం అనుమానం రాకుండా వెళ్ళిపోండి. కావాలంటే అమ్మగారి దగ్గర డబ్బు తీసుకుని వెళ్ళండి. ఆ తరువాత ఖజానా మనదే కదా" అంటూ గుమ్మం బయటకు వస్తూ మాట్లడుతూ గుమ్మం దగ్గరే ఉన్న సీతమ్మను చూసి హతాశుడయ్యాడు గోవింద.

ఏమిటీ సంభాషణ? ఏదో జరుగరానిది జరుగుతోంది ఈ బంగళాలో. పద్మావతమ్మ నేను ఏం చెప్పినా వినే స్థితిలో లేదు. అయినా తను మాత్రం అనుక్షణం ఆమెను కనిపెట్టుకునే ఉండాలి అనుకుంది సీతమ్మ.

వాళ్ళను భవంతిలో కిందన ఉన్న డైనింగ్ టేబుల్ దగ్గరకు తీసుకువెళ్ళి భోజనంలాంటి టిఫిన్ పెట్టించింది. డైనింగ్ టేబుల్ మీద ఉన్న వెండి సామాన్లు చూసి బైర్లుకమ్మాయి ఇద్దరికీ. ఒక పెద్ద వెండి బౌల్‌లో యాపిల్స్, ద్రాక్ష, చక్కరకేళి, పైనాపిల్స్ వగైరాలు చూస్తూంటే వాళ్ళకి సినిమా చూస్తున్నట్లుగా ఉంది.

డైనింగ్ టేబుల్ నుంచి ఆ తరువాత, పద్మావతీదేవి దగ్గరకు వచ్చారు అందరూ.

"పద్మా. మా అమ్మా నాన్నలకు మంచి ఆతిథ్యం ఇప్పించావు, ఏది ఏమైనా నీకు ఋణపడి పోతున్నాననుకో నేను" అన్నాడు గోవింద.

"అదేంటయ్యా ఈ సంపద అంతానీదికాదూ. నేను ఆతిథ్యం ఇప్పించడమేమిటి? ఏమీ కాదు నువ్వే వాళ్ళకు ఇచ్చావు" అంటున్న ఆమెను చూసి, మరలా తల్లితండ్రులవేపు చూసి, కళ్ళతో "చూశావా నా తడాఖా?" అన్నట్లుగా చూస్తున్నాడు.

"అమ్మగారూ.." అంటూ చేతులు నలుపుకుంటున్నారు గోవిదం తల్లితండ్రులు. వెంతనే సీతమ్మ వేపు చూసింది పద్మావతీదేవి.

సీతమ్మ లోపలకు వెళ్ళి కొంత డబ్బు తీసుకువచ్చి అతని చేతిలో పెట్టింది.

వాళ్ళు మళ్ళీ పద్మావతీదేవి కాళ్ళకు నమస్కరించి.

"అమ్మగారూ మావోడు జ(గత్త. ఒక్కగానొక్క కొడుకు. మిమ్మల్ని నమ్మి మీ కూడా పంపేసి ఇక్కడే వదిలేశాం" అంటూ ఇద్దరూ బయటకు వెళ్ళిపోయారు.

హాలులోనే ఉయ్యాల బల్లపై పద్మావతీదేవి, ఎదురుగా గోవిందు కూర్చుని ఉన్నారు.

"పద్మూ. నేను ఎవరైనా దాన ధర్మాల కోసం వస్తే విద్యార్థులను కూడా అడుగుతుంటారు. నా దగ్గర అస్సలు ఒక రూపాయి కూడా లేకుండా అయిపోతూంది. అందుకని నా చేతిలో ఎప్పుడూ ఒక ఐదొందల రూపాయలు ఉండాలి ఏమంటావ్? లేకపోతే మన పరువు పోదూ? పైగా నా మిత్రులందరూ చూడరా నువ్వు కారులో వస్తావు, కారులో వెళతావు మాకందరికీ ఐస్ క్రీమ్స్ కొనిపెట్టమంటే డబ్బులు లేవంటావ్ అంటున్నారు" అంటున్నాడు బుంగమూతితో గోవిందు.

వెంటనే పద్మావతీదేవి "ఇలారండి. ఎవరు కాదన్నారు? మిమ్మల్ని డబ్బులేదని ఎవరన్నారు. సీతమ్మతో చెప్పి రోజూ ఐదువందలు తీసుకోండి బాగా ఖర్చుపెట్టుకోండి. మీ స్నేహితులు ఏది అడిగినా కొనివ్వండి మన హోదాకు తగ్గనియ్యకండి" అంది.

ఒకోసారి అండీ అంటుంది. మరోసారి బాబూ అంటుంది, ఇంకోసారి గోవిందా అంటుంది పద్మావతీదేవి ఆ పిల్లవాడిని.

ఆమె మాటలు విని ఆశ్చర్యపోతూంది సీతమ్మ ఎదురుగా కూర్చుని.

"సీతమ్మా గోవిందుకు రేపటినుండి ఎంత డబ్బుకావలంటే అంత ఇవ్వు. నన్ను అడగనక్కరలేదు తెలిసిందా?" అంది పద్మావతీదేవి.

"అలా వద్దు పద్మూ. నేను తీసుకున్న డబ్బుకు లెక్కలు చెబుతాను. అనవసరంగా వృధా ఖర్చు చేయకూడదు కదా" అంటున్న అతని మాటలకు అడ్డు వచ్చి

"గోవిందా. ఈ ఆస్తి, ఈ సిరిసంపదలూ, ఈ డబ్బూ అంతా నీ సంపాదనే. నేను సాధ్యమైనమంత త్వరలో ఇదంతా నీకు అప్పచెప్పి మాత దగ్గరకు వెళ్ళిపోతాను. నిన్ను మరలా చూసి, నీతో గడిపే అవకాశం దేవుడు నాకు ఇచ్చాడు, అదే పదివేలు.." అంటున్న పద్మావతీ దేవితో సీతమ్మ.

"అదేమిటమ్మగారూ. చాలా సంవత్సరాలకు అయ్యగారు ఈ రూపంలో మనింటికి వచ్చారు. మీరు ఎక్కడికీ వెళ్ళకండి. ఈ అబ్బాయిని పెద్ద చేసి బాగా చదివించి, మంచి స్థితిలో ఉంచే భాధ్యత మీమీద ఉంది కదా! ఎక్కడి కెళ్తారు?" అంది.

"అవును నిజమేనే సీతమ్మ తల్లీ. నేను మాత దగ్గరకు వెళితే వీడి బాగోగులు ఎవరు చూస్తారు? మా బాగా చెప్పావు" అంది పద్మావతీదేవి.

పద్మావతీదేవి ఉయ్యాల బల్ల ఎదురుగా దగ్గరగా సోఫాలో కూర్చుని ఉన్నాడు గోవింద. ఆమె అతనికి వేయించిన జీడిపప్పులు వెండి పళ్ళెంలో పెట్టి అందిస్తూంది.

సీతమ్మ వాళ్ళిద్దరి (ప్రవర్తనా చూస్తూ, అమ్మగారు వీడి మాయలో పడిపోయారు, ఏమయిపోతుందో ఏమో, ఆ మధ్యన అమెరికా నుండి మనవడు వెంకట్ గారు నియమించిన మనిషి వచ్చాడు, మళ్ళీ రాలేదు. ఎందుకనో? అతనికి బంగళాలో జరుగుతున్న సంగతులు చెబితే మంచిదేమో? ఆడది తను ఏం చేయగలదు? ఏది ఏమైనా సత్తెన్న కూడా పిల్లవాడిని బాగా దగ్గర ఉండి గమనిస్తూనే ఉన్నాడు కదా? అనుకుంటూంది.

ఇంతలో.

తెల్లని సఫారీ డ్రెస్ వేసుకున్న అరవై సంవత్సరాల వయసు ఉన్నఒకాయన వచ్చి పద్మావతీదేవి గారి ఎదురుగా నిలబడి.

"అమ్మా నమస్కారం. నా పేరు రాజశేఖరం. అయ్యగారు నన్ను రాజూ అని పిలిచేవారు. వారు మా కుటుంబానికి మహోపకారం చేశారు. నిన్న మీ బంగళా మీదుగా వెళుతుంటే గూర్ఖా విషయం చెప్పాడు. వెంటనే మీ వద్దకు వచ్చి పిల్లవాడి రూపంలో వచ్చిన అయ్యగారిని చూడాలనుకున్నాను. కానీ ఈ రోజుకు వీలు పడింది" అంటున్న అతన్ని గోవింద కోపంగా చూడసాగేడు.

"ఓహో. రాజశేఖరానివా? ఆయనతో కూర్చుని ఎప్పుడూ పిచ్చాపాటీ మాట్లాడేవాడివి కదూ.

అవును నిజమే. ఇదిగో ఈ పిల్లవాడే గోవింద అని ముద్దుగా పిలుస్తున్నాను నేను, మీ స్నేహితులు మరలా ఈతని రూపంలో జన్మించారు. మనం సినిమాల్లో, నవలల్లో, కథల్లో విన్నాం చదివాం, చూశాం. కానీ నా జీవితంలో నిజంగా జరిగింది" అంటూన్న పద్మావతీదేవిని, ఆ పిల్లవాడినీ మార్చి మార్చి చూడసాగాడు రాజశేఖరం.

"అమ్మా ఈ పిల్లవాడిని ఎక్కడినుండి ఎలా తీసుకువచ్చారు? మీకు మీ శ్రీవారు ఈ పిల్లవాని రూపంలో జన్మించారని స్థిరనిర్ణయానికి ఎలా వచ్చారు? ఇతన్ని ఏ విషయంలోనైనా ప్రశ్నించరా?" అన్నాడు రాజశేఖరం.

"ఆ విషయాలన్నీ నా పద్దూ నేనూ చూసుకుంటాం. మీకు అనవసరం. నన్ను చూడడానికి వచ్చారు, చూశారు కదా వెళ్ళండి" అన్నాడు గోవింద కోపంతో.

రాజశేఖరానికి మతిపోయింది.

●●●

**అతను మాట్లాడిన మాటలకు పద్మావతీదేవి** ఏమీ స్పందించనే లేదు. తప్పు అలా మాట్లాడకూడదు అని కూడా అనలేదు

అయితే పద్మావతీదేవిగారు పూర్తిగా అతని మత్తులో పడిపోయింది. పాపం అయ్యగారు ఎంతో కష్టపడి ఈ ఆస్థి అంతటినీ ఒకటికి పదింతలుగా పెంచారు. ఏమయిపోతుందో ఈ సిరి సంపద అంతా, మనవడూ, మనవరాలూ చూస్తే అమెరికాలో ఉన్నారాయె అనుకుంటున్న రాజశేఖరాన్ని--

"ఏమిటి బాబూ ఆలోచిస్తున్నావు. నేను ఈ పిల్లవాడిని బాగా చదివించి, పెద్దవాడిని చేసి సంపాదనా పరుణ్ణి చేసి ఈ ఆస్థిని రెట్టింపు చేయిస్తాను. నేనా వయసు పైబడినదాన్ని. సాధ్యమైనంత త్వరలో నా తదనంతరం ఇదంతా వీడికి రాయించేస్తాను. ఆ తరువాత మాత్రం ఇతను తన మనవడూ మనవరాలికే కదా ఇస్తాడు. ఈ విషయం మేం ఇంతకు ముందే చర్చించుకున్నాం కూడా" అంటున్న పద్మావతీదేవితో -

"అమ్మగారూ మీరు చెప్పే విషయాలన్నీ బాగానే ఉన్నాయి. ఒక్కసారి అమెరికాకు ఫోను చేసి వాళ్ళకు అన్నీ వివరించిన తరువాతే ఏ పనైనా చెయ్యండి" అన్నాడు రాజశేఖరం.

అందుకు చిరుకోపంతో ఆమె.

"బాగనే చెప్పావు. అలాగే చేస్తానులే, కొంచెం ఫలహారం చేసి వెళ్ళు" అంది.

"వద్దమ్మా. అయ్యగారు లేని ఈ ఇంట్లో ఒక్క చుక్క నీళ్ళు కూడా తాగలేనమ్మా. జాగ్రత్తగా ఉండండి" అంటున్న అతని వేపు కోపంగా చూస్తూ గోవింద. "రాజూ, నువ్వు అనవసరంగా పద్దూకి జాగ్రత్తలు చెప్పక. అయినా మా స్వవిషయాలలో జోక్యం చేసుకోడానికి నీకు అధికారం లేదు. నీ హద్దుల్లో నువ్వు ఉంటే మంచిది వెళ్ళు" అన్నాడు గోవింద.

పద్మావతీదేవి, సీతమ్మా ఆశ్చర్యపోయారు గోవింద మాటలు విని.

రాజశేఖరం అవమానంతో తలవంచుకుని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాక గోవింద--

"చూడు పద్దూ..

మనుషుల్లో చాలా మంది అసూయాపరులు. ఇంతకాలం తరువాత ఒంటరి తనంతో బాధపడుతూ ఎలాగో అతి కష్టం మీద కాలం వెళ్ళబుచ్చుతున్న నువ్వు సంతోషంగా ఉండడం జనం చూడలేకపోతున్నారు. ఈ సీతమ్మా సత్తెన్నా కూడా లోపల లోపల బాధ పడుతున్నారు కాని బయటకు నీతో చెప్పలేకపోతున్నారు.

పైగా నేను చెప్పేవన్నీ అబద్ధాలు అనీ, నీ ఆస్థి దోచుకోడానికో లేక నిన్ను చంపేసి మోసం చేసెయ్యడానికో నేను వచ్చానని వీళ్ళందరూ అనుకుంటున్నారు. అసలు నా వయసేమిటి? నేను ఏమిటి? నాకు మోసం చెయ్యాల్సిన అవసరం ఏముంది? ఇంత చిన్న వయసులో నాకూ ఆధ్యాత్మిక చింతన ఉంది సుమా'' అంటూ విచార వదనంతో మాట్లాడుతున్న గోవిందని చూసిన పద్మావతీదేవి అతలాకుతలం అయిపోయింది. ఆమె గుండెలు పిండేసినంత బాధపడిపోసాగింది.

''గోవిందా నువ్వు అలా మాట్లాడితే నన్ను చంపినంత ఒట్టు. ఈ అలగా జనంతో మనకు సంబంధం లేదు. నువ్వు అనవసరంగా ఇవన్నీ ఆలోచించి మనసు పాడుచేసుకోవద్దు'' అంటూంది పద్మావతీదేవి.

మనుషులకు ఉన్న పిచ్చిల్లో అనేక రకాలు ఉన్నాయి. అందులో నమ్మకం అనే పిచ్చి కూడా ఉంది. ఆ నమ్మకం ఒకోసారి గుడ్డి నమ్మకం అయిపోతుంది. అప్పుడు వాళ్ళకి చెవులు వినపడవు. కళ్ళు కనపడవు. ప్రేమ గుడ్డిది చెవిటిదీ అంటారు కదా. అలాగే ''నమ్మకం'' కూడా మనిషి జీవితంలో ''ప్రేమ''లాంటిదే ఎక్కువ శాతం నమ్మి చెడిపోయిన వారే కానీ బాగుపడిన వారి శాతం చాలా తక్కువ.

అయితే పద్మావతీదేవి గారి నమ్మి బాగుపడతాననే నమ్మకం, విశ్వాసంలో ఉంది మరి.

*ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తే షూప జాయతే*
*సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోభిజాయతే*
*క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః*
*స్మృతి భ్రంశా ద్బుద్ధి నాశనః బుద్ధి నాశాత్ ప్రణశ్యతి.*

విషయ చింతన వలన వాటియందాసక్తి జనించును. ఈ ఆసక్తి బలపడిన కోరిక అగును. ఈ కోరిక నెరవేరినచో సుఖం, విఫలమైనచో దుఃఖము కలుగును. ఈ దుఃఖం తుదకు క్రోధముగా పరిణమించును. కామం(కోరిక) నుండి క్రోధము జనించును. క్రోధం వలన ఆవేశం దాని వలన తన్ను తాను మరుచుట, పిమ్మట యుక్తాయుక్త వివేకం నశించును. ఈ స్థితిలో అనరాని మాటలాడుట, చేయరాని పనులు చేయుట, వీటి ఫలితంగా మనుజుడు చెడిపోవుట తటస్థించును.''

చుశారా అమ్మా కృష్ణభగవానుడు ఎంత బాగా చెప్పాడో. మనిషికి కోరికలు కలగనన్నాళ్ళూ ఏ చింతా ఉండదు. ఎప్పుడైతే అదికావాలి, ఇది కావాలి అనుకుంటారో అప్పుడే కష్టాలు మొదలవుతాయి.

అందుకని మనం కోరికలను అదుపులో పెట్టుకోవాలి''

సీతమ్మ భగవద్గీతా పఠనం చేస్తూంది, పద్మావతీ దేవి కళ్ళు మూసుకుని వింటూంది.

''ఏమే సీతమ్మ తల్లీ. నువ్వు ఎప్పుడు భగవద్గీత చదివినా, ఆ శ్లోకం లోని తాత్పర్యం నా ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా నన్నే ఉద్దేశించి నువ్వు చదువుతున్నట్లుగా ఉంటూందే నిజంగా అలా చదువుతున్నావా నువ్వు?'' అంది పద్మావతీదేవి.

''అలా ఎన్నటికీ కాదమ్మా. భగవద్గీత మనుషుల జీవితాలకు, జీవితాలలో జరిగే సంఘటనలకూ, మనిషి తన నిత్య జీవితంలో ఎలా మెలగాలి? తన జీవిత చదరంగంలో ఏ వయసులో ఏ విధంగా మెలగాలి? అన్నది బోధిస్తుందది. అందుకని భగవద్గీత ఎవరు చదివినా, వారిని ఉద్దేశించినట్లుగా ఉంటుంది. అలా నైపుణ్యంతో భగవద్గీత కృష్ణభగవానుడు బోధించాడు అనిపిస్తుంది. అదే భగవద్గీత లోని మహత్తు'' అంది సీతమ్మ.

''అదికాదే సత్తెన్న ఈ మధ్యన కనపడడంలేదు. ఏ రాచకార్యం మీద తిరుగుతున్నాడే వాడిని చూడక పోతే నాకు ఏదోలా ఉంటుంది. కానీ గోవింద వచ్చాక మీ ఇద్దరి విషయంలో నేను పట్టించుకోవడం లేదు. ఏమీ అనుకోకండే బాబూ'' అంది పద్మావతీ దేవి.

"మేం ఎప్పుడూ అలా అనుకోము అమ్మగారూ. అయినా మీరు చాలా సంవత్సరాల తరువాత అయ్యగారి కబుర్లు వినడంలో లీనమై పోయి ఉన్నారు. అందువలన మీకు సమయం, పరిసరాలు చుట్టూ ఉన్న మేమూ పట్టడం లేదు. పోనీలెండి మీరు సుఖ సంతోషాలతో ఉండడమే మాకు కావాల్సింది" అంది సీతమ్మ.

ఇంతలో మేడమెట్ల మీద నుండి గోవింద వస్తున్నాడు.

"అదిగో గోవింద వస్తున్నాడు. మా ఇద్దరికీ పాయసం చేశానన్నావు కదా. పట్టుకురా సీతమ్మ తల్లీ" అంది.

సీతమ్మ లోపలికి వెళ్ళింది.

గోవింద వచ్చి పద్మావతీదేవి ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

ఇంతలో...

"అమ్మగారూ. గోవింద ఏమంటున్నాడు? బాగా కలిసిపోయాడా మన బంగళాలో. మీతో బాగా కబుర్లు చెబుతున్నాడా?" అంటూ సత్తెన్న వచ్చి పద్మావతీ దేవి ఎదురుగా నేల మీదనే కూర్చున్నాడు.

"గోవిందా. ఏమిటింత ఆలస్యం. పది గంటలైపోయింది. ఉదయన్నే కాఫీ తాగడానికి, ఆ తరువాత పాలు తాగడానికి రాలేదేం. నేను ఒక్కదాన్నీ తాగలేక తాగలేదు" అంటున్న పద్మావతీదేవితో.

"అయ్యో అదేమిటి పద్దూ. సీతమ్మను పిలిచి వెంటనే తెమ్మనమని చెప్పు" అన్నాడు గోవింద.

"అది కాదులే ఇవాళ ఒక ముఖ్యమైన కార్యక్రమం తలపెట్టాను. అందుకని సీతమ్మను పాయసం చెయ్యమన్నాను. పాయసం తెస్తూంది అది తిన్నక ఒక ముఖ్యమైన విషయం మాట్లాడుకోవాలి" అంది పద్మావతీదేవి.

"అమ్మగారూ ముఖ్యమైన విషయ అంటున్నారు? ఏమిటి ఎక్కడికైనా వెళ్ళే కార్యక్రమం తలపెట్టారా ఏమిటి?" అన్నాడు సత్తెన్న.

"చూస్తూండు సత్తెన్నా నీకే తెలుస్తుంది." అందామె.

సీతమ్మ ట్రేలో రెండు వెండి బౌల్స్‌లో పాయసం పట్టుకు వచ్చింది. సత్తెన్నకు కూ గాజు బౌల్‌లో తెచ్చి ఇచ్చింది.

ముగ్గురూ పాయసం తిన్నాక పద్మావతీ దేవి "గోవిందా ఇవాళ మంచి రోజు అందుకని యావదాస్తి నా తదనంతరం నీకు రాసేద్దామనుకుంటున్నాను. నీ తదనంతరం మనవడూ, మనవరాలికీ చెందేట్లుగా కూడా డాక్యుమెంట్స్ తయారు చేయించమని లాయరుగారికి చెప్పాను.

ఎందుకంటే, నేనా పెద్దదాన్ని అయిపోయాను. నువ్వు పిల్లవాడివి. నాకు హఠాత్తుగా ఏదైనా జరిగితే, అమాయకుడివి నిన్ను మోసం చేసి ఆస్థి ఎవరైనా కాజేసి నిన్ను అనాథ చేసేసే ప్రమాదం ఉంది. అందుకనే ఈ ముందు జాగ్రత్త" అంటున్న ఆమెను అరచేత్తో మాట్లాడవద్దని సైగ చేసి గోవిందు..

"పద్దూ. ఆ శుభాలు మాట్లాడవద్దు. నేను మళ్ళీ వచ్చేశాను కదా. ఏవీ జరగవు. నువ్వు అనవసరంగా ఆందోళన పడవద్దు.

అది సరే. నేను నీకు సంతకం చేయడం నేర్పించాను కదా. ఇప్పుడు బాగా సంతకం చేస్తున్నావా ఏదీ చూపించు"` అని తాను చదువుకునే తెల్లకాగితాల లాంగ్ నోట్ బుక్ తన చేతిలోకి తీసుకుని బాల్ పెన్‌తో వ్రాయబోతుంటే

సత్తెన్న ఆమె చేయి పట్టుకుని --

"అమ్మగారూ మీరు ఎక్కడ పడితే అక్కడ సంతకాలు చేయకూడదు" అని అనగానే, గోవిందు అతని తలమీద ఒక దెబ్బవేశాడు అరచేత్తో.

పద్మావతీ దేవి హతాశురాలయింది ఈ చర్యతో..

"అదేమిటి గోవిందా మన నమ్మిన బంటుని అలా కొట్టేవు?" అంది.

"అది కాదు పద్మూ. మన ఇద్దరి మధ్యన అలా ఎవరైనా కలగ చేసుకుంటే నాకు మహా కోపం వచ్చేస్తుంది" అంటూ సత్తెన్న వేపు తిరిగి "సత్తెన్నా ఏమీ అనుకోకు" అని తను కొట్టిన చోట అర చేత్తో నిమిరాడు అతని తలపైన.

"అయినా మధ్యాహ్నం లాయరుగారు వస్తారు కదా బాబూ ఇప్పుడు సంతకాలు పెట్టడం ఎందుకు చెప్పండి?" అన్నాడు సత్తెన్న.

"అవును నిజమే. అప్పుడే సంతకం పెడతానులే. కాదంటే ముందు ఒక చిత్తు కాగితం మీద సంతకం పెట్టి ఆ తరువాత డాక్యుమెంట్లు మీద పెట్టవచ్చునులే" అంది పద్మావతీదేవి.

"సత్తెన్న చెప్పింది కూడా మీ మంచికే అమ్మగారూ. తమరు కోట్ల ఆస్థికి చెందిన వారు. అలా సంతకాలు చెయ్యకూడదు. తమరి సంతకం విలువ కొన్ని కోట్లు మీకు తెలియడంలేదు" అంది సీతమ్మ.

"గోవిందా. ఆయన పోయినప్పటినుంచీ వీళ్ళిద్దరూ నాకు రెండు కళ్ళుతో సమానం. నన్ను అనుక్షణం కాపాడుతూ, సలహాలు ఇస్తూ అలాగే నాకు సేవలు చేస్తూ నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్నారు.

పోనీలే మధ్యాహ్నం లాయరు గారు వచ్చేక సంతకాలు పెడతానులే. ఇప్పుడు నేను నా సంతకం చాలా బాగా పెడుతున్నాను. ఇంగ్లీషులో కూడా సంతకం నేర్చుకున్నాను. తెలుసా?" అంది పద్మావతీదేవి.

●●●

**పూర్ణమదః పూర్ణమిదం**

**పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే**

**పూర్ణస్య పూర్ణ మాదాయ**

**పూర్ణమే నా వశిష్యతే**

జీవాత్మ పరమాతం రెండూ పరిపూర్ణ స్వరూపాలే. ఆ పరిపూర్ణ స్వరూపాలే. ఆ పరిపూర్ణ స్థితి నుండి ఈ జీవాత్మ అనే పరిపూర్ణం వచ్చింది. జీవాత్మ అనే పరిపూర్ణం నుండి పూర్ణం తీసేస్తే తిరిగి మళ్ళీ పూర్ణమే మిగిలి ఉంటుంది. ఇక్కడ పూర్ణం అంటే సున్నా అని అర్ధం.

సున్నాలోంచి సున్నా తీసేస్తే సున్నానే గదా మిగిలేది.

మనిషి జన్మించినప్పుడు సున్నానే. అతనిలో జీవాత్మ అనేది ఉన్నంతకాలం అతను మనిషిగా పరిగణింపబడతాడు. అతనిలో జీవాత్మ ఎగిరిపోయి నిర్జీవి అయినప్పుడు అతను సున్నాతో సమానం. అప్పుడు అతని శరీరం భౌతిక కాయం అవుతుంది. అంటే సున్నాలోంచి సున్నా తీసేసినట్టుగా.

అయినా సరే మనిషి తన జీవితంలో ఈ అశాశ్వతమైన జీవాత్మ నిండిన ఈ సున్నా జీవితం కోసం ఎన్నోపాట్లు పడుతూంటాడు. ఎప్పటివరకూ అంటే తన శరీరంలోని జీవాత్మ ఎగిరిపోయే చివరి క్షణం వరకూ ఏదో తాపత్రయం. మాయదారి ఆరాటం. తన బ్రతుకు చివరకు భౌతికకాయం అయిపోతుంది, దానిని సాధ్యమైనంత త్వరలో పంచ భూతాల్లో కలిపేస్తారనీ, గడ్డి కన్నా పనికిరానిదైపోతుందనీ తెలుసుకోడు.

పద్మావతీ దేవి, తన భర్త పిల్లవాడి రూపంలో మరలా జన్మించాడనే పిచ్చి నమ్మకంతో అశాశ్వతమైన తన జీవితంపై మరలా ఎన్నో ఆశలు పెంచుకుంది.

అయినా సరే, మళ్ళీ తను ఏ క్షణంలోనైనా చనిపోతే ఆ పిల్లవాడికి అన్యాయం జరుగుతుందనీ, ఆస్థి అంతా అతనికి రాసేద్దామనే నిర్ణయానికి వచ్చేసింది. పైగా చిత్రమేమిటంటే ఎంతో శ్రమకోర్చి తన భర్త సంపాదించిన ఆస్థి న్యాయంగా అమెరికాలో ఉన్న మనుమడూ మనుమరాలికి చెందాల్సి ఉన్నా మధ్యలో ఉన్న పళంగా తన జీవితంలో ఊడిపడిన ఈ పిల్లవాడికి రాసేద్దామని అనుకోవడం సీతమ్మకూ

సత్తెన్నకూ కూడా కొరుకుడు పడడం లేదు. అయినా ఆమె ఎవరి మాటా వినేస్థితిలో లేదు. తన భర్తే ఆ పిల్లవాడి రూపంలో వచ్చేశాడనే ఊహలో ఉండిపోయిందామె. పైగా వాడు తన భర్త ప్రవర్తించిన తీరుగానే ప్రవర్తిస్తూ, పైగా "పద్దూ" "ఏరా" అని పిలుస్తూ ఆమెను మురిపిస్తున్నాడాయె. ఆ వేళ ఏది ఏమైనా సంతకాలు జరిగిపోవాలని అనుకుంటూంది పద్మావతీ దేవిగారు.

పద్మావతీ దేవి ఉయ్యాల బల్ల మీద కూర్చుని అసౌకర్యంగా అటూ ఇటూ కదులుతూంది.

ఇంతలో హాలు ద్వారం నుండి ఇద్దరు కాషాయ చీరలు కట్టుకున్న స్త్రీలు వస్తున్నారు. ఇదేమిటి మాత తాలూకు సేవకులు వచ్చారు. ఎవరు రమ్మన్నారు వీళ్ళని? అనుకుని..

"గూర్ఖాను పిలువు సీతమ్మా" అంది.

పరుగులతో గూర్ఖా వచ్చాడు.

"ఏమిటి వీళ్ళెందుకు వచ్చారు?" అంది కోపంతో గూర్ఖని.

"అదేమిటి అమ్మగారూ. తమరే ఇరవైమందిని ఆశ్రమం నుండి పంపమన్నారని మగాళ్ళూ, ఆడాళ్ళూ కలిసి ఇరవై మంది నా మాట వినకుండా లోపలికి వచ్చేశారు" అన్నాడు.

"ఏమిటో ఈ బంగళాలో ఏం జరుగుతూందో అర్థంకావడంలేదు. సీతమ్మా ఏమిటిది?" అంది.

వెంటనే సీతమ్మ "సత్తెన్న వచ్చాక అడిగి తెలుసుకుందాం అమ్మా కంగారుపడకండి. పోనీ వీళ్ళకి ఫలహారాలు పెట్టించి పంపేద్దాం లెండి" అంది.

ఇంతలో మేడ మెట్లు మీద నుండి గోవింద చేతిలో కాగితాలతో దిగి వస్తున్నాడు. వాడి ముఖం చాల సీరియస్‌గా ఉంది.

మాత దగ్గర నుండి వచ్చిన ఇద్దరు ఆడవాళ్ళు హాలులోకి వచ్చి పద్మావతీదేవికి నమస్కరించి ఆమెకు చెరో వేపూ నిలబడ్డారు.

"ఎందుకు వచ్చారు మీరంతా?" అంది పద్మావతీ దేవి చిరాకుగా.

"మాత మమ్మల్ని మీకు రక్షణగా ఉండమన్నారు తల్లీ. మీకు ప్రమాదం పొంచి ఉందని మాతకు ఉదయమే పూజలో దేవత చెప్పిందట. అందుకని.." అన్నారు వాళ్ళు.

"నా బొంద నాకు ప్రమాదం ఏమిటి? మీ మాతకు నా మీద వల్లమలిన ప్రేమ, అభిమానం సరేలే వచ్చారుగా సాయంత్రం దాకా ఉండి వెళ్దురు గానిలే" అంది పద్మావతీదేవి.

గోవింద వచ్చి పద్మావతీ దేవి ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

"పద్దూ ఈ రోజు ఒక విశేషం ఉంది నీకు తెలుసునా? నువ్వు నేను తిరిగి వచ్చాననే ఆనందంలో సర్వస్వం మర్చిపోయావు" అంటున్న అతని మాటలకు అడ్డువచ్చి..

"నాకు తెలుసు గోవిందా. అందుకనే ఈ రోజున ముఖ్యమైన కార్యక్రమం చేయాలనుకున్నాను. వచ్చే పుట్టినరోజుకు పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు కదా" అని పద్మావతీదేవి అంటూంటే ఫోను మోగింది. గోవింద ఫోను ఎత్తాడు.

ఒక్కసారి గౌరవంగా లేచి నిలబడి..

"అమ్మా నేను వద్దనే అంటున్నాను. కానీ తన యావదాస్తి నా పేరున రాసేస్తానంటూంది పద్దు. నా తదనంతరం మనవడికీ మనవరాలికే కదా చెందుతుంది. ఒకవేళ తనకు అనుకోనిది ఏదైనా జరిగితే నేను అనాథనైపోతానని తన భయం" అంటూ మాట్లాడుతున్న అతనితో "ఎవరు?" అని సైగ చేసింది పద్మావతీ దేవి.

"మన ఇంటి దైవం మాతా సత్య నిత్యానందమయి, నువ్వు నాకు ఆస్తి అంతా రాస్తానన్నావని చాలా బాధపడిపోతూంది" అన్నాడు.

"వీడికి మాతా నిత్య సత్యానందమయి కూడా గుర్తు ఉంది. తమ ఇంటిదైవం అని కూడా చెబుతున్నాడు. మరి వీడిని నమ్మకుండా ఎలా ఉండాలి తను? అందుకే ఈశాశ్వతమైన ఏర్పాటు" అనుకుంటూంది పద్మావతీ దేవి.

ఇంతలో సీతమ్మ రెండు వెండి గ్లాసులలో పాలు పట్టుకుని వచ్చింది. వెంటనే ఒక గ్లాసు పాలు తీసుకుని గబగబా తాగేశాడు గోవింద. మరో గ్లాసు తీసుకుని సీతమ్మతో..

"సీతమ్మా ఇవాళ పద్దు పుట్టిన రోజు. నేనే పాలు తాగిస్తాను. నువ్వు లోపలికి వెళ్ళు సీతమ్మా" అంటూ పాల గ్లాసు తీసుకుని, పద్మావతీదేవి వైపు ప్రేమానురాగాలతో, ఆప్యాయంగా, అపురూపంగా చూస్తూ ఆమె భుజం పట్టుకుని.

"ఏరా పద్దూ ఇంతటి సామ్రాజ్యాన్ని జాగ్రత్తగా కాపాడుతూ, నన్ను మరిచిపోకుండా ఎలా బ్రతుకుతున్నావే నా బంగారు కొండా" అంటూ ఆమెను చేతులు పట్టుకుని పాలు తాగించడానికి ఉద్యుక్తుడవుతూంటే...

"వద్దురా గోవిందా నేనే తాగుతానులే" అంటూంది పద్మావతీ దేవి.

"కాదు నేనే తాగించాలి ఇవ్వాళ.." అని గోవిందు గోముగా అంటూ ఉంటే టకటకా బూట్ల చప్పుడు వినిపించసాగింది. ఎన్నో బూట్లు నడుస్తున్న శబ్దం.

"పద్మావతీదేవి గారూ ఆ పాలు తాగకండి. మోసం" అంటూ శ్రీనివాసరావు హాలులో ప్రవేశించాడు. ఇద్దరు యస్.ఐలు గోవిందను రెండు చేతులతో బలంగా పట్టుకున్నారు. మరో ఇద్దరు పోలీసులు పద్మావతీ దేవికి అటూ ఇటూ ఉన్న కాషాయ రంగు చీరలు కట్టుకున్న స్త్రీలను పట్టుకున్నారు.

"ఏమిటిదంతా?" అంది పద్మావతీదేవి ఏం జరుగుతుందో అర్థం కాక.

"పద్మావతీదేవిగారూ. ఈ గోవింద, పునర్జన్మ అంతా నాటకం. ఒక పెద్ద కుట్ర. మాత పంపిన సుమారు ఇరవై మంది బలమైన రౌడీలు మీ బంగళాను చుట్టుముట్టారు. వాళ్ళ పథకం ఏమిటంటే, ఈ గోవింద మీ చేత పాలు తాగించగానే మీరు పడిపోతారు. వెంటనే తన చేతుల్లో ఉన్న డాక్యుమెంట్లలో మీ సంతకాలు చేయించేసి ఇంట్లో ఉన్న అందరినీ చంపేసి, బంగళా స్వంతం చేసేసుకుని, మొత్తం ఆస్థి అంతా స్వాధీనం చేసేసుకోవాలని కుట్ర పన్నారు. అందుకు ఈ పిల్లవాడిని ఎరగా వేశారు. పునర్జన్మ, జ్ఞాపకాలు అనే బలహీనతతో మిమ్మల్ని లొంగదీశారు." అంటున్న శ్రీనివాసరావును అభినందన పూర్వకంగా చూస్తూ..

"బాబు దేవుడులా వచ్చావు. ఇదంతా ఎలా తెలుసుకున్నావ్?" అంది పద్మావతీదేవి

"నేను పిల్లవాడి వివరాలు తెలుసుకుందమని వాళ్ళింటికి వెళ్ళాను. ముందు వాళ్ళని అడిగితే అసలు వాళ్ళకి పిల్లవాడే లేడన్నారు. తరువాత బెదిరిస్తే మీరు వచ్చి తీసుకువెళ్ళినట్లుగా చెప్పారు. నాకు మొదటిసారి మిమ్మల్ని కలిసినప్పుడే తెలుసును, మీరు నాకు చెప్పకుండా అతన్ని తీసుకు వచ్చేస్తారని అనుకున్నట్లే జరిగింది. నాకు ఎందుకో ఆ టెలివిజన్ ఇంటర్వ్యూ పరిశీలించాక ఇందులో ఏదో మోసం ఉందని అనిపించింది.

అప్పటి నుండీ మీ భవంతి విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నాను. పిల్లవాడి తల్లీ, తండ్రీ ఉంటున్న ఇల్లూ, మాత ఆశ్రమం, మీ బంగళా, మీ కదలికలూ అన్నింటి మీదా నిఘా పెట్టించాను. పోలీసులకు కూడా సమాచారం అందించాను.

ఒక రోజున మీ వారి మిత్రుడని చెప్పి రాజశేఖరం అనే మనిషిని నేనే పంపించాను బంగళాలో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుని వెంటనే చెప్పమని. అతను చెప్పాడు. పూర్తిగా మీరు పిల్లవాడి మాయలో మునిగిపోయారనీ పరిస్థితి ఎల ఉందో తెలుసుకుని వెంటనే చెప్పమని. అతను చెప్పాడు. పూర్తిగా మీరు పిల్లవాడి మాయలో మునిగిపోయారనీ పరిస్థితి బాగాలేదనీ చెప్పాడు. వెంటనే అలర్ట్ అయిపోయాను పోలీసులను కూడా హెచ్చరించాను.

మీ ఇంటికి ఒక బీద దంపతులు తమ పిల్లవాడు తప్పిపోయాడని వచ్చారు నిజమేనా?"

"అవును బాబూ. మాకు ఏం తెలియదని చెప్పాము" అంది పద్మావతీదేవి.

"ఈ పిల్లవాడిని నిజంగానే వాళ్ళ దగ్గర నుండి కిడ్నాప్ చేసి తీసుకువచ్చారు. బీదపిల్లవాడైతే తమ పని అయిపోయాక చంపేయచ్చని, పాపం చాలా బీద దంపతుల పిల్లవాడిని కిడ్నాప్ చేశారు.

ఈ పిల్లవాడి తల్లీ తండ్రీ నిజంగా ఇప్పుడున్న వాళ్ళుకాదు, వాళ్ళూ గూండాలే.

గోవిందరాజులు గారి వ్యక్తిగత డైరీలు మాతా నిత్య సత్యానందమయి కొంత మంది చేత మీ బంగళా నుండి చాలా నమ్మకంగా దొంగిలించింది. వాటి సహాయంతో మీ భవంతి పరిసరాలు మీ భర్తగారి అలవాట్లు, మీ దాంపత్యం, మీ వారు మిమ్మల్ని ఎలా చూసుకునేవారు, మీ కుటుంబ వివరాలూ అన్నీ బాగా స్టడీ చేశారు, పిల్లవాడికి అన్ని విషయాలలో బాగా ట్రైనింగ్ ఇచ్చారు.

పైగా మీరు కష్టాలలో ఉన్నప్పుడు మాత దగ్గరకు వెళ్ళినప్పుడల్లా మీ కుటుంబంలో జరిగిన సంఘటనలు అన్నీ బాగా తెలుసుకుని కొన్ని సంవత్సరాల నుండి ఈ ప్లాన్ వేసింది. చాలా జాగ్రత్తగా ట్రాప్ చేసింది. "

●●●

**అయితే ఈ కుట్రలో కొంచెం కంగారు పడి దొరికిపోయారు అందరూ.**

నేను సీన్‌లో ప్రవేశించక పోతే ఏం జరిగేదంటే..

మీరు గోవింద ఇచ్చిన పాలు తాగగానే స్పృహ కోల్పోతారు. కొంచెం సేపటికి చనిపోతారు. వెంటనే సీతమ్మనూ చంపేస్తారు. ఇప్పటికే బయట సత్తెన్ననూ, గూర్ఖానూ మాత రౌడీలు బంధించేశారు. ఇక్కడ మీ పనీ, సీతమ్మ పనీ అయిపోగానే, బయట వాళ్ళనీ చంపేస్తారు. గుట్టు చప్పుడు కాకుండా డాక్యుమెంట్ల మీద కొన ఊపిరిలో ఉన్న మీ చేత సంతకాలు పెట్టించేసి, బంగళా మూసేస్తారు. మీ మనవడు గారు మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడమని నన్ను పంపించారు మీ బంగళాకి. కానీ మీరు నన్ను లెక్కచేయలేదు. నేను చేసే పనులన్నీ రెండో కంటికి తెలియకుండా జాగ్రత్తగా వ్యవహరించాను.

గోవిందరాజులు గారు ఎంతో కష్టపడి సంపాదించిన ఆస్థులూ, పొలాలూ, డబ్బూ, నగలూ మొత్తమంతా మాతా సత్యానందమయి ఆశ్రమానికి వెళ్ళిపోయేవే.

అమెరికా నుండి మీ మనవడు ఫోన్ చేసి చివరకు నెల తిరిగాక ఇండియాకు తిరిగి వచ్చి చూసే ఏముంది ఇక్కడ?

ఏమీ ఉండదు. ఎవర్నీ అడగడానికి కూడా వీలు ఉండదు.

ఇదంతా మాత వేసిన పథకం. మీరు పరిపూర్ణంగా ఆమెను మీ ఇంటి దైవంగా భావించి, అత్యధికంగా డబ్బు విరాళం అందించినందుకు ఆమె ఇలా చేసింది.

బంగారు బాతు గుడ్డు కథలోలాగా మొత్తం బంగారు బాతునే చంపేస్తే పోలేదా అన్నట్లుగా చేసిందామె, కానీ కథ వేరు జీవితం వేరు కదా.

పోలీసు బలగాలు మాత ఆశమంలో ప్రవేశించాయి, ఆమెనూ వీళ్ళందరినీ కోర్టులో ప్రవేశపెడతారు. "

"అయ్యో నా కొడుకా" అంటూ గోవింద అసలు తల్లితండ్రులు అలోపాలోమని ఏడుస్తూ లోపలకు వచ్చారు.

"బాబూ మా కొదుకుని వదిలేయండి. వాడికేం తెలియదు. ఆడిని ఎత్తుకుపోయారు దుర్మార్గులంతా" అంటూ విలపించసాగేరు.

"అమ్మా కోర్టులో ప్రవేశపెడతారు పోలీసులు. న్యాయస్థానంలో మీ అబ్బాయి నేరం చేయలేదని తేలితే వదిలేస్తారు. అయినా శిక్ష తప్పదు కుట్రలో భాగం అయినందుకు" అన్నాడు శ్రీనివాసరావు.

"అమ్మగారూ.." అంటూ సత్తెన్న గూర్ఖా పరుగులతో ఏడుస్తూ లోపలకు వచ్చారు.

"ఈ బాబు గన్నా సమయానికి రాకపోతే ఈ పాటికి మనమంతా చచ్చిపోయి ఉండేవాళ్ళం అమ్మా. చూశారా అమ్మగారూ మాత ఎంత పని చేసిందో" అంటూ విలపించసాగాడు సత్తెన్న.

బయట ఒక పోలీస్ వేన్‌లో మాత ఆశ్రమం నుండి వచ్చిన మనుషులనూ, గోవిందనూ, కాషాయరంగు చీరలు కట్టుకున్న స్త్రీలనూ వేన్లు ఎక్కించారు. పోలీసులు రెండు జీపులలో వెళ్ళి పోయారు.

బంగళా బయట "మిస్టర్ శ్రీనివాసరావ్. మీరు వెనకాలే రండి. చాలా పని ఉంది." అంటూ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కారులో వెళ్ళిపోయారు.

శ్రీనివాసరావు అమెరికాకు ఫోన్ చేసి విషయమంతా క్లుప్తంగా వివరించి చెప్పాడు. అతను నిట్టూరుస్తూ లోపల పద్మావతీదేవి గారి దగ్గరకు వచ్చి..

"అమ్మా పద్మావతీదేవిగారూ..

మనిషి చనిపోయాక ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. అందుకనే మనం చనిపోయిన వారి ఫోటోలు ఇంట్లో పెట్టుకుని దండలు వేసి రోజూ నమస్కరిస్తాం వాళ్ళని కూడా దేవుడితో సమానంగా భావించి, అంతే కానీ చనిపోయినవారే మరలా పుట్టిన దాఖలాలు లేవు. అయితే చనిపోయినవారి ధ్యాసతో మరీ పిచ్చిగా ఆరాధిస్తే వారు కలలోకి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇది జరిగితే జరగవచ్చును. అంతేగానీ వాళ్ళు పునర్జన్మ ఎత్తేరన్నది శుద్ధ అబద్ధం.

నూటికి తొంభై తొమ్మిదిన్నరశాతం ఇలాంటి పునర్జన్మ వార్తలన్నీ మోసపూరితమైనవే. మనుషుల లోని బలహీనతలను సొమ్ము చేసుకోడానికే ఇలాంటి సంఘటనలు ఉపయోగపడతాయి.

అయినా అమ్మగారూ, రోజూ గంటలకొద్దీ పూజ చేస్తారు. పురాణ గ్రంధాలు చదువుతారు, పౌరాణిక ఉపన్యాసాలు వింటారు, పదిమందికీ మహోపకారం చేస్తారు, దానాలు చేస్తారు విరివిగా అలాంటి మీరు ఎలా నమ్మారమ్మా ఈ సంగతి?

ఏది ఏమైనా మీరు చేసిన దానధర్మాలు, పుణ్యాలు దేమునికి చేసిన పూజలూ మిమ్మల్ని కాపాడాయి. లేకపోతే గోవిందరాజులు గారు పునర్జన్మ ఎత్తి మీ వద్దకు రావడం కాదుగానీ మీరే ఈ పాటికి చనిపోయి వారి దగ్గరకు వెళ్ళిపోయి ఉండేవారు.

పోనీలెండి. ఇకనుండైనా జాగ్రత్తగా ఉండండి. సత్తెన్నా, సీతమ్మా గూర్కా కూడా మీకు నమ్మిన బంటులే వాళ్ళ మాటలు కూడా మీరు అప్పుడప్పుడు వినాలి.

అయినా మీ మనవడుగారు నన్ను మీ రక్షణగా ఉండమన్నారు. శాశ్వతంగా మిమ్మల్ని చుసుకుంటూ ఉండమని చెప్పారు. అన్ని విషయాలూ వారికి చెప్పాను ఇప్పుడే రెండు మూడు రోజుల్లో అమెరికానుండి బయలుదేరి మిమ్మల్ని చూడడానికి వస్తామని చెప్పారు. వాళ్ళు జరిగింది చెబుతుంటే చాలా భయపడిపోతున్నారు.

వాళ్ళు ఆస్తుల గురించి బాధపడడం లేదు. అమాయకులైన మీరు ఎలా మొసపోయారో అసలు వాళ్ళకు దక్కకుండా పోతారేమో అని ఆవేదన చెందుతున్నారు.

జాగ్రత్తగా ఉండండమ్మా. పోలీసు వచ్చి మాత గురించి అడిగితే - మాకు ఆమె ఎవరో తెలియదు అని చెప్పండి. అయినా నన్ను అడగకుండా ఏమీ చెప్పద్దు, నేను అన్నీ చూసుకుంటాను" అంటూ వెళ్ళిపోయాడు శ్రీనివాసరావు.

అతను వెళ్ళగానే

"అమ్మగారూ" అంటూ సత్తెన్నా, సీతమ్మా, గూర్ఖా పద్మావతీదేవి చుట్టూ మూగారు.

సీతమ్మ అయితే ఆమెను పట్టుకుని ఒళ్ళంతా తడుముతూంది.

"ఏనాటి అనుబంధమో మీరు ఉండబట్టి నేను బ్రతికిపోయాను ఇవాళ" అంటూంది పద్మావతీదేవిగారు వాళ్ళతో కొంగుతో తుడుచుకుంటూ.

"కాదమ్మగారూ ఆ దేవుడే మనందర్ని కాపాడాడు" అంటూ మెట్ల దగ్గర ఉన్న గోవిందరాజులు గారి ఆయిల్ పెయింటింగ్ వేపు చూసి రెండు చేతులూ జోడించి నమస్కరించారు వాళ్ళందరూ.

టెలివిజన్‌లో భక్తి సమాచారం వస్తుందని గుర్తుకు వచ్చి సీతమ్మ టెలివిజన్ ఆన్ చేసింది. అందులో స్వామీజీ ఒకరు ఉపన్యసిస్తున్నారు.

"ఈ రోజు మనం పునరపి జననం - పునరపి మరణం అనే అంశంపై కొన్ని విషయాలు ముచ్చటించుకుందాం.

కర్మఫలంను మూడు విధాలుగా చెబుతారు. అనేక జన్మాంతరముల నుండి ఎటిగిన కర్మజాలమును సంచిత అని, సంచిత కర్మము నుండి ఈ జన్మమునందు అనుభవించవలసిన కర్మను ప్రారబ్ధం అని ఈ జన్మమందు చేయబడి ముందు జన్మములందు అనుభవించవలసిన కర్మను ఆగామి అని చెపుతారు.

చేసిన ఏ పనీ వృధాపోదు. ప్రతి పనికి మంచో, చెడో ఫలితం ఉంటుంది. ఆ ఫలితాన్ని మానవుడు అనుభవించక తప్పదు. కొన్ని ఫలితాలను అప్పటికప్పుడే అనుభవిస్తాడు. కొన్ని కర్మల ఫలితాలు ఈ జన్మలో అనుభవించలేకపోవచ్చును. మనిషి మరణించినా కర్మఫలం నశించదు. అది  జీవాత్మను వాసన రూపంలో అంటిపెట్టుకుని కొనసాగుతూనే ఉంటుంది.

అందుచేత అనేక జన్మలలో అనుభవానికి రాకుండా మిగిలిపోయిన సంచిత కర్మఫలం విధిగా జీవుడిని మరొక జన్మ ఎత్తేటట్లు చేస్తూంది. ఈ జన్మ మొదలు అయిన దగ్గర నుండి శరీరాన్ని విడిచి పెట్టేవరకూ అనుభవించిన కర్మను ప్రారబ్ధం అంటారు. ఈ ప్రారబ్ధ కర్మను ఎవ్వరూ తప్పించలేరు. ఈ జన్మలో జీవుడు కొన్ని కర్మలు చేస్తాడు. ఆ కర్మఫలాల్లో కొన్నింటిని అనుభవించాక ఇంకా కొన్ని మిగిలిపోయి పెద్ద గుట్టగా మిగిలిపోతాయి. వాటిని అనుభవించడానికి మరొక జన్మ ఎత్తవలసి వస్తుంది. పాతకర్మల అనుభవాలు తరిగిపోతూంటే, కొత్తవి పెరిగిపోతూంటాయి. ఇదొక నిరంతర చక్రం. దానికి ఆది, అంతం లేదు. అందుకే మానవుడు జనన, మరణ పరంపర అనే చక్రంలో పడి తిరుగుతూ ఉంటాడు. అదే కర్మ సిద్ధాంతం. దీన్ని ఫిజిక్స్‌లో 'లా ఆఫ్ కన్సర్వేషన్ ఆఫ్ ఎనర్జీ'తో పోల్చారు విజ్ఞులు. ఎనర్జీకి నశింపులేదు. రూపాంతరం చెందుతుంది. అంతే! అలాగే కర్మ కూడా.

కర్మఫలం అనుల్లంఘనీయం. సత్కర్మ పట్ల ఉత్తమ గతులు, దుష్కర్మ వలన అధమ గతులు ప్రాప్తిస్తాయి. ఏ కర్మ అయినా పునః పునర్జన్మలకు కారణం అవుతుంది.

మానవుని మరణానంతరం ఆత్మ రెండు విధాలుగా ప్రయాణిస్తుంది. ఒకటి దేవయానం లేదా ఉత్తరాయణ మార్గం, రెండవది పితృయానం, లేదా దక్షిణాయన మార్గం.

శ్రేయో మార్గంలో జీవితం గడుపుతూ తనువు చాలించే వారు వరుసగా తేజో మార్గాన పగటిని దాటుకుని, తర్వాత శుక్లపక్షాన్ని ఉత్తరాయణాన్ని చంద్రుడిని, సంవత్సరాన్ని సూర్యుదిని దాటుకుని విద్యుత్తులోకి ప్రవేశిస్తారు. అక్కడ మానవుడు కాని పురుషుడు ఉంటాడు. అతను ఆత్మను బ్రహ్మలోకి ప్రవేశిస్తారు. అక్కడ మానవుడు కాని పురుషుడు ఉంటాడు. తను ఆత్మను బ్రహ్మలోకి తీసుకుపోతాడు. అక్కడ నుండి ఇక తిరిగి రావడం అనేది ఉండదు. ఇక జన్మ అంటూ ఉండదు. అదే ముక్తి, మోక్షం. ఆత్మ ఈ విధంగా ప్రయాణం చేసేది దేవయానం.

శ్రేయో మార్గంలో జీవితం గడుపుతూ తనువు చాలించే వారు వరుసగా తేజో మార్గాన పగటిని దాటుకుని, తర్వాత శుక్లపక్షాన్ని, ఉత్తరాయణాన్ని చంద్రుడిని, సంవత్సరాన్ని సూర్యుడిని దాటుకుని విద్యుత్తులోకి ప్రవేశిస్తారు. అక్కడ నుండి ఇక తిరిగి రావడం అనేది ఉండదు. ఇక జన్మ అంటూ ఉండదు. అదే ముక్తి, మోక్షం. ఆత్మ ఈవిధంగా ప్రయాణం చేసేది దేవయానం ధూమంలో

ప్రవేశించి, కృష్ణపక్షంలోకి, దాని నుంచి దక్షిణాయనంలోకి ప్రవేశిస్తారు. కానీ సంవత్సరాన్ని చేరుకోలేరు. అక్కడి నుండి వారు పితృలోకంలోకి ప్రవేశిస్తారు. దాని నుండి ఆకాశంలో, అక్కడి నుండి చంద్రునిలో ప్రవేశిస్తారు.

చంద్రలోకంలో తమ పుణ్యకర్మల ఫలం హరించిపోయే వరకూ ప్రేతలు నివసిస్తాయి. పిదప తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుంది. మొదట ఆకాశంలోనికి, ఆ తరువాత వాయుమండలంలోనికి ప్రవేశిస్తారు. వాయువుగా మారి, పిదమ ధూమంగా, ఆ పిమ్మట మేఘంగా, వర్షంగా మారి భూమిపైకి దిగుతారు. ఆ తర్వాత వరిధాన్యంగానో, యువధాన్యం గానో, ఓషధీలతలుగానో వృక్షాలుగానో, తిలలు గానో చిక్కుడు అంకురాలు గానో జన్మిస్తారు. ఆ ధాన్యాదులను భుజించిన ప్రాణులలో రేతస్సుగా మారి తిరిగి జన్మిస్తారు.

ఈ జనన మరణ చక్రం నుండి విముక్తి కావాలనుకుంటే ఏమి చేయాలి?

కర్మఫలం వలనే జనన మరణ చక్రంలో చిక్కుకుంటున్నారు

కావున కర్మఫలంను విడిచి పెట్టాలి.

ఈ విషయాన్ని శ్రీకృష్ణభగవానుదు భగవద్గీతలో ఎలా చెప్పాడో చూద్దాం.

**"త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయ:**
**కర్మణ్యభిప్రవృత్తోపి నైవ కించిత్కరోతినః"      అ-4 శ్లో -20**

ఏ మనిషి సకల కర్మల యందును, ఫలము నందును ఆసక్తిని పూర్తిగా వదిలిపెట్టి ప్రపంచం మీద ఆధారపడక పరమాత్మ యందే సదా తృప్తి వహించునో, అట్టివాడు కర్మల యందు పూర్తిగా నిమగ్నుడై యుండియు వాస్తవమున ఏమియు చేయనివాడే అగుచున్నాడు.

**"నహి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్య శేషతః**
**యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభి ధీయతే    అ- 18 : - 11**

దేహి అయిన వాడికి కర్మలను విడిచిపెట్టడం సాధ్య కాని పని. అందుచేస్త విడిచి పెట్టవలసింది కర్మలను కాదు. వాటి ఫలాలను, కర్మఫలాన్ని విడిచిపెట్టిన వాడే త్యాగి అనబడతాడు.

**"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన**
**మా కర్మఫల హేతుర్భూర్మా తే సంగోస్త్వ కర్మణి    అ- 2: శ్లో 47**

నీకు కర్మ చెయడానికే అధికారం ఉంది తప్ప కర్మఫలం ఆశించడానికి అధికారం లేదు అలాగని కర్మలు చేయకపోవడం పట్ల కూడా నీకు ఆసక్తి కలుగరాదు.

ఇలాగ భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానులు మనకు ఉపదేశించి యున్నారు.

ఇక చివరగా ఈ రోజున నేను భక్తులకు చేసే విన్నపం ఏమిటంటే.."

అంటూ స్వామీజీ శెలవిస్తున్నారు.

కానీ చిత్రమేమిటంటే కోట్లాది రూపాయల ఖర్చుతో పాలరాయితో తాను ఆశ్రమం నిర్మిస్తున్నాననీ, ఆ ఆశ్రమ నిర్మాణానికి భక్తులను భూరి విరాళాలు ఇవ్వమనీ ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు ఆధ్యాత్మిక ఉపన్యాసం ముగింపుగా.

అదీ సంగతి.

"ఏమిటో ఈ మాయ" అనుకుంటూంది పద్మావతీ దేవి.

టెలివిజన్ ఆపు చేసింది సీతమ్మ.        **సమాప్తం**